తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
విజయవాడ
epaper.vaartha.com WWW.VAARTHA.COM : fb.com/vaartha Digital
Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
14-12-2025 ఆదివారం సంపుటి: 31
సంచిక: 313 పేజీలు: 10+4 వెల: 8.00

# క్వాంటం వ్యాలీకి అడ్రస్ ఏపి



నాలెడ్జ్ ఎకానమీ, టెక్నాలజీకి కేంద్రంగా విశాఖ

అమరావతి, విశాఖతో అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధే లక్ష్యం

రైతుల సమస్యలు నేనే పరిష్కరిస్తా: సిఎం చంద్రబాబు

**విజయవాడ, డిసెంబరు 13, ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీలో అమరావతి,విశాఖలతో పాటు అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధి జరుగుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు.ఏ రంగంలోనైనా ఏపీనే ముందంజన ఉంచుతామన్నారు.రాజధాని పరిధిలో నిర్మాణాల పూర్తికి సమయాన్ని నిర్ధేశించుకుని పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సీఆర్డీఏ పనులు పనుల పురోగతిపై ఆయన అధికారిక అప్డేట్ నివేదికలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సంబంధిత నివేదికలపై అధికారులకు పలు సూచనలు చేస్తూ మార్గదర్శనం చేశారు. సీఎంఓ కార్యాలయం ద్వారా అందిన సమాచారాన్ని అనుసరించి రాజధాని నిర్మాణ పనులు ప్రారంభించిన చోట కన్స్ట్రక్షన్ కోసం మౌలిక సదుపాయాల కల్పన, ఇతర అంశాలపై సీఎం తెలుసుకున్నారు. పనులకు ఎలాంటి ఇబ్బంది కలగని విధంగా నిర్మాణాల వద్ద మౌలిక సదుపాయాలను కల్పించామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాల కారణంగా నిర్మాణ పనులకు ఏమైనా ఇబ్బందులు వచ్చినా వర్షాకాలం పూర్తి >>2




హైదరాబాద్‌లో మెస్సీ హోరు

ఫైబర్‌నెట్ వ్యవహారం

## సిఎం చంద్రబాబుపై సిఐడి కేసు కొట్టివేత

**విజయవాడ,డిసెంబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** వైసీపీ అధికారంలో ఉండగా ఫైబర్‌నెట్ కార్పొరేషన్‌లో అవినీతి జరిగిందంటూ అప్పటి ప్రతిపక్ష నేత నారా చంద్రబాబు నాయుడుపై నమోదు చేసిన సీఐడీ కేసును విజయవాడ ఏసీబీ కోర్టు కొట్టివేసింది. ఈ కేసులో ఆయనతోపాటు మిగిలిన నిందితులకు క్లీన్‌చిట్ ఇచ్చింది. 2014-19 నడుమ ఫైబర్‌నెట్ కార్పొరేషన్‌లో నిబంధనలను ఉల్లంఘించి వివిధ సాఫ్ట్‌వేర్ కంపెనీలకు టెండర్లను కట్టబెట్టారని, దానివల్ల కార్పొరేషన్‌కు రూ.114 కోట్ల వరకు ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లిందని అప్పటి ఎండీ మధుసూదన్‌రెడ్డి ఫిర్యాదుతో సీఐడీ కేసు నమోదు చేసింది. నాటి ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్ వేమూరి హరికృష్ణ, ఎండీ కె.సాంబశివరావు, టెర్రాసాఫ్ట్ డైరెక్టర్ తుమ్మల గోపాలకృష్ణ, చంద్ర బాబు (ఏ25), ముంబై, ఢిల్లీకి చెందిన >>2







**Vijayawada: Varun Motors**: **Ring Road**: 9885701729 **Enikepadu:** 9885104222, 9885706831 | **Kanuru: Santosh Auto**: 7799787967 | **Eluru:** Reddy & Reddy Motors: 9533290285 | **Bhimavaram:** Novelty Reddy & Reddy Motors: 9948424555 | **Guntur: Jayalakshmi Automotives**: 7396669031 | **Nellore: Vishnu Cars**: 7995088876 | **Bhargavi Automobiles**: 9848357778 | **Ongole: Jayalakshmi Automotives**: 9949033433.



శనివారం కడప యరముక్కపల్లి కూడలిలో వాజ్‌పేయి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

# కడపలో వాజ్‌పేయి విగ్రహావిష్కరణ

## పాల్గొన్న కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ రాష్ట్రమంత్రులు సత్యకుమార్, సవిత

**కడప కార్పొరేషన్, డిసెంబరు 13 ప్రభాతవార్త:** మాజీ ప్రధాని, భారతరత్న వాజపేయి హయాంలో వచ్చిన స్వర్ణ చతుర్భుజి హైవే ప్రాజెక్టు దేశం దశదిశ మార్చిందని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రులు సత్యకుమార్, సవిత, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిన్.మాధవ్‌లు గుర్తుచేశారు. వాజపేయి స్ఫూర్తిని యువతలో నింపేలా అటల్ సందేశ్ మోదీ సుపరిపాలన యాత్ర తలపెట్టిన భాజపా కార్యవర్గం తలపెట్టిందన్నారు. వాజపేయి శత జయంతి సందర్భంగా ఈ నెల 11నుంచి 25 వరకు అటల్ సందేశ్ మోదీ సుపరిపాలన యాత్రలో భాగంగా కడప యరముక్కపల్లి కూడలిలో బిజెపి, టిడిపి, జనసేన మూడు పార్టీల నేతలూ కలిసి భారతరత్న వాజపేయి విగ్రహం ఆవిష్కరణ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వారు మాట్లాడారు. దేశంలో సుపరిపాలనకు వాజపేయి నాంది పలికారని, ఆయన తీసుకొచ్చిన పాలసీలు దేశాభివృద్ధికి మంచి పునాది వేశాయని గుర్తుచేశారు. అజాత శత్రువు, ప్రతి భారతీయుడు గర్వపడే నాయకత్వాన్ని దేశానికి ఇచ్చారని కొనియాడారు. ఒక సాధారణ కుటుంబంలో జన్మించిన ఆయన స్వశక్తితో పదిగి దేశానికి నాయకత్వం వహించారన్నారు. 9సార్లు లోక్‌సభకు, రెండుసార్లు రాజ్యసభకు ఎన్నికయ్యారంటేనే ఆయన గొప్పతనం తెలుస్తోం దన్నారు. పద్దెనిమిదేళ్ల వయసులో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారని, 1998లో పోఖ్రాన్ 2 అణు పరీక్షలు జరిపి భారతదేశ శక్తి చాటారన్నారు. కార్గిల్ యుద్ధంలో శత్రువులకు తిరుగులేని సమా ధానం ఇచ్చారని గుర్తు చేశారు. నాడు అణు పరీక్షలైనా, నేడు సింధూర్ అయినా, నాడు చతుర్భుజి అయినా నేడు సాగరమాల అయినా అవి పన్డీయే పాలనలో విజయవంతమైన కార్యక్రమాలని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ కూడా దేశాన్ని 2047నాటిక నంబర్ వన్ చేసేందుకు పని చేస్తున్నారన్నారు. యువతరానికి మోదీ స్ఫూర్తిని స్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ఆదినారాయణ రెడ్డి, మాధవి రెడ్డి, వరదల్ రెడ్డి, కృష్ణ చైతన్య రెడ్డి, ఎమ్మెల్సీ బీటెక్ రవి, బిజెపి జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, టిడిపి నాయకులు శ్రీనివాసులు రెడ్డి, రితేష్ రెడ్డి, హరి ప్రసాద్, బిజెపి నాయకులు శశిభూషణ్ రెడ్డి, బాలకృష్ణ యాదవ్, నాగోతు రమేష్ నాయుడు, వేణు వర్ధన్ రెడ్డి, దయాకర్ రెడ్డి, ప్రవీణ్ నాయుడు, చలపతి, బొమ్మన విజయ్, భాను ప్రకాష్, మనసుల సురేష్, లక్ష్మీ ్మనారా యణ రెడ్డి, దేవానంద్, సతీష్ చంద్ర, జనసేన నేత సుంకర శ్రీనివాస్, కూటమి నేతలు బిజెపి నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సిఎం చంద్రబాబుపై సిఐడి కేసు కొట్టివేత

>> సాఫ్ట్‌వేర్ కంపెనీలు, వాటి ఉన్నతాధి కారులను నిందితుల జాబితాలో చేర్చారు. మొత్తం 99 మందిని సాక్షులుగా పేర్కొన్నారు. కేసులో దర్యాప్తు పూర్తయినట్లు కొద్దిరోజుల క్రితం సీఐడీ అధికారులు విజయవాడ ఏసీబీ కోర్టుకు నివేదిక ఇచ్చారు. ఖజానాకు ఎలాంటి నష్టమూ వాటిల్లలేదని కేసును ఉపసంహరిం చుకుంటున్నట్లు అప్పటి ఎండీ మధుసూదన్‌రెడ్డి గత నెల 24న కోర్టులో అఫిడవిట్ దాఖలుచేశారు. ఇందుకు అభ్యంతరం లేదని ప్రస్తుత ఎండీ గీతాంజలి శర్మ కూడా అఫిడవిట్ ఇచ్చారు. కోర్టు తీర్పు వెలువడుతుందనే సమయానికి ఆ కార్పొరేషన్ మాజీ చైర్మన్, వైసీపీ నేత గౌతంరెడ్డి రంగప్రవేశం చేశారు. తీర్పు ఇచ్చే ముందు తన వాదనలను వినాలని ప్రొటెస్ట్ పిటిషన్ దాఖలు చేశారు. దీనికి విచార ణార్హత లేదంటూ న్యాయాధికారి పి.భాస్కరరావు పిటిషన్‌ను గురువారం కొట్టివేశారు. ఆ క్రమంలోనే ఫైబర్ నెట్ కేసును కూడా కొట్టి వేస్తూ తీర్పు వెలువరించారు. రాజకీయ కుట్రతోనే ఫైబర్‌నెట్ కేసులో చంద్రబాబుపై దర్యాప్తు చేపట్టిన సీబీఐ అభియోగాలను నిరూపించలేకపోయింది. అక్రమాలు జరిగలేదని స్పష్టం చేసింది. ఆయనపై అవినీతి ముద్ర వేసి గత ఎన్నికల్లో లబ్ధి పొందాలన్న రాజకీయ కుట్రతోనే ఈ కేసు పెట్టారని తేలిపోయింది.



పుస్తక ప్రదర్శనకు సంబంధించిన వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

# జనవరి 2 నుండి విజయవాడలో పుస్తకాల పండుగ

**విజయవాడ, డిసెంబరు 13, ప్రభాతవార్త:** జనవరి 2నుండి 12వరకు విజయవాడ ఇంధిరాగాంధి స్టేడి యంలో జరిగే పుస్తకాల పండుగలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని విజయవాడ బుక్‌ఫెస్టివల్‌సొసైటీ అధ్యక్షుడు టి. మనోహర్ నాయుడు కోరారు. శనివారం విజయవాడలో మీడి యాతో మాట్లాడుతూ 36వ పుస్తక ప్రాంగణానికి వడ్లమూడి విమలాదేవి పేరు, ప్రధాన వేదికకు డా బివి పట్టాభిరాం పేరు, విద్యార్థుల కార్యక్రమాల వేదికకు జయంత్ వాగ్లేకర్ పేరు పెడుతున్నామన్నారు. 2వ తేదీ సాయంత్రం 5 గంటలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లను ప్రారంభోత్సవానికి ఆహ్వానిస్తున్నామని, 5వ తేదీ సిద్దార్ధ కాలేజ్ నుండి పుస్తకమ హోత్సవంవరకు పాదయాత్ర నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి కె లక్ష్మయ్య, ఉపాధ్యక్షులు జె ప్రసాద్, సహాయ కార్యదర్శి ఎబిఎస్ సాయిరాం, ట్రెజరర్ కె రవి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# 21న రాష్ట్రమంతా పల్స్ పోలియో

## మంత్రి సత్యకుమార్ యాదవ్

**విజయవాడ,డిసెంబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 21న పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లూ చేశారని వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకమార్ యాదవ్ నేడొక ప్రకటనలో తెలిపారు. 5 ఏళ్లలోపు పిల్లల్లందరికీ పోలియో చుక్కల్ని తప్పకుండా వేయించాలని, కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని రాష్ట్రాల్లో నిర్వహిస్తారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 54,07,663 మంది 5ఏళ్ల లోపు పిల్లలకు 38,267 బూత్ లలో పోలియో చుక్కలు వేసేందుకు ఇప్పటికే జిల్లాలకు 61,26,120 డోస్‌లను రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు పంపించారని తెలిపారు. డిసెంబరు 21 పోలియో దినం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా బూత్ స్థాయిలో పిల్లలకు పోలియో చుక్కల్ని వేస్తారని, ఆరోజు పలు కారణాలవల్ల పోలియో చుక్కలు వేసుకోలేకపోయిన పిల్లలకు తిరిగి ఈనెల 22, 23 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి 76,534 బృందాలు పరిశీలిస్తాయని మంత్రి పేర్కొన్నారు. 1704 మెడికల్ అధికారులు, 39,494 ఇతరులు (ఫార్మసిస్టులు, నర్సింగ్ విద్యార్థులు, ఇతర సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఉపాధ్యాయులు), 4206 మంది పర్యవేక్షకులు నేషనల్ ఇమ్యునైజేషన్ డే కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఏర్పాట్ల గురించి ఆయా జిల్లాల కలెక్టర్లకు ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ లేఖలు రాశారని మంత్రి పేర్కొన్నారు.

# క్వాంటం వ్యాలీకి అడ్రస్ ఎపి

>> అయిన తర్వాత పూర్తిస్థాయిలో పనులు పరుగులు పెట్టించాలి. ఆర్థిక పరమైన ఇబ్బందులు లేవు. ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని ఆర్థిక శాఖకు కూడా చెబుతాను." అని ముఖ్యమంత్రి చెప్పారు. రాజధాని అభివృద్ధి యాత్ర ఆరంభమైందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. విభజన తర్వాత రాజధాని లేకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడింది. రాజధాని ఎక్కడ పెట్టాలనే అంశాన్ని కూడా చెప్పకుండా విభజన చేశారు. రాజధాని కోసం జాగా కూడా లేని పరిస్థితుల్లో రాష్ట్ర విభజన చేశారు. రాజధాని విషయంలో నాటి యూపీఏ ప్రభుత్వం లేనిపోని పంచాయితీ పెట్టింది. రాష్ట్రం మధ్యలో రాజధాని పెడితే అందరికీ బాగుంటుందని అమరావతిలో ఏర్పాటు చేశాం. రాజధాని నిర్మాణానికి భూమి కావాలి అన్నారు.ప్రణాళికలకు అనుగుణంగా రాజధాని నిర్మించగలరా అని అనుమానపడ్డారు. రెండవ విడుత ల్యాండ్ పూలింగ్‌కు రైతుల అండగా నిలిచారు.ఇప్పుడు ఆ పనిలో ఉన్నామన్నారు.రైతులు స్వచ్ఛంధంగా తమ సమ్మతి పత్రాలు అందిస్తున్నారు.సైబరాబాద్ నిర్మించిన అనుభవంతో అమరావతి నిర్మాణం ప్రారంభించాం. భూమి కోసం ఎదురుచూస్తున్న సమయంలో అమరావతి రైతులు నాకు దారి చూపారు. రాజధాని నిర్మాణానికి భూ సమీకరణ అనే కొత్త విధానాన్ని తెచ్చాం. సమీకరణ విధానాన్ని విజయవంతం చేసిన చరిత్ర అమరావతి రైతులదే. ప్రపంచంలో ఎక్కడా ల్యాండ్ పూలింగ్ విధానం లేదు...మనమే ఈ విధానాన్ని తెచ్చాం... సక్సెస్ చేశాం. అమరావతి పనుల రీస్టార్ట్ తర్వాత మొదటిగా సీఆర్డీఏ బిల్డింగ్ ప్రారంభమైంది.. నాకు సంతోషంగా ఉంది. సీఆర్డీఏ భవన ప్రారంభం రాజధాని అభివృద్ధి యాత్రకు ఆరంభం."అని ముఖ్యమంత్రి వివరించారు.రాజధాని కోసం అమరావతి మహిళా రైతులు రోడ్డెక్కి పోరాడారు...గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు చేశారు. రైతుల ఉద్యమానికి మద్ధతుగా నేను కూడా జోలె పట్టాను...ఉద్యమానికి అండగా నిలిచాను. కష్టాలు మరిచిపోవద్దు... రైతులు చేసిన త్యాగాల ఫలితాలను రైతులే అనుభవించాలి.. నేను దానికి పూర్తిగా కట్టుబడి ఉన్నాను. ఫేజ్1లో ల్యాండ్ పూలింగ్ కింద భూములిచ్చారు. భూములిచ్చినందుకు గత పాలకులు మిమ్మల్ని నానా హింసలు పెట్టారు. రాజధాని ఎడారి అన్నారు.అమరావతినివేశ్యల రాజధాని అన్నారు. ఎంతో అపహాస్యం చేశారు. రైతులకు రెట్టింపు గౌరవం దక్కేలా... రెట్టింపు ఫలాలు అనుభవించేలా చేస్తాం. అమరావతి ఓ మునిసిపాలిటీగా మిగిలిపోకూడదంటే అందుకు తగ్గ మౌలిక సదుపాయాలు అవసరం. అమరావతి పరిపాలనకు కేంద్ర బిందువుగా ఉంటుంది. రైతులు వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకుంటే అనుకున్న లక్ష్యాలు సాధిస్తారు. ఇంటికో పారిశ్రామికవేత్త విధానం అమరావతి నుంచే ప్రారంభం కావాలి. అమరావతి అభివృద్ధికి ఆటంకాలు లేవు. అమరావతిని క్వాంటం వ్యాలీ చేస్తున్నాం...

**ఎకనమిక్ రీజియన్ కింద విశాఖను అభివృద్ధి చేస్తున్నాం:** ఒకప్పుడు ఐటీ.. ఇప్పుడు క్వాంటం, డేటా సెంటర్, ఏఐ వంటి టెక్నో రంగాలదే హవా. అమరావతి రైతుల అభివృద్ధికి అండగా ఉంటాం... చేయూతనిస్తాం. రాజధాని అమరావతి పునాదులు చాలా బలంగా ఉన్నాయి. పవన్ కళ్యాణ్, బీజేపీలతో కలిసి ముందుకెళ్తున్నాం. విశాఖ కూడా అద్భుతంగా అభివృద్ధి అవుతోంది. దేశానికి వచ్చిన అతి పెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి విశాఖకు వస్తోంది. నా ఆలోచన ఎప్పుడూ ప్రజల కోసమే... వారి భవిష్యత్ కోసమ్మే అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. నెట్ జీరో కాన్సెప్ట్ తీసుకొచ్చి విశాఖను కాలుష్యరహిత నగరంగా తీర్చిదిద్దుతాం. ఇటీవల విశాఖ పెట్టుబడుల సదస్సులో 613 ఎంవోయూలు జరిగాయి. ఏడాదిలో ఇన్ని సంస్థలు పెట్టుబడులకు వచ్చాయంటే గేమ్ ఛేంజర్‌గా మారింది. ఇవన్నీ పూర్తయితే 23 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. నాలెడ్జ్ ఎకానమీకి విశాఖ చిరునామాగా తయారవుతుంది. అమెరికాకు సిలికాన్ వ్యాలీ ఉంది, భారత్‌కు క్వాంటం వ్యాలీ ప్రారంభమైంది. క్వాంటం వ్యాలీకి చిరునామాగా ఆంధ్రప్రదేశ్ కాబోతోంది. ప్రశాంతమైన, అందమైన ప్రాంతం విశాఖ. నాలెడ్జ్ ఎకానమీ, టెక్నాలజీకి కేంద్రంగా విశాఖ మారబోతోంది. త్వరలోనే విశాఖలో మెట్రో వస్తుంది. టెక్ తమ్మిన, నాన్‌రెల్ టెక్నాలజీస్, ఏసీఎన్ ఇన్ఫోటెక్‌కు భూమిపూజ చేసుకున్నాం. ఇమాజిన్నోవేట్ టెక్ సొల్యూషన్స్, ఫ్లూయెంట్ గ్రిడ్ లిమిటెడ్‌కు శంకుస్థాపన చేసుకున్నాం. మదర్సన్ టెక్నాలజీ, క్వార్బ్ టెక్నోసాఫ్ట్ సంస్థలకు భూమిపూజ చేసుకున్నామన్నారు.

# మాట నిలుపుకున్న డిసిఎం పవన్

## ఉపముఖ్యమంత్రికి దీపిక కృతజ్ఞతలు

**విజయవాడ,డిసెంబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** అడిగిన వెంటనే తమ ఊరికి రహదారి మంజూరు చేసిన ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు భారత మహిళా అంధుల క్రికెట్ జట్టు కెప్టెన్ దీపిక కృతజ్ఞతలు తెలిపారు. అంధుల క్రికెట్ జట్టు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ని కలిశారు. ప్రపంచ కప్ విజేతగా నిలిచిన భారతమహిళల అంధుల క్రికెట్ జట్టును డిసెంబర్ 12వ తేదీ ఉదయం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అభినందిం చారు. ఈ సందర్భంగా శ్రీసత్యసాయి జిల్లా అమరాపురం మండలంలోని మారుమూల గ్రామం తంబాళ హట్టికిచెందిన జట్టు కెప్టెన్ దీపిక తన గ్రామం రోడ్ల పరిస్థితి వివరించి, వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పవన్ కళ్యాణ్‌కు తెలిపారు. గ్రామానికి రోడ్డు వేయాలని వినతి చేశారు. అయితే, తాను వెంటనే చర్యలు తీసుకుంటానని పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా దీపిక తమ గ్రామానికి రోడ్డు లేదని మట్టిరోడ్డే దిక్కని, రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు. సరైన రోడ్డు లేని కారణంగా సత్యసాయి జిల్లాలోని తమ తాండా వాసులు పడుతున్న ఇబ్బందుల్ని దీపిక పవన్ దృష్టికి తెచ్చారు. స్పందించిన పవన్‌కల్యాణ్ రోడ్డు




డిసిఎం పవన్, అంధుల క్రికెటర్ దీపిక

వేయిస్తానని హామీ ఇచ్చారు. ఉప ముఖ్యమంత్రి ఆదేశాలతో సత్యసాయి జిల్లా అధికారులు దీపిక స్వగ్రామమైన మడకశిర నియోజకవర్గంలోని అమరాపురం మండలం హేమవతి పంచాయతీ పరిధిలోని తంబాల హట్టి తండా రోడ్డును పరిశీలించారు. హేమావతి నుంచి తంబలహెట్టి వరకూ రోడ్డు నిర్మాణానికి రూ.3.2 కోట్లు, గున్నేహాళ్లి నుంచి తంబలహెట్టీ వరకూ 5కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.3కోట్లు అవసరమని అధికారులు అంచనా వేశారు. తర్వాత కలెక్టర్ శుక్రవారం సాయంత్రానికల్లాపరిపాలనాపరమైన ఆదేశాలు జారీ చేశారు. పవన్‌కల్యాణ్ సత్వర స్పందనపై దీపిక సంతోషం వ్యక్తం అంధుల క్రికెట్ జట్టు కెప్టెన్ దీపిక ఓ వీడియో విడుదల చేశారు.

# 70 అడుగుల మెస్సీ విగ్రహం ఆవిష్కరణ

**కోల్‌కత్తా, డిసెంబరు 13:** ప్రపంచ దిగ్గజ ఆటగాడు లియోనెల్ మెస్సీ 70 అడుగుల ఎత్తైన విగ్రహాన్ని కోల్‌కత్తా సాల్ట్‌లేక్ స్టేడియంవద్ద ఆవిష్కరించారు. భారీ భద్రత కారణంగా విగ్రహాన్ని మెస్సీ వర్చువల్‌గా ప్రారంభించారు. అర్జెంటీనా ఫుట్‌బాల్ స్టార్ ప్లేయర్ భారత్ చేరుకున్నారు. శనివారం తెల్లవారుజామున పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలో ల్యాండ్ అయ్యారు. గోట్ ఇండియా టూరులో భాగంగా మెస్సి భారత్‌కు వచ్చాడు. కోల్‌కతా ఎయిర్‌పోర్టులో స్టార్ ప్లేయర్‌కి ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా సాల్ట్ లేక్ స్టేడియంలో ఏర్పాటు చేసిన70 అడుగుల ఎత్తైన తన విగ్రహాన్ని మెస్సీ ప్రారంభించారు. బాలీవుడ్ స్టార్ షారుఖ్ ఖాన్, పశ్చిమబెంగాల్ మంత్రి సుజిత్ బోస్‌తో కలిసి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో షారుఖ్ తనయుడు అబ్రామ్ కూడా పాల్గొన్నాడు. ఈ



పర్యటనలో భాగంగా దాదాపు 72 గంటల పాటు మెస్సి ఇండియాలోనే గడపనున్నారు. కోల్‌కతాతో పాటు హైదరాబాద్, ముంబై, ఢిల్లీల్లోనూ మెస్సి టూర్ చేయనున్నాడు. సోమవారం రోజు ప్రధాని నరేంద్ర మోదీని అర్జెంటీనా ప్లేయర్ మెస్సి కలవనున్నారు.

# చింతూరు- మారేడుమిల్లి ఘాట్ రోడ్డుపై ప్రభుత్వం ఆంక్షలు

**విజయవాడ,డిసెంబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** చింతూరు టూ మారేడుమిల్లి ఘాట్ రోడ్డు ప్రయాణంపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆంక్షలు విధించింది. రాత్రి వేళ ఘాట్ రోడ్డుపై ప్రయాణం చేయకుండా ఆంక్షల ఉత్తర్వులు జారీ చేశారు చింతూరు ఐటీడీఏపీవో శుభం నోక్వాల్. భద్రాచలం నుంచి రాత్రి వేళ ఆంధ్రప్రదేశ్ వెళ్లే వాహనదారులకు ఆంక్షలపై ప్రభుత్వం ఈ విజ్ఞప్తి చేసింది. ప్రజా భద్రత కోసం ఆంక్షలు శనివారం నుంచి అమల్లోకి రానున్నాయని ఏపీ ప్రభుత్వం తెలిపింది. అల్లూరి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం నేపథ్యలో ప్రభుత్వం ఈ ఆంక్షలు విధించింది. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు ఈ ప్రయాణంపై ఆంక్షలు ఉండనున్నాయి. వాహనదారులు ఈ విషయాన్ని గమనించాలని ఏపీ సర్కార్ సూచించింది. కాగా, అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం తులసి పాకలు ఘాట్ రోడ్‌లో నిన్న(శుక్రవారం) తెల్లవారు జామున బస్సు ప్రమాదం జరిగిందిజఈ ప్రమాదంలో 10 మంది మృతిచెందగా, 20మందికి తీవ్ర గాయాలయ్యాయి.

# విద్యతోపాటు విలువలూ ముఖ్యమే

## మంగళగిరి డాన్‌బోస్కో ఉన్నత పాఠశాల స్వర్ణోత్సవంలో మంత్రి లోకేష్

**విజయవాడ,డిసెంబరు 13,ప్రభాతవార్త ప్రతినిధి:** జీవితంలో విద్య కంటే విలువలు ఎంతో ముఖ్యమని, వాటిని విద్యార్థులు ఆచరించాలని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఎర్రపాలెం గ్రామంలో ఉన్న డాన్ బాస్కో పాఠశాల స్వర్ణోత్సవాలకు ఆయన హాజరయ్యారు. పాఠశాలను స్థాపించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. నూతనంగా ఏర్పాటు చేసిన సైన్స్ ప్రయోగశాలను ప్రారంభించారు. డాన్ బాస్కో పాఠశాల వ్యవస్థాపక ఛైర్మన్ చిన్నప్ప విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం లోకేశ్ మాట్లాడుతూ, తాను ఈ స్థాయిలో ఉండటానికి ఉపాధ్యాయురాలు మంజుల, అధ్యాపకులు, మంత్రి నారాయణ, ప్రొఫెసర్ రాజిరెడ్డి కారణమన్నారు. విద్యార్థులు ఏ స్థాయిలో ఉన్నా తమకు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులను ఎప్పటికీ మరువకూడదని సూచించారు. అనంతరం పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన ఫాదర్లను సత్కరించారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తామని హామీ ఇచ్చారు. పాఠశాలల్లో విద్యార్థులకు నైపుణ్యాన్ని పెంపొందించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందులోభాగంగా ఒకటి నుంచి



పదో తరగతి చదివే విద్యార్థులకు 202627 విద్యా సంవత్సరంలో కిట్లను పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. రూ. 830.04 కోట్ల నిధుల విడుదలకు ప్రభుత్వం అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సర్వేపల్లి రాధా కృష్ణన్ విద్యార్థి మిత్ర పేరిట రాష్ట్ర ప్రభుత్వం కిట్లను పంపిణీ చేస్తోంది. నోట్ బుక్‌లు, బెల్ట్, షూలు, బ్యాగ్, డిక్షనరీలు, పాఠ్యపుస్తకాలు, వర్క్‌బుక్‌లు, 3 జతల యూనిఫాం క్లాత్‌లను ఇవ్వనుంది. కిట్ల సేకరణ, పంపిణీ కోసం రూ. 157.20 కోట్లు నిధులను కేంద్ర ప్రభుత్వం ఇవ్వనుంది. టెండర్ల ప్రక్రియ ద్వారా కిట్ల సరఫరా, పంపిణీ దారులను నిర్ణయించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రకాశం జిల్లా కొండపి మండలం జార్లపాలెం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో బయాలజీ స్కూల్ అసిస్టెంట్, ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వర్తిస్తున్న మంచికంటి వెంకటేష్‌ను మంత్రి లోకేశ్ అభినందించారు.

ఆ మాస్టారు పిల్లల వికాసానికి బడినే కేంద్రంగా చేసుకొని అమలు చేస్తున్న బోధనా పద్ధతి స్ఫూర్తిదాయకమన్నారు. పాఠశాల విరామ సమయంలో విద్యార్థులతో పుస్తకాలు చదివించడం, తెలుగులో కథలు, కవితలు, వ్యాసాలు రాయించేలా తీర్చిదిద్దడం ప్రశంసనీయమని తెలిపారు. సెలవు రోజుల్లో విద్యార్థులను సమీప ప్రాంతాలలో విజ్ఞాన యాత్రలకు తీసుకెళ్తూ ప్రకృతి, పర్యావరణం, చరిత్రపై అవగాహన కల్పించడం విద్యా వికాసానికి ఎంతో దోహదం చేస్తుందన్నారు. విద్యాలయాల్లో గ్రంథాలయాల ఆవశ్యకత వివరిస్తూ సెలవు రోజుల్లో మంచికంటి మాస్టారు చేపట్టిన ప్రచారం చాలా మంచి కార్యక్రమమని మంత్రి అభినందించారు.

**వారం - వర్జ్యం**

14-12-2025, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మార్గశిరమాసం, దక్షిణాయణం
హేమంత ఋతువు, కృష్ణపక్షం
దశమి సా.6.52
హస్త ఉ.8.18, జ్యేష్ఠ కార్తె
వర్జ్యం : సా.5.15-రా.7.09
దు.సా.4.04-4.49
శుభసమయం : ఉ.6.30-7.15
రాహుకాలం - సా.4.30-6.00

**వార్తాఫలం**

- **మేషం:** సంతానము మీ అభిప్రాయమ లలో ఏకీభవించడం మానసిక ప్రశాంతతను కలిగిస్తుంది.వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.
- **వృషభం:**టెండర్స్ అతి కష్టము మీద మీకు అనుకూలముగా వస్తాయి. వివాదాస్పద వ్యవహారములు పరిష్కారమౌతాయి.
- **మిథునం:**పెట్టుబడి పెట్టిన వారికి ఏకకాలంలో భాగములను ఇవ్వవలసి వస్తుంది. ప్రయాణాలు లభిస్తాయి.
- **కర్కాటకం :**వ్యాపారములో అధునాతన సాంప్రదాయములను, సంస్కరణలము ప్రవేశపెడతారు. మిత్రుల కలయిక.
- **సింహం:** అనేక నూతన కార్యక్రమములకు శ్రీకారం చుడతారు. ఆర్థికాభివృద్ధిని సాధిస్తారు.వస్తువులను కొనుగోలుచేస్తారు.
- **కన్య :**సకుటుంబ సమేతముగా విహార యాత్రలు చేస్తారు. సంఘసేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.మిత్రుల కలయిక.
- **తుల :** ఆరోగ్యమును గురించి వైద్యుని సంప్రదించవలసి వస్తుంది. బదిలీకి చేసే ప్రయత్నములు ఫలిస్తాయి. వస్త్రలాభం.
- **వృశ్చికం:** మీరు చేయని పొరపాటుకు మిమ్ములను దోషులుగా నిర్ణయించే విషయములో తగు జాగ్రత్తలను పాటించండి.
- **ధనుస్సు:** ఆధాత్మిక కార్యక్రమములకు, శుభకార్యములకు, ధనమును బాగా ఖర్చుచేస్తారు. వస్తు కొనుగోలు.
- **మకరం:**నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. నూతన భాషలను అభ్యసించే ప్రయత్నాలు చేస్తారు. బంధువుల కలయిక.
- **కుంభం:** వృత్తియందు బాధ్యతలు పెరగుటంలో సమయమునకు విశ్రాంతిని తీసు కోలేరు. చర్చాగోష్ఠులలో చురుకుగా పాల్గొంటారు.
- **మీనం :** వ్యాపారములో చేసిన మార్పులు, ప్రచారము సత్ఫలితములనిస్తాయి. వాహన యోగం. స్వల్ప ధనలాభం పొందుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్









శనివారం ఉప్పల్ స్టేడియంలో ఫుట్‌బాల్ ఆడుతున్న తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి, మెస్సీతో రాహుల్ తదితరులు

# హైదరాబాద్‌లో మెస్సీ హోరు

**మెస్సీ జట్టుపై తెలంగాణ సిఎం రేవంత్ జట్టు విజయం**

**మ్యాచ్‌ను తిలకించిన రాహుల్ గాంధీ**

**అసంఖ్యాకంగా హాజరైన అభిమానులతో ఉర్రూతలూగిన ఉప్పల్ స్టేడియం**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,డిసెంబర్13:** కోట్లాది అభిమానులను సొంతం చేసుకున్న ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సికి హైదరాబాద్‌లో ఘనస్వాగతం లభించింది. హైదరాబాద్ రావడంతో అభిమానులు ఉర్రూతలూగారు. అర్జెంటీనా దిగ్గజాన్ని ప్రత్యక్షంగా చూసేందుకు ఉప్పల్ స్టేడియానికి అభిమానులు భారీగా తరలివచ్చారు. మెస్సి మెస్సి అనే నినాదాలతో ఉప్పల్ మైదానం మారుమోగింది. సాయంత్రం శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న మెస్సి బృందానికి ఘనస్వాగతం లభించింది. క్రీడాభిమానులు పలువురు కాంగ్రెస్ నేతలు అయనకు అడుగడున స్వాగతం పలికారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాభిమానులు బ్యానర్లు పట్టుకొని ఫుట్ బాల్ దిగ్గజానికి స్వాగతం పలికారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి నేరుగా మెస్సి బృందం ఫలక్‌నుమా ప్యాలెస్‌కు వెళ్లింది. అక్కడ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మెస్సికి స్వాగతం పలికారు. అనంతరం ఫలక్‌నుమా ప్యాలెస్‌లో 100 మందితో ఏర్పాటు చేసిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో మెస్సి పాల్గొన్నారు. ఇందుకు ఒక్కొక్కరు పది లక్షల వెచ్చించి మెస్సి అభిమానులు టికెట్లు బుక్ చేసుకున్నారు. అనంతరం ఫలక్‌నుమా ప్యాలెస్ నుంచి మెస్సి ఉప్పల్ స్టేడియానికి చేరుకున్నారు. తొలుత 30 మంది చిన్నారులకు మెస్సి ఫుట్‌బాల్‌ట్రైనింగ్ ఇచ్చారు. అనంతరం అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సి గోట్ టూర్ ఆఫ్ ఇండియా కొనసాగింది. గోట్ కప్ పేరుతో ఉప్పల్ స్టేడియంలో ఎగ్జిబిషన్ ఫుట్‌బాల్ మ్యాచ్ జరిగింది. ఈ సందర్భంగా మెస్సి, సీఎం రేవంత్ రెడ్డి జట్ల మధ్య ఫ్రెండ్లీ మ్యాచ్ జరిగింది. సింగరేణి ఆర్‌ఆర్ టీమ్ తరఫున మైదానంలో దిగిన రేవంత్ రెడ్డి గోల్ కొట్టారు. మెస్సి రెండో గోల్స్ రాబట్టారు. మెస్సీ జట్టుపై 3-0 గోల్స్‌తో సింగరేణి ఆర్ఆర్ జట్టు విజయం సాధించింది. సింగరేణి ఆర్ఆర్ జట్టు తరఫున సీఎం రేవంత్‌రెడ్డి ఆడారు. విన్నర్, రన్నరప్ జట్ల సభ్యులకు మెస్సీ, రేవంత్‌రెడ్డి ట్రోఫీలు అందించారు. అనంతరం మెస్సి మాట్లాడుతూ హైదరాబాద్ నగరానికి వచ్చి తెలుగు ప్రజలను కలవడం సంతోషంగా ఉంది, తెలుగు ప్రజలు చూపించిన అభిమానం నాకు ఎంతో శక్తిని ఇచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు అని పేర్కొన్నారు.ఫ్రెండ్లీ మ్యాచ్ ప్రారంభానికి ముందు ఇరు జట్లతో కలిసి మెస్సి, రేవంత్ ఫొటోలు దిగారు. గ్యాలరీలో ఉన్న అభిమానులకు మెస్సి ఫుట్‌బాల్ కిక్ చేసి గిఫ్ట్‌గా ఇచ్చారు. రాహుల్ గాంధీతో పాటు ప్రియాంకగాంధీ కుమారుడు, కుమార్తె ఫుట్‌బాల్ మ్యాచ్‌ను వీక్షించారు. మ్యాచ్ టైమ్‌లో చివరి 5 నిమిషాలు రేవంత్‌రెడ్డి మెస్సితో కలిసి ఫుట్‌బాల్ ఆడారు. మ్యాచ్ పూర్తయిన తర్వాత మెస్సి ఆల్ టైమ్ గ్రేటెస్ట్ అయిన పెనాల్టీ షూట్ అవుట్ చేశారు. మెస్సి ఉప్పల్ స్టేడియానికి రాకముందు అక్కడ ఏర్పాటు చేసిన లేజర్ షో అలరించింది. రాహుల్ సిప్లిగంజ్ మ్యూజికల్ ఈవెంట్, సింగర్ మంగ్లి బృందం పాటలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి.

**సిఎం రేవంత్ మనుమడితో మెస్సీ ఫుట్‌బాల్:** ఉప్పల్ స్టేడియంలో ఫుట్‌బాల్ స్టార్ మెస్సీ మేనియా కొనసాగింది. ఆయన మైదానం అంతా తిరిగి పిల్లతో ఫుట్‌బాల్ ఆడారు. రేవంత్ తన మనవడిని పరిచయం చేసి ఫుట్‌బాల్ ఆడించారు.అనంతరం ముగ్గురూ కలిసి ఫోటో దిగారు. ఉప్పల్ స్టేడియం అంతా మెస్సీ... మెస్సీ నినాదాలతో మారుమోగింది. మెస్సీ... మెస్సీ అంటూ సిఎం రేవంత్ నినాదాలు ఉప్పల్ స్టేడియంలో మ్యాచ్ ముగిసిన అనంతరం ప్రభుత్వం తరఫున మెస్సీకి సిఎం రేవంత్‌రెడ్డి మెమొంటోను అందజేశారు. తర్వాత మైక్ అందుకున్న సిఎం రేవంత్‌రెడ్డి మెస్సీకి తెలంగాణ స్వాగతం తెలుపుతోంది. ఇప్పుడు తెలంగాణ వృద్ధి చెందుతోంది రండి, ఇందులో భాగస్వాములు కండి అని సిఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. అనంతరం సిఎం స్వయంగా మెస్సీ,మెస్సీ అంటూ నినాదాలు చేసి ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. దీంతో మెస్సీ చిరునవ్వులు చిందించారు.

**మెస్సీ కిక్... స్టేడియంపై పడ్డ బాల్:** మెస్సీ అంటే మామూలుగా ఉండదు మరి. ఉప్పల్ స్టేడియంలో సరాదాగా ఫుట్‌బాల్ ఆడి సందడి చేశారు. ఈ సందర్భంగా అభిమానుల్లోకి బంతులను పంపించారు.మెస్సీ కిక్‌కు ఓ బంతి ఏకంగా స్టేడియం రూఫ్‌పై పడి మళ్లీ అభిమానుల్లోకి చేరింది. దీంతో ఫ్యాన్స్ కేరింతలతో స్టేడియం దద్దరిల్లింది.

**మెస్సీ ఈవెంట్ గ్రాండ్ సక్సెస్**

హైదరాబాద్‌లో మెస్సీ ఈవెంట్ గ్రాండ్ సక్సెస్ అయింది. మధ్యాహ్నం కోల్‌కత్తాలో అభిమానులు స్టేడియంలో రచ్చ చేయడంతో హైదరాబాద్ పోలీసులు అలర్ట్ అయ్యారు. అధికారిక కార్యక్రమం కాకపోయినప్పటికీ ఈవెంట్ తీవ్రత దృష్ట్యా ప్రభుత్వం కూడా పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. మెస్సీ హైదరాబాద్‌లో ల్యాండ్ అయినప్పటి నుంచి ఉప్పల్ స్డేడియంలో మ్యాచ్ ముగిసేవరకు ఎలాంటి ఘటనలు జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం చూసుకుంది. మెస్సీని తనివితీరా చూసిన అభిమానులు హ్యాపీగా ఫీలయ్యారు. ఉప్పల్ స్టేడియంలో ఫుట్‌బాల్ ఎగ్జిబిషన్ మ్యాచ్ ముగిసిన అనంతరం మెస్సీ తన నంబర్ 10 జెర్సీలపై సంతకం చేసి రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డికి అందించారు.

## రాష్ట్రంలో దేవాలయాలకు

# పూర్వ వైభవం

### 1058 ఆలయాల పునర్నిర్మాణానికి రూ.846 కోట్లు మంజూరు

### - కర్నూలు జోన్ పరిపాలనా కార్యాలయ భవన సముదాయాన్ని ప్రారంభించిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



**కర్నూలు, డిసెంబర్ 13 ప్రభాతవార్త ప్రతినిధి :** అభివృద్ధి, సంక్షేమం, పారిశ్రామికం, ఆధ్యాత్మికం అన్నింటిలో రాష్ట్రాన్ని అగ్రగామి గా ఉంచేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర దేవాదాయ శాఖామాత్యులు ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. శనివారం కర్నూలు నగరంలో రూ. 4.25 కోట్ల వ్యయంతో నిర్మించిన దేవాదాయ శాఖ కర్నూలు జోన్ పరిపాలనా కార్యాలయ భవన సముదాయాన్ని ప్రారంభించిన రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి వర్యులు టి.జి భరత్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర దేవాదాయ శాఖామాత్యులు మాట్లాడుతూ రాష్ట్ర దేవాదాయ శాఖ హెడ్ ఆఫీస్ విజయవాడలో గొల్లపూడిలో ఉన్నట్లు గానే, రాయలసీమకు కర్నూలులో ఈ ఆధ్యాత్మిక భవనం ఏర్పాటు చేయడం అత్యంత సంతోషదాయకం అని పేర్కొన్నారు. ఈ కార్యాలయ సముదాయంలో డిప్యూటీ కమిషనర్ కార్యాలయం తో పాటు ఇంజనీరింగ్, తదితర కార్యాలయాలు సముదాయాలు కూడా ఉన్నాయని, నూతన కార్యాలయం కర్నూలు నుండి కాణిపాకం పనిచేస్తుందన్నారు..ఆలయాల్లో పూజా కైంకర్యాలు, ఉత్సవాలు ఆగమ శాస్త్రం ప్రకారం పూజారులు, వేద పండితుల నిర్ణయాల మేరకే జరుగుతాయన్నారు.. పురాతన ఆలయాలు, వాటి కట్టడాలను సంరక్షించే విధంగా ఈ శాఖ పని చేస్తుందని మంత్రి తెలిపారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ప్రకటించిన హామీల్లో దేవాదాయ శాఖలో 98 శాతం నెరవేర్చాం అని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు 2372 మంది అర్చకులకు కనీస వేతనం కింద ప్రతి నెల రూ.15వేలు ఇస్తున్నామన్నారు. వేద విద్య నేర్చుకున్న 599 మంది అర్హులైన వేద పండితులకు సంభావన కింద నెలకు రూ.3 వేలు ఇవ్వడం జరుగుతోందన్నారు..ఆలయాల్లో పని చేస్తున్న నాయీ బ్రాహ్మణులకు రూ. 25 వేల చొప్పున వేతనం ఇస్తున్న ప్రభుత్వం తమది అని మంత్రి పేర్కొన్నారు. ఆలయాల ట్రస్ట్ బోర్డుల్లో పాలకవర్గంలో బ్రాహ్మణుల్లో ఒకరిని, నాయీ బ్రాహ్మణుల్లో ఒకరిని సభ్యులుగా చేర్చేందుకు చట్టం తెచ్చామన్నారు. రాష్ట్రంలో ఉన్న పెద్ద పెద్ద ఆలయాలన్నింటిని టూరిజం సర్క్యూట్ కింద చేర్చి, టెంపుల్ టూరిజం ను రాష్ట్రంలో పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు... డిప్యూటీ సీఎం, టూరిజం శాఖామంత్రి, దేవాదాయ శాఖ మంత్రుల ఆధ్వర్యంలో టెంపుల్ టూరిజం ను అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి ఆదేశాలు ఇచ్చారని తెలిపారు.. దేవాదాయ ఆస్తులను, ఆలయ భూములను పరిరక్షించేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయిలో కమిటీలు ఏర్పాటుచేసి ఆస్తులను అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు రాష్ట్రంలో 21 ఆలయాల్లో ప్రతినిత్యం అన్నప్రసాద వితరణ జరుగుతోందని, 74 ఆలయాల్లో వారానికి ఒకరోజు, రెండు రోజులు అన్నప్రసాద వితరణ చేస్తున్నామని మంత్రి తెలిపారు. 11 ఆలయాల్లో రాష్ట్ర పండుగలు నిర్వహిస్తున్నామని, ఇందులో వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయాన్ని చేర్చి రాష్ట్ర పండుగలు నిర్వహిస్తున్నామన్నారు. 20 ఆలయాల్లో 3700 గోవులను సంరక్షిస్తున్నామని, మూడు వేద పాఠశాలలు, ఏడు ఆగమ పాఠశాలల్లో 400 మంది విద్యార్థులకు వేదం నేర్పిస్తున్నామని మంత్రి తెలిపారు. ధూపదీప నైవేద్యం కింద 2021 నుండి రూ.5వేల నుండి 10 వేలకు పెంచి రూ.70 కోట్లు ఖర్చు చేస్తున్నామని, 5821 ఆలయాల్లో ప్రతినెల రూ.10 వేల చొప్పున పూజారి అకౌంట్లో ఈ మొత్తాన్ని జమ చేస్తున్నామని మంత్రి వివరించారు.

## తిరుమల మ్యూజియంలో మోగిన అలారం

### - అప్రమత్తమైన సిబ్బంది

**తిరుమల,డిసెంబర్ 13ప్రభాతవార్తప్రతినిధి:** నిత్యం భక్తుల సందడిగా ఉండే తిరుమలలోని ఎస్వీమ్యూజియంలో శనివారం ఉదయం ఉన్నఫళంగా అలారం మోగడంతో ఒక్కసారిగా కలకలం రేగింది. అక్కడే ఉన్న భక్తులు పరుగులుతీయగా స్థానికుల తిరుమల పోలీసులకు సమాచారం అందించారు. టిటిడి విజిలెన్స్ సిబ్బంది, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని హుటాహుటిన మ్యూజియంలోకి వెళ్ళారు. తీరా లోపల గమనించగా సాంకేతిక లోపంతో అలారం మోగినట్లు తెలుసుకున్నారు. మ్యూజియంలో అభివృద్ధి పనులు జరుగుతున్న సమయంలో ఇలా అలారం మోగడం, సాంకేతిక లోపం గుర్తించడంతో మ్యూజియం సిబ్బంది, భక్తులు అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

## మాజీ ఎంపి కుసుమ కృష్ణమూర్తి మృతి



**అమలాపురం, డిసెంబర్ 13 ప్రభాతవార్త,** అమలాపురం మాజీ ఎంపీ కుసుమ కృష్ణమూర్తి శనివారం కన్ను మూశారు. ఢిల్లీ నుంచి స్వగ్రామ మం వీలస గ్రామంలో భౌతిక కాయాన్ని సదర్శనం నిమిత్తం తీసుకువస్తున్నారు. మూడు సార్లు అమలాపురం పార్లమెంట్ సభ్యులుగా పని చేశారు. కుసుమ కృష్ణమూర్తి 1940 సెప్టెంబర్ 11న వీలస గ్రామంలో జన్మించారు. ఆంధ్రా, నాగ్‌పూర్ యూనివర్సిటీలలో ఉన్నత చదువులు చదివారు. భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ తరపున కీలక నేతగా వ్యవహరించారు. అమలాపురం లోక్‌సభ నియోజకవర్గం నుండి మూడుసార్లు ఎంపీగా గెలుపొందారు. 6వ లోక్‌సభ (1977 1980), 7వ లోక్‌సభ (1980 1984), 9వ లోక్‌సభ (1989 1991) సభ్యులుగా ప్రాతినిధ్యం వహించారు. షెడ్యూల్ కులాలు,తెగల సంక్షేమ కమిటీ కన్వీనర్‌గా సేవలు అందించారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) జాయింట్ సెక్రటరీగా కూడా బాధ్యతలు నిర్వర్తించారు. కాంగ్రెస్ అధిష్ఠానంతో సన్నిహితంగా మెలిగారు.

## ముఖ్యమంత్రికి ప్రత్యేక ప్రతిభావంతుల కృతజ్ఞతలు

### ఉచిత ప్రయాణం ప్రకటన పట్ల సర్వత్రా హర్షం - దూర ప్రాంత సర్వీసుల్లో 50 శాతం రాయితీకి వినతి

**చంద్రగిరి, డిసెంబర్ 13 ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక ప్రతిభావంతులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు మనస్పూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. బాధ్యతలకు, భరోసాలకు పేరు గాంచిన ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రజల ఉజ్వల భవిష్యత్తుకు ప్రజా ప్రతినిధిగా, ప్రతిపక్ష నాయకుడుగా, మంత్రిగా, ముఖ్యమంత్రిగా దూర దృష్టితో తీసుకున్న అనేక నిర్ణయాలతో నేడు తెలంగాణ ప్రజలు సుఖ సంతోషాల నడుమ ఆస్వాదిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ విభజనతో ఏర్పడిన ఆర్థిక అగాథాన్ని పూడ్చడంలో 75 ఏళ్ళ వయస్సులో ఆయన చేస్తున్న అవిరళ కృషి నేటితరానికి స్పూర్తిదాయకంగా, భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగానూ నిలుస్తున్నది. 2014-2019 మధ్య కాలంలో సాగించిన పాలనలోని లోపాలను, 2019-2024 మధ్యన సాగిన వైసిపి పాలనలోని దోషాలను శుద్ధి చేయడంలో ఆయన చొరవ యావత్ ప్రపంచాన్ని అబ్బురపరుస్తున్నది. అన్ని రంగాలలో రాష్ట్రాన్ని అగ్రగ్రామీగా తీర్చిదిద్దడంలో కృత నిశ్చయంతో ముందుకు వడివడిగా సాగుతున్నారు. కష్ట కాలంలో తోడుగా నిలిచిన జనసేనాని డిప్యూటీ సిఎం కొణిదెల పవన్ కళ్యాణ్‌కు పూర్తి స్వేచ్ఛాయుత వాతావరణాన్ని కల్పించి రాష్ట్ర సమగ్రాభివృద్ధికి తీసుకుంటున్న అనేక సంస్థాగత నిర్ణయాలు ప్రజారంజకంగా నిలుస్తున్నాయి. అదేవిధంగా తనయుడుగా కాకుండా మేధోసంపత్తి కలిగిన యువకుడుగా నారా లోకేష్‌కు పాలనలో ప్రాధాన్యత కల్పించి ఆ మేరకు ఫలితాలను సాధిస్తున్న వైనం ఔరా అనిపిస్తున్నాయి. చరిత్రలో చంద్రబాబు తన వ్యక్తిగత అభిప్రాయాలకు విరుద్ధంగా మొదటిసారి 2024 ఎన్నికలలో ఉచిత పథకాలతో కూడిన సూపర్ సిక్స్ హామీల అమలు చారిత్రాత్మకంగా నిలుస్తున్నాయి.

## చరిత్రలో మరపురాని నేత వాజ్‌పేయి

### ఆయన హయాంలో సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట

### - బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్



**నంద్యాల డిసెంబర్ 13 ప్రభాతవార్త ప్రతినిధి :** ప్రపంచదేశాలకు దీటుగా భారతదేశం అభివృద్ధికి పాటుపడి చరిత్రలో మరచిపోలేని నాయకులు భారత రత్న మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి అని అటల్ బిహారీ వాజపేయి శతజయంతి నీ పురస్కరించుకొని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పి.వి. ఎన్.మాధవ్ మాట్లాడుతూ మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి వ్యక్తిత్వం అందరిని కలుపుకొని పోయేవారు అన్నారు. పార్లమెంట్ పై దాడి జరిగిన సమయంలో 8 మంది జవాన్లు వీర మరణం పొందారన్నారు. పార్లమెంట్ పై దాడిని వాజపేయి సీరియస్ గా తీసుకుని పాకిస్తాన్ హస్తం ఉండడంతో సైన్యం కు పూర్తి ఆదేశాలు ఇచ్చి దాదాపు 100 మంది ఉగ్రవాదులను జైల్లో పెట్టించారన్నారు. మహా నాయకులు ప్రపంచంలో వెలుగులోకి తీసుకొని రావాలని ,నేటి యువతకు తెలిసే విధంగా బిజెపి,కూటమి ప్రభుత్వం ఆలోచించి రాష్ట్రం లోని అన్ని జిల్లా కేంద్రాల్లో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహిస్తున్నా రన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ వచ్చిన తర్వాత ప్రతి కార్య కర్తకు న్యాయం జరుగుతుందన్నారు.రాష్ట్రంలో అన్ని వర్గాలు ఆశిస్తున్న విధంగా సముచిత స్థానం అందిస్తున్నారని అన్నారు. కూటమి నాయకులం అందరం కలసి కట్టుగా రాష్ట్ర అభివృద్ధికి పాటు పడతామన్నారు. జిల్లా బిజెపి అధ్యక్షులు అభిరుచి మధు ఆధ్వర్యంలో రాష్ట్ర బిజెపి అధ్యక్షులు పి.వి. ఎన్ మాధవ్ నేతృత్వంలో చేపట్టిన కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు బిసి జనార్ధన్ రెడ్డి, ఎన్.ఎం.డి. ఫరూక్, సత్యకుమార్ యాదవ్ ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి విగ్రహ ప్రతిష్ఠ అనంతరం బహిరంగ సభలో మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ భారతరత్న మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి చరిత్రలో మరచిపోలేని నాయకులన్నారు. సిద్ధాంతాలు, విలువలతో రాజకీయం చేసిన మహనీయుడన్నారు. ప్రపంచదేశాలకు దీటుగా భారత దేశం అభివృద్ధి చెందాలని ఆ దిశగా కృషిచేశారన్నారు. సంక్షేమం,అభివృద్ధికి పెద్ద పీట వేశారన్నారు. రహదారులు, ఐటి,పారిశ్రామిక, విద్యా, వైద్యం, ఉద్యోగ అవకాశాలపై ప్రత్యేక దృష్టి సారించి మార్గదర్శకుడయ్యారన్నారు. వాజపేయి పాలన లో ప్రతిపాదించిన సుపరిపాలన,జాతీయ ఐక్యత,సమగ్ర అభివృద్ధి విధానాలు దేశానికి కొత్త దిశ చూపించాయన్నారు.దేశం ముందుకు ఎలా వెళ్లాలి అని దూరదృష్టిని నిర్దేశించారన్నారు. వాజపేయి ఆశయాలను ప్రధాని నరేంద్ర మోదీ కొనసాగిస్తూ పథకాలను మరింత విస్తరింప జేస్తున్నారని పేర్కొన్నారు. బిజెపి ప్రభుత్వం 11 ఏళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధితో 25 మంది ప్రజలు పేద రికం నుంచి బయటపడ్డారన్నారు. వాజపేయి, మోదీ నాయకత్వాలు అందించిన అభివృద్ధితో ప్రపంచం లో అతి పెద్ద ఆర్థిక వ్యవస్త లో 10 వ స్థానంలో ఉన్న భారతదేశం 4 వ స్థానంకు చేరే విధంగా చేశారన్నారు.

## హస్తకళలపై యువత అభిరుచి పెంచుకోవాలి: మంత్రి సవిత



జాతీయ అవార్డు కళాకారులను సత్కరిస్తున్న మంత్రి సవిత

**శ్రీకాళహస్తి,డిసెంబర్ 13 ప్రభాతవార్త** హస్తకళలపై యువత అభిరుచి పెంచు కోవాలని రాష్ట్ర చేనేత,జౌళి శాఖ మంత్రి సవిత అన్నారు. శ్రీకాళహస్తిలోని శివపార్వతి కళ్యాణ మండపంలో జాతీయ హస్తకళల వారోత్సవాలలో ఆమె ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. సభను హ్యాండీక్రాఫ్ట్ కార్పొరేషన్ చైర్మెన్ పసుపులేటి హరిప్రసాద్ పర్యవేక్షణలో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎంఎల్‌ఏ సుధీర్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ కుమార్‌లు హాజరయ్యారు.ఈ సభలో మంత్రి సవిత ద్వారా 56 మంది చేనేత హస్త కళాకారులు రూ.36లక్షలు విలువైన పని ముట్లు అందజేసారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ యువత హస్తకళలపై మక్కువ పెంచుకోవాలన్నారు. సమాజంలో మన కళలను కళాకారులను కాపాడుకొనుటకు చేనేత హస్తకళ ఉత్పత్తులను వినియోగిద్దాం బహుమతులుగా అందజేద్దామని మంత్రి సవిత పిలుపు నిచ్చారు.శ్రీకాళహస్తిలో చేనేత హ్యాండ్ క్రాఫ్ట్ సంస్థల అధ్వర్యంలో జాతీయ హస్తకళ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి అవార్డు అందుకున్న పది మంది కళాకారులను సత్కరించారు. 56 మంది కళాకారులకు రూ.36లక్షల విలువైన పని ముట్లను అందించారు. శ్రీకాళ హస్తి కళలకే కాదు కళాకారులకు కూడా నిలమయన్నారు.ఇక్కడి కలంకారి కళ అంతర్జాతీయస్థాయిలో రాణించి ఇక్కడి కళాకారులు సుమారు 20 మంది వరకు జాతీయ అవార్డులను అందుకున్నట్లు మంత్రి వివరించారు. కలంకారి కళ మరింత అభివృద్ధికి 'ప్రత్యేక క్లస్టర్ ఏర్పాటు' చేస్తున్నట్లు వెల్లడించారు.



నయీ చేతన 4.0 కార్యక్రమంలో భాగంగా సి.ఆర్.డి.ఎ స్కిల్ హబ్ భవనంలో జెండర్ రిసోర్స్ సెంటర్ (జీఆర్‌సీ) కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి పెమ్మసాని, హోంమంత్రి వంగలపూడి అనిత, కొండపల్లి శ్రీనివాస్

# మహిళల్లో మౌనం బలహీనత కాకూడదు

### ప్రతి ముగ్గురిలో ఒక మహిళ వివక్షకు గురి అవుతున్నట్లు అంచనా!

### - కేంద్రమంత్రి డాక్టర్‌పెమ్మసాని చంద్రశేఖర్

**విజయవాడ డిసెంబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** మహిళల్లో మౌనం బలహీనత కాకూడదని కేంద్ర గ్రామీణ అభివృద్ధి,కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డా.పెమ్మసాని చంద్ర శేఖర్ అన్నారు. లింగ సమానత్వ జాతీయ ప్రచార కార్యక్రమం నయీ చేతన 4.0 కార్యక్రమంను కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో డి.ఆర్.డి.ఏ సౌజన్యంతో తుళ్ళూరులో శనివారం నిర్వహించారు. నయీ చేతన 4.0 కార్యక్రమంలో భాగంగా సి.ఆర్.డి.ఎ స్కిల్ హబ్ భవనంలో జెండర్ రిసోర్స్ సెంటర్ (జీఆర్‌సీ) ను కేంద్రమంత్రి పెమ్మసాని,హోంమంత్రి వంగలపూడి అనిత,కొండపల్లి శ్రీనివాస్ ప్రారంభించారు. స్థానిక ప్రైవేటు పాఠశాలలో జరిగిన సభను, ప్రదర్శన శాలలను మంత్రులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి డా.పెమ్మసాని చంద్ర శేఖర్ మాట్లాడుతూ వివక్ష తగ్గించడం నయీ చేతన 4.0 కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. సమాజంలో బాల్య వివాహాలు, గృహ హింస, లింగ వివక్ష వంటి రుగ్మతలు సమాజంలో జరుగుతున్నాయన్నారు. దేశంలో 4.50 లక్షల గృహ హింస కేసులు నమోదు అయ్యాయని గణాంకాలు తెలియజేస్తున్నాయని తెలిపారు. ప్రతి ముగ్గురిలో ఒక మహిళ వివక్షతకు గురి అవుతున్నట్లు అంచనా ఉన్నప్పటికీ అన్ని కేసులు నమోదు కావడం లేదని చెప్పారు. ఇందుకు పరువు ప్రతిష్ట కోసం ఆలోచించడం కారణమని అన్నారు. అందుకే నయీ చేతన కార్యక్రమాన్ని 2021 సంవత్సరంలో శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావడం కార్యక్రమం ఉద్దేశ్యం అన్నారు. సురక్షి త ఆశ్రయం కల్పించుటకు రూ.5 లక్షలతో ఆశ్రయాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆశ్రయం నిర్వహణకు ఎస్.హెచ్.జి సభ్యులకు అవగాహన కల్పిస్తారని చెప్పారు. రాష్ట్రంలో రెండు వందల కేంద్రాలు మంజూరు చేశామని, వంద కేంద్రాలు ప్రారంభం అయ్యాయని తెలిపారు. తల్లిదండ్రులు, తాతలు పిల్లలలో చైతన్యం తీసుకురావాలని కోరారు. ఎక్కడ వివక్ష జరిగినా ఇటువంటి కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. రాష్ట్రంలో 8 లక్షల స్వయం సహాయక సంఘాలు ఉండగా వాటిలో 80 లక్షల మంది సభ్యులు ఉన్నారని చెప్పారు. దేశంలో 8 కోట్లు సంఘాలు ఉన్నాయని తెలిపారు.

## ప్రజల మనోభావాలను కూటమి గుర్తించాలి రాజంపేటను జిల్లా కేంద్రంగా ప్రకటించాలి

### ఆటో డ్రైవర్ల నిరాహార దీక్షలు.. ర్యాలీలు..

**రాజంపేట, డిసెంబర్13 ప్రభాతవార్త** ఎంతో ఘన చరిత్ర కలిగి, జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు అన్ని అవకాశాలు ఉన్న రాజంపేటను వెంటనే జిల్లా కేంద్రం చేసి ప్రజల మనోభావాలను గుర్తించాలని వివిధ వర్గాల ప్రజాప్రతినిధులు, ఆటో డ్రైవర్లు రియల్ ఎస్టేట్ వ్యాపారులు డిమాండ్ చేశారు. శనివారం నాలుగో రోజు నిరాహార దీక్షలలోనెట్టెం శంకర్, మన్నూరు సురేష్ రెడ్డి, శేషయ్య, చంద్రబాబు, వాసు, మురళి ,నరసింహులు తో పాటు కూటమినేతలు పాల్గొన్నారు. మరోవైపు ఆటో డ్రైవర్లు రాయంపేట జిల్లా కేంద్రం ప్రకటించాలని కోరుతూ పాత బస్టాండ్ లో ఆందోళన చేశారు. ధర్నా చేశారు. అనంతరం పెద్ద ఎత్తున జూనియర్ కళాశాల వరకు ఆటోలతో భారీ ర్యాలీ నిర్వహించారు. రాయచోటి వద్దు, రాజంపేట ముద్దు అంటూ నినాదాలు చేశారు. రాజంపేట జిల్లా కేంద్రం ప్రకటించినంతవరకు ఆందోళన విరమించేది లేదని నినాదాలు చేశారు. నిరాహార దీక్షలో పాల్గొన్న నేతలు మాట్లాడుతూ రాజంపేటను జిల్లా కేంద్రం చేయకపోతే చరిత్ర క్షమించదన్నారు.

# తిరుపతి సమాచారం

## 16నుండి శ్రీవారికి తిరుప్పావై ప్రవచనాలు



**తిరుమల,డిసెంబర్ 13ప్రభాతవార్తప్రతినిధి:** వైఖానస ఆగమోక్తంగా పూజలందు కుంటున్న తిరుమల శ్రీవేంకటేశ్వం స్వామికి వేకువజామున నిర్వహించే సుప్రభాతసేవ ఈనెల 16వతేదీ నుండి రద్దుచేశారు. ఆ స్థానంలో ధనుర్మాసం సందర్భంగా నెలరోజులపాటు గోదాదేవి తిరుప్పావై పాశురాలను వేదపండితులు ,ఆలయ అర్చకులు పారాయణం చేసి శ్రీవారిని మేల్కొలుపుతారు. ప్రతి ఏడాది ధనుర్మాసంలో సుప్రభాతసేవ స్థానంలో తిరుప్పావై పాశురాలు పఠించడం ఆనవాయితీ. తిరుమల, తిరుపతితో పాటు దేశవ్యాప్తంగా 233 కేంద్రాలలో తిరుప్పావై పారాయణం జరుగుతుంది. ఈనెల 16 నుండి 2026 జనవరి 14వ తేదీ వరకు పండితులు తిరుప్పావై ప్రవచనాలు చేయనున్నారు. టీటీడీ ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఇందుకోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా తిరుపతితో పాటు ఆంధ్రప్రదేశ్ 76 కేంద్రాలు, తెలంగాణ 57కేంద్రాలు, తమిళనాడు 73, కర్ణాటక 21, పాండిచ్చేరి 4, న్యూఢిల్లీ, ఒడిశాలో ఒకొక్క కేంద్రంలో తిరుప్పావై ప్రవచనాలు నిర్వహించనున్నారు. తిరుమల శ్రీవారి ఆలయంలోనూ ధనుర్మాసంలో సుప్రభాతం బదులు తిరుప్పావై నివేదించడం విశేషం. తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరం, కెటి రోడ్డులోని శ్రీ వరదరాజస్వామివారి ఆలయంలో తిరుప్పావై ప్రవచనాలు పారాయణం చేస్తారు. 12 మంది ఆళ్వారులలో ఒకరైన గోదాదేవి ధనుర్మాసం వ్రతం చేశారు. ఈ వ్రతం చేయడం వల్ల దేశం సమృద్ధిగా, సుభిక్షంగా ఉంటుంది. ద్వాపరయుగంలో గోపికలు ఈ వ్రతాన్ని ఆచరించి శ్రీకృష్ణుని కృపకు పాత్రులయ్యారని భాగవతం దశమ స్కందంలో పేర్కొనబడింది. ఈ తిరుప్పావై సారాంశం భగవంతునికి కైంకర్యం చేయడమే. దేశవ్యాప్తంగా గల అన్ని వైష్ణవ దేవాలయాలలో తిరుప్పావై శాత్తుమొర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

## ఆ మూడురోజులు టోకెన్లు ఉంటేనే వైకుంఠ దర్శనం!

### -జనవరి 2నుండి టిక్కెట్ లేకున్నా తిరుమలకు వస్తే సర్వదర్శనం



**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** కలియుగ వైకుంఠం తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించి ఈనెల 30,31తేదీలతోబాటు 2026 జనవరి 1వతేదీకి ఆన్‌లైన్‌లో దర్శన టోకెన్లు 1+3 విధానంలో కలిగిన భక్తులను మాత్రమే ఆలయంలోనికి అనుమతించేలా టిటిడి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే రోజుకు 70వేలమంది భక్తులు లెక్కన మూడురోజులకు 1.75లక్షల వరకు ఇ డిప్‌లో వైకుంఠ దర్శన టోకెన్లు జారీచేసిన విషయం తెలిసిందే. ఆ మూడురోజులు ప్రోటోకాల్ పరిధిలోని ప్రముఖులు స్వయంగా వస్తేనే తిరుమలలో వైకుంఠ దర్శనాలు కల్పిస్తారు. ఆ పదిరోజులు ఎటువంటి సిఫార్సు లేఖలు అనుమతించరు. ఇదిలా ఉండగా ఈ దఫా పదిరోజుల వైకుంఠద్వార దర్శనాల్లో జనవరి 2వతేదీ నుండి 8వతేదీ వరకు ఏడురోజులు మాత్రం సామాన్యభక్తులకు దర్శన టోకన్లు ,టిక్కెట్లు లేకున్నా నేరుగా తిరుమలకు చేరుకుని వైకుంఠమ్ 2 ద్వారా దర్శనాలకు రావచ్చని టిటిడి విజ్ఞప్తి చేసింది. ఏడురోజులు సామాన్యులకు సాఫీగా ప్రశాంతంగా వైకుంఠ ద్వార దర్శనాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. పదిరోజుల వైకుంఠద్వార దర్శనాల్లో 182 గంటల్లో 164గంటలు సామాన్యభక్తులకు కేటాయించారు. 300 రూపాయలు ఎస్ఇడి రోజుకు 15వేల టిక్కెట్లు, శ్రీవాణి రోజుకు వెయ్యిటిక్కెట్లు ఆన్‌లైన్‌లో జారీచేసేశారు. భక్తులు టిటిడి సూచనలు పాటించి ప్రశాంతంగా దర్శనం చేసుకోవాల్సి ఉంటుంది. ప్రోటోకాల్ ప్రముఖులు స్వయంగా నేరుగా వస్తేనే వైకుంఠద్వార దర్శనాలు కల్పిస్తారు.

## పూర్ణాహుతితో ముగిసిన షోడశదిన సుందరకాండ పారాయణం



**తిరుమల,డిసెంబర్ 13ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచశాంతి, లోకక్షేమం ఆకాంక్షిస్తూ కలియుగవైకుంఠం తిరుమలలోని వసంతమండపంలో జరిగిన షోడశదిన సుందరకాండ పారాయణం శనివారం మహాపూర్ణాహుతితో ముగిసింది. గతనెల28వతేదీ తిరుమలలో శ్రీవారి ఆలయానికి వెనుకవైపు వసంతమం డపంలో శాస్త్రోక్తంగా పారాయణం చేపట్టారు. ప్రతిరోజూ వేదపండితులు వైఖానస ఆగమోక్తంగా సుందరకాండ పారాయణం చేపట్టి భక్తిభావాన్ని చాటారు. ఇదే సమయంలో ధర్మగిరి వేదవిజ్ఞాన పీఠంలో తొలిరోజు ఉదయం నుండి మధ్యాహ్నం వరకు ఆరాధన, అభిషేకం,హోమం ,అనుష్టానం నిర్వహించారు. చివరగా శనివారం మహాపూర్ణాహుతితో ముగింపుకుచేరుకుంది. వేదపాఠశాల ప్రిన్సిపాల్ శివసుబ్రమణ్యఅవధాని పర్యవేక్షణలో వేద పండితులు ఈ కార్యక్రమాలు నిర్వహించారు.టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

## రాష్ట్రం అన్నివిధాలా మరింత అభివృద్ధిచెందాలని వేడుకున్నా : మంత్రి సవిత



**తిరుమల,డిసెంబర్ 13ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రం అన్ని విధాలా మరింత అభజవృద్ధి చెందే దిశగా ఆశీస్సులందించాలని శ్రీవారిని వేడుకున్నట్లు రాష్ట్రమంత్రి సవిత తెలిపారు. పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విశేష కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజలకు శుభాలు కలగాలని స్వామివారిని ప్రార్ధించినట్లు మంత్రి తెలిపారు. శనివారం ఉదయం విఐపి బ్రేక్‌లో ఆమె స్వామివారిని దర్శించుకున్నారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## తిరుమలేశుని సన్నిధిలో తలైవా భగవంతుని ఆశీస్సులందరిపై ఉండాలి



**తిరుమల,డిసెంబర్ 13ప్రభాతవార్తప్రతినిధి:** సినీనటుడు,సూపర్‌స్టార్ రజనీకాంత్ తలైవా కుటుంబంతో కలసి కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆనందనిలయంలోనికి చేరుకుని వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. శేషవస్త్రంతో సత్కరించారు. ఆలయం వెలుపలకు వచ్చిన తలైవాని చూడటానికి, ఆయనతో ఫోటోలు దిగేందుకు అభిమానులు, భక్తులు ఉత్సాహం చూపారు. అందరినీ ఆపాయ్యయంగా పలకరించారు. తెలుగుప్రజలంతా సంతోషాలతోఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.

### వారాంతం రద్దీతో కొండ కిటకిట

**తిరుమల,డిసెంబర్ 13 ప్రభాతవార్తప్రతినిధి:** వారాంతం వరుసగా రెండవశని,ఆదివారాలు సెలవులు కావడంతో తిరుమ ల భక్తజనసంద్రంగా మారింది. వెంకన్న దర్శనానికి భక్తులు శనివారం ఉదయం నుండే భారీగా చేరారు. ఉదయానికే వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్‌లలోని 61 కంపార్టుమెంట్లు నిండిపోయాయి. సర్వదర్శనానికి ఉదయానికి 14గంటలు సమయం పడుతుందన్నారు.

దేశంలో కాదేదీ కల్తీ(నకిలీ)కి అనర్హం అనే వదంతి ఎంతో పవిత్రంగా విశ్వాసంతో భావించే వేదపండితులు వేదాశీర్వచనం సత్కార శాలువాల్లోనూ నకిలీ పట్టును వాడి పాలిస్టర్‌తో తయారైన శాలువాలతో కుంభకోణం జరిగిందనే దుమారం టిటిడిలో మరింతగా కలవరపెడుతోంది. శ్రీవారి దర్శనానంతరం వివిఐపిలు, వివిఐపిలతోపాటు దాతలకు,ఆర్జితసేవల భక్తులను ఆలయ మర్యాదలతో సత్కరించే సంప్రదాయం కొనసాగుతోంది. ఇలా రంగ నాయకుల మండపంలో వేదాశీర్వచనంపొందే భక్తులకు అందజేసేపట్టుశాలువాలు(శేషవస్త్రం) టెండర్లలో నకిలీలు చోటుచేసుకుని భారీ కుంభకోణం జరిగిందనేది టిటిడి ధర్మకర్తలమండలి తాజాగా బయటపెట్టిన గుట్టు. వేదాశీర్వచనం కోసం అవసరమైన పట్టుశాలువాలు సరఫరా చేయాల్సిన బిడ్డరుదారులు ఆ స్థానంలో పాలిస్టర్‌శాలువాలు సరఫరాచేశారని,పైగా ధర కూడా విపరీతంగా కోట్‌చేసి మూడింతలు అధికంగా టిటిడి సొమ్మును వేజిక్కించుకున్నారనేది స్వయంగా ఛైర్మన్ ఏసిబితోవిచారణ చేయించాలని చెప్పడం ఇందుకుబలాన్ని చేకూర్చుతోంది. స్వచ్ఛమైనపట్టు శాలువాలు 'ఓంనమోవేంకటేశాయ నామంతోశంఖుచక్రం తిరునామం' ముద్రించిన వాటిని అందజేస్తుంది. అయితే గత ఆరేడుసంవత్సరాలుగా సరఫరా అయిన పట్టుశాలువాలు నకిలీవని, టిటిడి విజిలెన్స్ గుర్తించిన స్కామ్. రూ.400 విలువ చేసే టెండర్ దారుడు మూడురెట్లు అధికంగా ధర కోట్‌చేసి టిటిడికి సరఫరాచేసి మోసానికి పాల్పడినట్లు టిటిడి అధికారులు గుర్తించారు. ఈశాలువాలను బెంగుళూరు, ధర్మవరంలోని సిల్క్‌బోర్డు పరిశోధనశాలలకు పంపించి తనిఖీ చేయించగా పాలిస్టర్‌వేనని నివేదికలు అందడంతో శేషవస్త్రాల అవినీతిపై ఏసిబితో విచారణకు టిటిడి ధర్మకర్తలమండలి సిద్ధమైంది.దేవుని చెంత భక్తిభావంతో, సేవా నిరతితో సేవచేయాల్సిన ప్రతి అంశంలోనూ అవినీతి నీడలుకమ్ముకోవడం మాత్రం శ్రీవారి భక్తులను విస్మయానికి గురిచేస్తోంది.

# ధార్మిక సంస్థలో విస్తరిస్తున్న అవినీతి జాడలు!

**పావులూరు పద్మనాభమ్**

ఆధ్యాత్మికత..పవిత్రత ఉట్టిపడే తిరుమల తిరుపతి దేవస్థానంలో అడుగడుగునా భక్తిభావంతో,నిజాయితీతో మెలగాల్సిన అధికారులు, ఉద్యోగుల తీరు అవినీతి మయంలో చిక్కుకుపోవడం ఇప్పుడు ప్రపంచంలోని కోట్లాది మంది భక్తులను నివ్వెరపరుస్తోంది. నిత్యం లక్షలమందివరకు వస్తున్న భక్తుల విశ్వాసంతో టిటిడి ఆదాయం పరిగణిస్తారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానంలో వరుసగా అవినీతి మబ్బులు కమ్మేస్తున్నాయి. కోట్లాదిమంది భక్తులు ఎంతో విశ్వాసంతో నమ్ముకొలుస్తున్న కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి పవిత్రతకు భంగం కలిగించేలా ఈ దుమారం ఐదేళ్ల కాలంలో వరుసగా పలు విషయాల్లో వెలుగుచూస్తున్న అవినీతి అక్రమాలు భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా తయారవుతున్నాయి. 'ఏడుకొండలవాడా గోవిందా..ఆపదమొక్కులవాడా గోవింద' నామస్మరణతో భక్తితో మొక్కుబడుల రూపంలో హుండీ సమర్పించుకునే కానుకల నుండి తమ కష్టాలు తీరితే ముడుపు చెల్లించుకుంటామని వేసే తులాభారం చివరకు అఖిలాండ కోటిబ్రహ్మాండనాయకుని దివ్యమంగళ రూపం దర్శనానంతరం పులకించిపోయే భక్తలోకం ఎంతో ప్రీతిపాత్రంగా స్వీకరించే లడ్డూప్రసాదాలు కూడా అవినీతితో కల్తీమయమై కలకలం రేపడం వరకు తిరుమల తిరుపతి దేవస్థానాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. చివరకు ఆనందనిలయంలోని కలియుగ వైకుంఠవాసున్ని క్షణకాలం దర్శనం చేసుకుని వేదపండితుల వేదాశీర్వచనం అందుకోవడంలో ప్రముఖులు, దాతలు, ఆర్జిత సేవల భక్తులు స్వీకరించే శేషవస్త్రం (పట్టుతోనేసిన దుప్పట) 'శంఖుచక్రనామంతో ఓమ్‌నమోవేంకటేశాయ'అని అరుదైనా వస్త్రం కూడా నకిలీది సరఫరా కావడం భక్తుల మనోభావాల్ని దెబ్బతీసేలా అవినీతిమయంగా మారింది. ఇలా వరుసగా వెలుగుచూస్తున్న అవినీతి నీడలతో తిరుమలతిరుపతిదేవస్థానం పవిత్రత మసకబారేలా మారిందనడంలో ఎలాంటి సందేహం లేదు. తిరుమల లడ్డూలకు 310 ఏళ్ల సుదీర్ఘచరిత్ర ఉంది. గోవిందుని ప్రసాదాల్లో లడ్డూకు ఉన్న ప్రాధాన్యత ఎంతో విశిష్టత కలిగింది. దేశవిదేశాల నుండి ప్రతిరోజూ తిరుమల కొండకు వచ్చే భక్తులు స్వామివారి దివ్యమంగళరూపం దర్శనం ముగించుకున్న తరువాత తమ జన్మధన్యమైందనిభావించి ప్రసాదంగా లడ్డూలను తమవెంట పవిత్రంగా తీసుకెళతారు. అంతటి పవిత్రంగా భక్తకోటి భావించే లడ్డూప్రసాదాల తయారీకి కల్తీనెయ్యి సరఫరా జరిగిందనే ఉదంతంతో టిటిడిలో దుమారం మొదలైంది. కొన్ని దశాబ్దాలకాలం నుండి 2019వ సంవత్సరంవరకు తిరుమలలోని పోటులో లడ్డూల తయారీ



సమయంలో కొండంత నెయ్యిసువాసనలు గుబాళించేవి. 2019వ సంవత్సరం నుండి 2024వరకు ఆలయ బూంది పోటులో రోజుకు సరాసరి మూడులక్షల నుండి 3.50లక్షల వరకు లడ్డూలు తయారయ్యేవి. ఇందుకుగాను రోజుకు 150 కిలోల వరకు ఆవునెయ్యి వినియోగించేవారు.2019- 2024 మధ్య కాలంలో పలు డెయిరీలకు టిటిడి ధర్మకర్తల మండలి, టిటిడి అధికారులు నెయ్యిసరఫరాను అప్పగించారు.స్వచ్ఛమైన ఆవునెయ్యి సరఫరా చేయాల్సిన డెయిరీలు పలు రకాలుగా కల్తీచేయడంతోనే లడ్డూల నాణ్యత,రుచి లేదనేది వెలుగుచూసిన మొదటి అవినీతి. కల్తీనెయ్యి దుమారంపై 2024 జులైలో రాష్ట్రప్రభుత్వం ఈ ఉదంతంపై విచారణకు ఆదేశించింది. అప్పట్లో గత ఐదేళ్ల అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వం హయాంలోని టిటిడి ధర్మకర్తలమండలి పెద్దలు, టిటిడి ఉన్నతాధికారి,కొనుగోలు కమిటీ ఏమేరకు నిబంధనలు పాటించి నెయ్యిసరఫరాకు టెండర్లు పిలిచారు, టెండర్లలో పాల్గొన్న ఐదుసంస్థలు, కాంట్రాక్టర్ల వివరాలపై నియామకమైన సిట్ అధికారులు సమాచారం రాబట్టారు. కీలక వివరాలతో పలు డెయిరీల నిర్వాహకులను, చివరకు నెయ్యి ట్యాంకర్ డ్రైవర్లను కూడా సిట్ లోతుగా విచారణ చేసింది.అసలునెయ్యి సరఫరా చేయడానికి టెండర్లు అర్హత సాధించిన డెయిరీ స్థానంలో మరికొన్ని డెయిరీలు కేవలం, నిర్దేశిత కాంట్రాక్టర్ల స్థానంలో ఇతరులు సరఫరా చేశారనేది సిట్ కీలకంగా సేకరించిన సమాచారం.2024జులై నెలలోనే మూడుసార్లు కల్తీనెయ్యి సరఫరా జరిగిందని గుర్తించిన టిటిడి ఆ ట్యాంకర్లను తిరుమలలో నెయ్యి తీసుకోకుండా వెనక్కుపంపింది. ఆ ట్యాంకర్లలో నెయ్యి కల్తీ జరిగిందనేది ముందుగానే తేల్చేసిన టిటిడి అధికారులు తిప్పిపంపడం సంచలనంగా మారింది.అయితే కల్తీనెయ్యి అవినీతిపై 2024 సెప్టెంబర్ 20న తిరుపతిలో తూర్పు పోలీసులకు టిటిడి ఫిర్యాదుతో మరింతగా బలాన్ని చేకూర్చింది. లడ్డూల తయారీలో కల్తీనెయ్యి వాడారనే అంశంపై గుజరాత్‌లోని ఎన్‌డిడిబి ల్యాబ్ పరీక్షల నివేదికల ఆధారంగా జంతువుల కొవ్వునూనె కల్తీజరిగిందని నిర్ధారణకు వచ్చారు. నెయ్యి నాణ్యత లేదని దీనివల్లే లడ్డూలు రుచిగా లేవనే సమాచారం పోటు కార్మికుల వాదనలతో ఏకీభవించాల్సి వచ్చింది.గతవైఎస్ వైసిపి ప్రభుత్వంలో లడ్డూల నాణ్యత లేదనే విషయంపై పెద్ద సంఖ్యలో భక్తుల నుండి ఫిర్యాదులు,విమర్శలు వచ్చాయి. ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి భక్తులు హుండీకి కానుకలుగా చెల్లించుకునే విరాళాలను పరకామణిలో లెక్కిస్తారు. రోజువారీగా సరాసరి 3.50కోట్లరూపాయల నుండి 4కోట్లరూపాయలు ఆదాయం లభిస్తుంది. ఈ లెక్కింపుల్లో గుమస్తాగా ఉన్న సివి రవికుమార్ అనే వ్యక్తి 2023 ఏప్రిల్29న, 920 అమెరికన్ డాలర్లు రూ. 70లక్షలువిలువైనవి చోరీ చేయడం ఇప్పటికీ సంచలనం రేపుతోంది. ఈ వ్యవహారం కాక పుట్టించింది. 1980వ సంవత్సరం నుండి తిరుమల పెద్దజీయర్ మఠంలో సివి రవికుమార్ గుమస్తాగా పనిచేస్తూ పరకామణి విధులు చూస్తున్నారు. ఆయన 2023 ఏప్రిల్‌లో డాలర్లు చోరీ చేయడం ,విజిలెన్స్ ఏవిఎస్‌ఒ పట్టుకోవడం తదనంతరం తిరుమల వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేయడం జరిగింది. ఈ కేసులో చట్టపరంగా వ్యవహరించాల్సిన పోలీసులు ,టిటిడి అధికారులు ఏకంగా అతనిని కేసులో నుండి తప్పించేలా న్యాయస్థానంలో ఒప్పించి కేసు ఉపసంహరణ, ఆపై లోక్ అదాలత్‌లో మధ్యవర్తిత్వం ద్వారా రాజీపడిపోయిన దుమారాన్ని రేపింది. అయితే ఈ కేసు లోక్‌అదాలత్ ద్వారా రాజీ చెల్లదనేది హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ కేసులో అతని నుండి శ్రీవారికానుకల క్రింద 2023లో గత టిటిడి బోర్డు 14కోట్ల రూపాయల విలువైన గిఫ్ట్ డీడ్‌గా ఆస్తులు స్వీకరించడం సంచలనమే.వీటి విలువ మార్కెట్లో 40కోట్ల రూపాయల మేర ఉంటుందనేది సిఐడి వెల్లడించిన విషయం. ఆదాయపుపన్ను శాఖ (ఐటి), ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్ (ఇడి)కూడా కేసు వివరాల సమాచారాన్ని ఇవ్వాలని సూచించింది. వడ్డీకాసుల వెంకటేశ్వర స్వామికి భక్తుల ప్రియంగా చెల్లించే తులాభారం మొక్కుల కానుకలు కూడా పక్కదారి పడ్డాయంటూ తిరుమల తిరుపతి దేవస్థానంలో సంచలనంగా మారింది. చిన్నపిల్లల నుండి వయోవృద్ధుల వరకు తమ కోరికలు నెరవేరిన వెంటనే తులాభారం (త్రాసు)లో ఒకవైపు భక్తుడు,మరో వైపు నాణేలు, చక్కెర, బెల్లం,కలకండ, డ్రై ఫ్రూట్స్,బియ్యం ఇలా ఏదైనా వారి బరువుకు తగ్గట్లు తూకంలో తీర్చుకుంటారు. అంతే బరువుకు సరిపడే నగదును టిటిడికి అందిస్తారు.ఉదాహరణకు పది రూపాయల నాణేలు ఉంచి బరువు తూకం వేస్తారు. భక్తుడు ఎంత బరువుంటే అంత సొమ్ము నగదు రూపంలో అక్కడ సిబ్బందికి అప్పగించి మొక్కుబడి తీర్చుకోవడం జరుగుతుంది.రోజుకు సరాసరి శ్రీవారిని 70వేల మంది వరకు భక్తులు దర్శనం చేసుకుంటుండగా 30వేలమంది భక్తులు తలనీలాలు సమర్పిస్తుంటారు.ఆలయం లోపల మహాద్వారం దాటగానే ధ్వజస్తంభానికి కుడి పక్కన తులాభారం ఉంది. తులాభారంద్వారా రోజువారీగా ఐదులక్షల రూపాయల నుండి10లక్షల రూపాయల వరకు భక్తుల కానుకలతో ఆదాయం సమకూరుతుందనేది టిటిడి వర్గాల సమాచారం. తులాభారం త్రాసులోనూ మ్యాజిక్ చేశారనే విమర్శలకు తోడు రోజుకు వందమంది వరకు తులాభారం వేసిన భక్తుల సంఖ్య కూడా తగ్గించి లెక్కలు చూపి నిధులు స్వాహా చేశారనేది ప్రధాన ఆరోపణ. ఇక్కడ జమ అయిన మొత్తాన్ని ఏరోజుకారోజు దేవుని ఆదాయం లెక్కల్లో చూపాలి. ●

తమిళనాడు

# గెలుపు దారి లోకి!

**ఎ.వి.వి ప్రసాద్**

చలి కాలంలోనూ తమిళ రాజకీయాలు వేడెక్కి చుర్రుమంటున్నాయి. టివికె పార్టీని నడిపిస్తున్న ప్రముఖ నటుడు విజయ్ గతవారం తన రాజకీయ కార్యాచరణను ముమ్మరం చేయడంతో ఇతర పార్టీలు కూడా 'చురుకు'గా కదలడం మొదలు పెట్టాయి. ముఖ్యంగా కాంగ్రెస్,అన్నాడిఎంకె పార్టీలకు విజయ్ టివికె పార్టీ ప్రస్తుతం ఒక ఆశారేఖలా కనిపిస్తోంది. ఆ రెండు పార్టీలతో పాటు బిజెపి కూడా ఈసారి సీట్లు, ఓట్ల శాతం పెంచుకునే దిశలో పావులు కదుపుతోంది. ఈ పార్టీలన్నీ డిఎంకెకు వ్యతిరేకంగా విజయ్ టివికెతో చేతులు కలిపే ప్రయత్నాలు ఆరంభించాయి. అన్నాడిఎంకె నుంచి బయటకు వచ్చిన సీనియర్ నేత కెఎ సెంగొట్టియన్ పది రోజుల క్రితం టివికెలో చేరడంతో మరి కొందరు సీనియర్ నేతల చూపు కూడా ఇప్పుడు టివికె పైనే పడుతోంది.ఆయా పార్టీలలోని 'అసమ్మతి'నేతలు, తగిన ప్రాధాన్యం లభించని నేతలు టివికెలో చేరడానికి ఉత్సాహాన్ని ప్రదర్శిస్తున్నారు. తాము ఎవరితోనూ చేతులు కలపబోమనీ, అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తామనీ తొలుత ప్రకటించిన విజయ్ తన వైఖరిని కొంత సడలించినట్లు కనిపించడం కూడా ఇతర పార్టీలుఆయన వైపు చూడడానికి మరో కారణం.ఎన్నికల పొత్తులపై నిర్ణయం తీసుకునే అధికారం విజయ్‌కి అప్పగిస్తూ గతవారం టివికె నేతలు తీర్మానించడంతో ఇక ఆ దిశగా పార్టీ కార్యకలాపాలు సాగే సూచనలు కనిపిస్తున్నాయి. పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థి విజయ్ మాత్రమేనని, ముందు ముందు పార్టీలోకి ఎటువంటి సీనియర్లు వచ్చినా ఈ నిర్ణయంలో మార్పు ఉండదనీ నాయకత్వం స్పష్టం చేసింది. అలాగే ఇతర పార్టీలతో పొత్తుల విషయం పరిశీలించేందుకు ఒకప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు కూడా కార్యవర్గ సమావేశం ప్రకటించింది.డిఎంకె అవినీతి పాలనను అంతమొందించడానికి ఇతర పార్టీలు టివికెతో చేతులు కలపవలసిన అవసరం ఉన్నదనీ, అటువంటి ప్రయత్నాలను తాము స్వాగతిస్తామనీ సమావేశం స్పష్టం చేసింది. పార్టీ ఆమోదించిన నాలుగు తీర్మానాలలో మేనిఫెస్టో కమిటీ ఏర్పాటు కూడా ఉంది.ప్రచార వ్యూహం రూపొందించడానికికూడా త్వరలో ఒక ప్రత్యేక కమిటీ ఏర్పాటు కానుంది.

గత యేడాది పార్టీ ఆవిర్భవించిన తర్వాత ఇటువంటి కీలకమైన తీర్మానాలు ఆమోదించడం ఇదే మొదటిసారి.సెంగొట్టియన్ టివికెలో చేరినతర్వాత విజయ్ ఆలోచనా ధోరణిలో కూడా చాలా మార్పు వచ్చినట్లు కనిపిస్తోంది. ఒంటరిగానే బరిలోకి దిగాలనే నిర్ణయం నుంచి భావసారూప్యత గలవారినందరినీ కలుపుకొని వెళ్లాలనే అభిప్రాయానికి ఆయన రావడమే అందుకు ఉదాహరణ. పళనిసామి నాయకత్వంలో ఉన్న అన్నాడిఎంకెలో 'అసంతృప్త నేతలు' అధికంగానే ఉన్నారు.వచ్చే సంవత్సరం ఆరంభంలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయేలో భాగంగా బరిలోకి దిగాలనేఅన్నాడిఎంకె భావిస్తోంది. అయితే ఆ పార్టీ చీలిక వర్గం నాయకుడైన మాజీముఖ్యమంత్రి పన్నీర్ సెల్వం విజయ్



విజయ్

పార్టీతో జత కట్టడానికి ప్రయత్నిస్తుండడంతో ముందు ముందు అన్నాడిఎంకె రాజకీయాలు మరింత ఆసక్తికరం కానున్నాయి.డిఎంకె, అన్నాడిఎంకె లోని అసమ్మతి నేతలు తమ పార్టీలోకి వస్తే టివికె విజయం నల్లేరుపై నడకలా సాగుతుందనే అభిప్రాయంతో విజయ్ ఉన్నట్లుగా కనిపిస్తోంది. కరూర్ తొక్కిసలాట ఘటన తర్వాత విజయ్ తన వ్యూహాన్ని మార్చుకొన్నట్లుగా చెబుతున్నారు. డిఎంకె వ్యతిరేక ఓట్లు చీలకుండా తన గుప్పెట్లో ఉండడానికి అవసరమైన అన్ని ప్రయత్నాలను ఆయన సాగిస్తున్నట్లు కనిపిస్తోంది. చాలా కాలం నుంచి తమిళనాడులో కాంగ్రెస్‌కు ఆక్సిజన్అంది స్తున్నది డిఎంకె పార్టీయే అయినా అధికారంలో భాగస్వామ్యం లేకపోవడంతో ఆ పార్టీలోని కొందరు సీనియర్లు చాలా అసంతృప్తితో కనిపిస్తున్నారు. జికె మూపనార్ తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ చాలా బలహీనపడడంతో పూర్తిగా డిఎంకె దయాదాక్షిణ్యాలపైనే ఎన్నికల్లో నెట్టుకు వస్తోంది. గత ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తుతో అధికారంచేపట్టిన స్టాలిన్ ఆ పార్టీకి ఎటువంటి మంత్రి పదవులు ఇవ్వకపోవడం పలువురు సీనియర్లలో అసంతృప్తిని పెంచింది. అటువంటి వారందరికీ ఇప్పుడు టివికె పార్టీ ఆపద్బాంధవుడులా కనిపిస్తోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తమకు 40సీట్లు కేటాయించాలని టిఎన్ సిసి అధ్యక్షుడు సెల్వపెరుందగై రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జి గిరీష్ శోడంకర్ గతవారం స్టాలిన్‌ను కలిసి కోరారు. అందుకు స్టాలిన్ అభ్యంతరం వ్యక్తం చేయడంతో వారు విజయ్‌తో సంప్రదింపులు మొదలుపెట్టినట్లుగా తెలుస్తోంది.అయితే టివికె, కాంగ్రెస్‌మధ్య పొత్తు కుదిరినా విజయ్ 40 సీట్లు ఇస్తారా? అన్నది సందేహమే. 2021 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 18సీట్లు మాత్రమే వచ్చాయి. బిజెపికి అంతకంటే తక్కువగా 4 సీట్లు మాత్రమే వచ్చాయి. ఈ పరిస్థితిలో అటు కాంగ్రెస్‌తో కలిసినా, ఇటు బిజెపితో కలిసినా టివికెకు పెద్దగా ప్రయోజనం ఉండదనే పరిశీలకులు భావిస్తున్నారు.ఇక అన్నాడిఎంకెలోని చీలిక వర్గాలలో ముఖ్యంగా దినకరన్ కు ఓట్లు ఆకర్షించగల శక్తి ఎక్కువే ఉంది. ప్రస్తుతం ఆయన కూడా విజయ్ వైపు చూస్తున్నట్లుగా చెబుతున్నారు. సెంగొట్టియన్ టివికెలో చేరిన తర్వాత అన్నాడిఎంకె చీలిక వర్గాల నుంచి చాలామంది సీనియర్లు వచ్చి చేరవచ్చనే అభిప్రాయం వినిపిస్తోంది. అయితే ఎవరెవర్ని చేర్చుకోవాలో, ఎవరెవరు వద్దో విజయ్ జాగ్రత్తగా పరిశీంచవలసి ఉంది. ముందు ముందు వలసలు మరింత ఎక్కువగా ఉండవచ్చు. ఏదిఏమైనా వచ్చే ఎన్నికల్లో డిఎంకె కూటమిని ఎదుర్కొనేందుకు అన్నాడిఎంకె బిజెపి కూటమి, విజయ్ కూటమి ప్రధానంగా కృషి చేస్తాయి. ఈత్రిముఖ పోటీలో డిఎంకె తిరిగి అధికారంలోకివస్తుందా, లేక ప్రత్యర్థి పక్షాలు బలపడతాయా అన్నది కొద్ది నెలల్లోనే తేలుతుంది. అన్నాడిఎంకెలో తిరిగి ఐక్యత సాధ్యమైతే ఎన్నికల రణం మరింత ఆసక్తి దాయకంగా కనిపిస్తుంది. ●

బల్గేరియా

# ఐరోపాకూ 'జెన్‌జడ్' ఉద్యమం!

**గన్ని మోహన్**


అవినీతి ఆరోపణలు, ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోకపోవడం, ప్రజావ్యతిరేక ధోరణులతో ఏకపక్ష వాదం అనుసరించే ప్రభుత్వాలన్నీ కాలక్రమంలో కుప్పకూలుతున్నాయి. మొన్నటి శ్రీలంకనుంచి నిన్నటి బంగ్లాదేశ్,ఇప్పుడు వెనిజులా ఇలా ఎన్నెన్నో దేశాలు ఇదేకోవలోకి వస్తాయి. తాజాగా ఆగ్నేయయూరోప్ దేశమైన బల్గేరియా కూడా ఈ జెన్‌జడ్ ఆందోళనల జాబితాలో చేరింది. ప్రజల ఒత్తిడి, నిరసనలకు తలొగ్గి ప్రధాని రోసెన్ జెల్యాజ్‌కోవ్ సంకీర్ణ ప్రభుత్వం మొత్తం రాజీనామాను ఆమోదించారు. ఈ వారాంతంలో ఆ దేశంలో జరిగిన తాజా పరిణామాలకు కారణాలు అనేకం ఉన్నప్పటికీ ప్రజల నిర్ణయమే శిరోధార్యమని చెపుతూ జెల్యాజ్‌కోవ్ ప్రభుత్వ రాజీనామాను ప్రకటించారు. బల్గేరియాలోని యువత మొత్తం రాజధాని సోఫియాతోపాటు ఇతర నగరాలన్నింటిలోను ప్రభుత్వవ్యతిరేక నిరసనలు, ర్యాలీలతో హోరెత్తించారు. నిర్బంధకాండను అమలు చేసినా యువత ఎక్కడా మడమతిప్పకపోవడంతో చివరకు ప్రభుత్వనేతలు తలవంచాల్సి వచ్చింది. వచ్చే ఏడాది బడ్జెట్‌లో పన్నులు పెంచడంద్వారా సామాజిక భద్రతకు కేటాయింపులు పెంచడం, ప్రభుత్వ వ్యయం మరింత పెంచాలన్న ప్రతిపాదనలున్నాయి. దీనికితోడు రాజకీయంగా ఉన్నతస్థాయి నేతల్లో అవినీతి పెరిగిపోవడం కూడా ఇందుకు కారణం అయిందనే చెప్పాలి. అలాగే సామాన్య మధ్యతరగతి పౌరులకు దేశంలో ఎక్కడా న్యాయం అందడంలేదన్న ఆక్రోశం కూడా యువతలో పెరిగిపోయింది. జెన్‌జడ్ ఆందోళనలే ఇందుకు కారణమైందని నిస్సందేహంగా చెప్పవచ్చు. ఐదేళ్లలోనే తొమ్మిదో ప్రభుత్వం కుప్పకూలిందంటే ప్రజల్లో చైతన్యం ఏ స్థాయిలో ఉందో తెలుస్తోంది. నిజానికి వచ్చే ఏడాది జనవరిలోనే యూరోపియన్ యూనియన్‌లో చేరాల్సి ఉంది.ఐరోపా సమిష్టి కరెన్సీ యూరోను కూడా తమ కరెన్సీగా చేసుకోవాలని నిర్ణయించిన తరుణంలో ప్రభుత్వం ఒక్కసారిగా కుప్పకూలింది.240సీట్ల ఛాంబర్‌లో 227మంది రాజీనామాకే ఆమోదం తెలిపారు. కొత్తప్రభుత్వం ఏర్పడేంతవరకూ మాత్రమే ప్రస్తుత కేబినెట్ పని చేస్తుంది.గత జనవరిలోనే జెల్యాజ్‌కోవ్ ప్రభుత్వం ఏర్పాటుచేసింది. కేవలం ఆరువోట్ల మెజార్టీతో అవిశ్వాసతీర్మానాన్ని నెగ్గ కొచ్చిన ప్రస్తుతప్రధాని భారీస్థాయిలో నిరసనలతో గద్దెదిగిపోవాల్సి వచ్చింది. కేవలం ప్రజా ఒత్తిడితోనే తాము ప్రభుత్వం నుంచి దిగిపోతున్నామని, అందుకే రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. లాటిన్‌భాషలో ప్రధాని స్పందిస్తూ వోక్స్‌పాపులీ, వోక్స్ డీ అని వ్యాఖ్యానించారు. ప్రజలవాణి ఆ దేవుడి వాణి అని దీనికి అర్థం. ఇక అధ్యక్షుడు రెమెన్ రాదేవ్ పార్లమెంటులో అతిపెద్ద గ్రూపునకు ప్రభుత్వం ఏర్పాటుచేసే అవకాశం కల్పించాల్సి ఉంటుంది. రెండో అతిపెద్దరాజకీయ పార్టీ అధ్యక్షుడిముందు అభ్యర్థిని ఎంపికచేసుకుంటుంది. ప్రయత్నాలన్నీ విఫలం అయితే అధ్యక్షుడు రాదేవ్ కేర్‌టేకర్ కేబినెట్‌ను ఏర్పాటుచేసి ఎన్నికలునిర్వహణకు వెళ్లాల్సి ఉంటుంది.



జెల్యాజ్‌కోవ్

2021నుంచి చూస్తే మరోసారి ఎన్నికలకు వచ్చే సూచనలున్నాయి. అదే జరిగితే ఐదేళ్లలోనే ఎనిమిదిసార్లు ఎన్నికలు జరిగిన దేశంగా ఈబాల్కన్ ద్వీపకల్ప దేశం రికార్డుల్లో నిలిచిపోతుంది. కేవలం ఏడుమిలియన్లు కూడా పూర్తిగాలేని ఈ చిన్న ఆగ్నేయ యూరప్ దేశంలో నెలకొన్న రాజకీయ అనిశ్చితికి కారణం ప్రభుత్వంలో నెలకొన్న అవినీతి, నాయకుల ధోరణులేనని చెప్పాలి. ఎలాంటి ఒడిదొడుకులులేని ప్రభుత్వంగా నిలవాలని భావించే యూరోపియన్ కమిషన్ పరిధిలోని యూరో కరెన్సీనే తమ దేశ కరెన్సీగా అమలుచేయాలని కూడా నిర్ణయించింది.ప్రస్తుతం ఉన్న కరెన్సీ లెవ్‌స్థానంలో జనవరి ఒకటో తేదీ నుంచి అమలుచేయాల్సి ఉన్నప్పటికీ ప్రస్తుత అస్థిరత కారణంగా ఈ దేశం అటు ఎన్నికలకు వెళ్లలేనిస్థితిలోనూ, ఇటు కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేయలేని పరిస్థితిలోనుఉంది. 2007లో ఐరోపా కూటమిలో చేరినఈ బాల్కన్ దేశం యూరోజోన్‌లో 21వ సభ్యదేశంగా నిలుస్తోంది. దేశవ్యాప్తంగా ఉవ్వెత్తున ఎగిసి పడిన హక్కులు ఉద్యమంతో ప్రభుత్వ పెద్దలే దిగిరావాల్సి వచ్చింది. స్వేచ్ఛాయుత జీవనంవైపు వెంపర్లాడుతున్న యువతకు దారిచూపేప్రభుత్వం కావాలని వారు కోరుకుంటున్నారు. తదుపరి ప్రభుత్వంలో ఎన్నికైతే డెల్యాన్ పీవ్‌స్కీ లేదా జిఇఆర్‌బి యుడిఎఫ్ నేత బోయికో బోరిస్సోవ్‌లకు అవకాశం ఉండవచ్చని అంచనా. అయితే బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్ తరహాలో అక్కడ హింసాత్మక సంఘటనలు చోటుచేసుకోకపోవడం కొంత ఊరటనిస్తోంది. ప్రైవేటు రంగంపై అధిక పన్నులు విధించడం,ప్రభుత్వ రంగానికి మరిన్ని నిధులు కేటాయించాలన్న ప్రతిపాదనలతోనే ఈ నిరసన మొదలైంది. అందులోనూ ప్రభుత్వ పనితీరుపై తీవ్రస్థాయిలో అసంతృప్తి పేరుకుని పోయింది. వీటితోపాటు బడ్జెట్ ప్రతిపాదనలు కూడా పౌరులకు ఎంతమాత్రం రుచించలేదు. అందుకే బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు కూడా ప్రభుత్వం వెనకడుగు వేసింది. ప్రభుత్వంలోబాధ్యతాయుత వైఖరి, పారదర్శకత ఉండాలని, అందుకే కొత్త నాయకత్వం రావాలని యువత, వృద్ధ జనాభా ఎక్కువ కోరుతోంది. ఈ పరిస్థితుల దృష్ట్యానే గత నవంబరులో జెల్యాజ్‌కోవ్ 2026 బడ్జెట్ ప్యాకేజిని ఉపసంహరిస్తున్నట్లు ప్రకటించారు. ట్రేడ్ యూనియన్లు, ఉద్యోగులసంఘాలు సుతరాము ఇష్టంలేదు. మూలధన లబ్ధిపై పన్నులు పెంచడాన్ని పారిశ్రామికరంగంనుంచి తీవ్రనిరసన వ్యక్తం అయింది. పరిశ్రమలు మూసేస్తే ఉపాధి కొరవడుతుందన్న భయం యువతలో నెలకొనడంతో ఉద్యమానికి బీజం వేసింది. డివిడెండ్లపై విధించే పన్ను కూడా రెండు రెట్లు పెంచింది.బిజినెస్ వర్గాలకు ప్రత్యేక ఎలక్ట్రానిక్ అకౌంటింగ్ పరికరాలు ఏర్పాటు చేయడం ఉద్యమానికి దారితీసింది. ఐదేళ్లలోనే ఎనిమిది ప్రభుత్వాలు మార్చిన ఈ బల్గేరియా దేశంలో ఏర్పాటయ్యే కొత్త ప్రభుత్వం ఎంతమేర సుస్థిరతను తెస్తుందన్నది కూడా ప్రశ్నార్థకమే. ●

# బయో ఫ్యూయెల్‌కు కరవైన ప్రోత్సాహం



**రామ కిష్టయ్య సంగనభట్ల**

మండించినపుడు శక్తిని ఉత్పత్తి చేసే పదార్థాన్ని ఇంధనం అంటారు. ఇంధన వాడకం నిత్యకృత్యం. వాహనాలు నడవడానికి, విద్యుత్ ఉత్పత్తి చేయడానికి, వంట చేయడానికి ఇలాఇంధనం ఎన్నో రకాలుగా ఉపయోగపడుతున్నది. మనం ప్రతిక్షణం ఎన్నోరకాల ఇంధనాలపై ఆధారపడి జీవిస్తున్నాం. నీరు, పెట్రోల్, డీజిల్, బొగ్గు, విద్యుత్, కట్టెపుల్లలు సహా ఎన్నోరకాల ఘన, ద్రవ, వాయు ఇంధనాలు, యురేనియం, థోరియం వంటి అణు రసాయన ఇంధనాలు నిత్య జీవితంతో పెనవేసుకుని పోయాయి. నిత్య జీవితంలో ఇంధనాలుగా ఉపయోగపడుతున్నాయి. సంప్రదాయ ఇంధన వనరులైన బొగ్గు, పెట్రోల్, డీజిల్, అణుఇంధనాలు ప్రకృతిలో పరిమితంగా మాత్రమే లభిస్తాయి. వాటిని ప్రస్తుతం వినియోగిస్తున్నట్లుగా విపరీతంగా వినియోగిస్తే ప్రమాదం తప్పదు.అవసరాలకు మించి వినియోగం చేస్తూపోతే, భవిష్యత్తు అంధకారమే. అందుకే సంప్రదాయేతర ఇంధన వినియోగం ప్రత్యామ్నాయ మార్గంగా చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. పెట్రోల్ డీజిల్ గ్యాసులకు బదులుగా బయో ఇంధన వనరులను, బయోడీజిల్, బయో గ్యాస్ వంటి ఇంధన వనరులపై ఆధారపడడం వల్ల భవిష్యత్తు తరాలకు మేలు చేసినవారం అవుతాం. కొన్ని లక్షల సంవత్సరాల క్రితం భూమి అంతర్భాగంలో చేరి, భూమి లోపల విపరీతమైన ఉష్ణం, పీడనం కారణంగా మృత జీవజాలం నుండి శిలాజ నూనెలు/బొగ్గు ఏర్పడినవి. శిలాజ నూనెలు లేదా శిలాజ ఘన పదార్థాలను (నేల బొగ్గు వంటివి) తిరిగి సులభంగా పునరుత్పత్తి కావించుటకు సాధ్యం కాదు. అలా తిరిగి శిలాజ ద్రవ్యాలు ఏర్పడాలంటే మళ్లీ కొన్ని లక్షల సంవత్సరాలు పడుతుంది. అంటే శిలాజ ఇంధనాలను వాడే కొలది వాడి నిల్వలు తగ్గుతాయి కాని పెరగవు. 19వ శతాబ్దినుండి శిలాజ ఇంధన వాడకం ప్రపంచవ్యాప్తంగా పెరిగిపోయింది.పరిశ్రమల్లో బాయిలర్లలో, థెర్మోపవరు ప్లాంటు బాయిలరులో బొగ్గు వాడకం ఎక్కువ. పెట్రోలు, డీజిల్‌ను ఇంధనంగా వాడు వాహనాలు విపరీతంగా పెరిగిపోయాయి.అందువలన శిలాజ ఇంధనాల నిల్వలు త్వరగా కరిగి,తరిగిపోతున్నాయి. ఇలాగే శిలాజ ఇంధనాల వాడకం కొనసాగితే కొన్ని వందల సంవత్సరాల తరువాత శిలాజ నిల్వలు తరిగిపోతూ, బైకులు, కార్లు, బస్సులు, ట్రక్కులు, విమానాలు, ఓడలు ఏవి కదలవు. మళ్లీ మానవుడు ఎద్దుల బండ్లను, గుర్రపు బళ్ళను, సైకిళ్ళను వాడవలసి వుంటుంది. కనుక కొంత మేరకు పెట్రోలియం ఇంధనాల వాడకం తగ్గించే నేపథ్యంలో ఈ జీవ ఇంధనాల వైపు ప్రపంచ దృష్టి మళ్ళింది. చెట్లగింజల నుండి తీసిన కొన్ని నూనెలు ఆహార యోగ్యం కాదు. ఉదాహరణకు వేప, కానుగ, జట్రోఫా (అడవి ఆముదం, నేపాళం) వంటి అనేక నూనెలుఆహార యోగ్యం కాదు. ఈ నూనెలను అల్కహాలసిస్ అనబడు ఎస్టరిఫికేసన్ రసాయన చర్య ద్వారా బయోడీజిల్‌గా పరివర్తించి, 10 వరకు డీజిల్‌లో కలిపి డిజిల్‌ను ఇంధనంగా వాహనాల్లో వాడటం వలన డీజిల్ వాడకాన్ని చాలావరకుతగ్గించవచ్చు.




డీజిల్‌తో నడిచే వాహనాల్లోని అంతర్గత దహన యంత్రం, కార్బొరేటరులో తగు మార్పులు చేసిన నేరుగా బయోడిజిల్‌ను వాడవచ్చును. అలాగే డీజిల్‌తో నడిచే రైలుఇంజనులలో బయోడిజిల్‌ను వాడవటం వలన కూడా డీజల్ వాడకాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. పశువుల పేడ, మూత్రాలను ఉపయోగించి బయోగ్యాస్ ఉత్పత్తి కొన్ని దశాబ్దాలుగా ఉత్పత్తి చేస్తున్న విషయం తెలిసినదే. అలాగే ఏదైన జీవద్రవ్య ఘన ఇంధనాన్ని తక్కువ ఆక్సిజన్ అందేలా/లేదా ఆక్సిజన్ రహిత వాతావరణంలో 450వద్ద మండించడం వలన జీవ వాయు ఇంధనం ఏర్పడుతుంది. ఘనజీవ ద్రవ్య పదార్థాలను తాపవిచ్ఛేదన, ఉష్ణవిచ్ఛేదన కావించిన హైడ్రోజన్,కార్బన్ మోనాక్సైడ్,మిథేన్, ఈథేను, ఇథిలిన్ వాయువులు ఏర్పడుతాయి. ఈ వాయువులను కండెన్సరు/ద్రవీకరణకారిలోద్రవీకరించిన ద్రవ ఇంధనం/బయోడీజిల్ ఏర్పడుతుంది. గత యూపీఏ ప్రభుత్వం పెట్రోలియం ఉత్పత్తుల దిగుమతి వ్యయంతగ్గించడం, వాతావరణ కాలుష్య నివారణకు, విలువైన విదేశీ మారక ద్రవ్యం మదింపుకోసం జీవ ఇంధనాల ఉత్పత్తులపై ప్రధానంగా దృష్టి నిలిపింది.ఇంధన భద్రతే విదేశాంగ విధానాలను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేస్తున్న ప్రస్తుత కాలంలో శిలాజ ఇంధనాల నిల్వలు రోజురోజుకూ అడుగంటిపోతున్న కారణంగా కాక, భూ ఉష్ణోగ్రత వ్యాకోచానికి దారి తీస్తున్న, బొగ్గు పులుసు వాయువుల విడుదలను అరికట్టడానికి, ప్రత్యామ్నాయఇంధన వనరులను అభివృద్ధి చేయడం అనివార్యంగా మన్మోహన్ సింగ్ ప్రభుత్వం భావించింది. శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నాయంగా జీవ ఇంధనాలు (బయో ఫ్యూయెల్) అన్ని విధాలా లాభసాటిగా గుర్తించారు.శిలాజ ఇంధనం పెట్రోలు స్థానంలో, కర్బనం తక్కువగా ఉండే బయోడీజిల్ ప్రత్యామ్నాయ రవాణా ఇంధనంగా అభివృద్ధి చేసే దిశలో, ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్న తరుణంలో, బయో ఇంధన ఉత్పత్తులపై దృష్టి నిలిపింది. బయో డీజిల్ విపణి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని భావించి, నిర్ధారించి, చమురు ధరలు పెరిగిపోవడాన్ని దృష్టిలో ఉంచుకొని భారత దేశంలో బయో డీజిల్ అభివృద్ధికి పెద్ద ఎత్తున ప్రోత్సాహం అందించే దిశగా కృషి చేసింది. బయో డీజిల్ అనగా కానుగ (శాస్త్రీయ నామం:పెన్నేటి) గింజలు లేదా పెద్ద నేపాళం (జట్రోటా)గింజల నుండి తీసే నూనె. బయోడీజిల్ రెండు దశాబ్దాల క్రితమే గుర్తించినా,ఆదికార్య రూపం దాల్చడానికి చాలా సమయం పడుతున్నది. సస్టేనెబుల్ ట్రాన్స్ఫర్మేషన్ ఆఫ్ రూరల్ ఏరియాస్ (సూత్ర) అనే సంస్థ బెంగళూరులో బయో డీజిల్ తయారీ, వినియోగంపై విస్తృత పరిశోధన జరిపింది. బంజరు భూములు అధికంగా గల భారతావనిలో జీవఇంధనాన్ని ఉత్పత్తి చేయడానికి పలు పెద్ద సంస్థలు ప్రయత్నించాయి. కానుగ సాగుకు ఎంతో సాంకేతిక పరిజ్ఞానం అక్కరలేదు. కానుగ చెట్లు నెలకు ఒకటి, రెండు తడులతో మామిడి చెట్లంత పెరుగుతాయి. గృహావరణాల్లో, రోడ్ల కిరువైపులా కానుగ నాటితే ఆహ్లాదకరమైన నీడతోపాటు, వేడినీళ్లకు చన్నీళ్లు తోడులాగా ఆదాయం పెరుగుతుంది. ఈ చెట్లు 5 సంవత్సరాలు కాపు ప్రారంభించి, 30 ఏళ్లవరకు పంట నిస్తాయి. కానుగ స్వయంగా చీడపీడల నివారణి అయినందున దానిపై ఎటు వంటి చీడ పీడలుండవు. ప్రధాని నరేంద్ర మోడీ గత ప్రభుత్వం ఇటీవలి కాలంలో పునరుత్పాదక ఇంధన పథకాలకు విశేష కృషిచేసింది. స్వచ్ఛమైన శిలాజ ఇంధనాలను, పర్యావరణ హితమైన ఇంధనాలను తగిన పరిమాణంలో అందుబాటులో ఉంచుకోవడానికి, అవి అందుబాటు యోగ్యంగా ఉండేలా చూడటానికి ప్రాధాన్యం ఇచ్చింది. దేశం లో సులభతర వాణిజ్య నిర్వహణకు ఎంతో చేయూత అందిస్తున్నది. స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారులకు సదుపాయంగా ఉండేలా, అన్ని మంత్రిత్వ శాఖల్లో ప్రాజెక్ట్ అభివృద్ధి విభాగాలను విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విభాగాలను ఏర్పాటు చేసింది. ఇంధన పేదరికాన్ని అంతంచేసే దిశగా, స్వచ్ఛమైన శిలాజ ఇంధనాలను, పర్యావరణహితమైన ఇంధనాలను తగిన పరిమాణంలో అందుబాటులో ఉంచుకోవడానికి మార్గనిర్దేశం చేసింది. స్వచ్ఛందంగా శిలాజ ఇంధన వినియోగం, స్వదేశీ ఇంధనాలపై మరింత ఎక్కువగా ఆధార పడటం, విద్యుత్ సేవలను పెంచడం, అన్ని ఇంధన వ్యవస్థల్లో డిజిటల్ సృజనాత్మక పరి జ్ఞానాన్ని ప్రోత్సహించడం తదితర అంశాలపై ప్రభుత్వ దృష్టి కేంద్రీకృతం చేసింది. ●

# మెస్సీ రాకతో కోల్‌కతాలో హడావుడి

## సాల్ట్‌లేక్ స్టేడియంలో కట్టలు తెంచుకున్న అభిమానుల ఆగ్రహం

## పది నిమిషాల్లోనే మెస్సీ వెళ్లిపోవడంపై నిరాశ

## అభిమానులకు, మెస్సీకి క్షమాపణలు చెప్పిన బెంగాల్ సిఎం మమత





**కోల్‌కతా,డిసెంబరు 13:** కోల్‌కతాలో ఫుట్‌బాల్ ప్లేయర్ మెస్సి ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో ఆడకపోవడంతో సాల్ట్ లేక్ స్టేడియంలో అభిమానులు విధ్వంసం సృష్టించారు. గోట్‌టూర్ ఆఫ్ ఇండియాలో పాల్గొనేందుకు వచ్చిన మెస్సిని సమీపంనుంచి చూడాలని, ఆతడి ఆటను చూడాలని అభిమానులు ఎంతో ఆశతో వచ్చారు. ఈసమయంలో ఇలా వచ్చి అలా స్టేడియంనుంచి వెళ్లిపోవడాన్ని అభిమానులు తట్టుకోలేక పోయారు. పట్టుమని పదినిమిషాలుకూడా ఉండలేదని ఆగ్రహం వ్యక్తంచేసారు. స్టేడియంలో ఫ్లెక్సీలు చించి గ్రౌండ్‌లోకి కుర్చీలు, బాటిళ్లు విసిరేశారు. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. బారికేడ్లు దాటి స్టేడియంలోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో అక్కడ గందరగోళం నెలకొంది. ఈవెంట్ చూసేందుకుగాను రాజకీయ నాయకులు, ఫుట్‌బాల్ మాజీ క్రీడాకారులు కోచ్‌లు అందరూ వచ్చారు. స్టాండ్స్ చుట్టూ వీరే ఉండటంతో మెస్సీ ఫ్యాన్స్‌కు ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఈ గందరగోళం వల్లనే ముందుగా నిర్ణయించిన రెండు ఈవెంట్లను నిర్వహించలేక పోయారు. పదినిమిషాల్లోనే ఆతడిని స్టేడియం నుంచి తీసుకెళ్లిపోవడంపై ఆగ్రహావేశాలతో అభిమానులు ఊగిపోయారు. సాల్ట్‌లేక్‌లోకి దూసుకొచ్చారు. టెంట్లు, ఇతర టెంపరరీ ఆకృతులన్నింటినీ ధ్వంసంచేసారు. భద్రతా సిబ్బంది నియంత్రించలేనిస్థితి నెలకొంది. ఒక్కొక్కర్రూ రూ.4500 నుంచి రూ.10వేల వరకూ వెచ్చించారని ఇందుకోసమా మేం వచ్చింది అంటూ నిలదీసారు. ఫిర్యాదులు వెల్లువలా రావడంతో గవర్నర్ కూడా ప్రభుత్వం సంబంధిత అధికారులనుంచి నివేదిక కోరారు.

**నిర్వాహకుడు అరెస్టు:** ఉద్రిక్తపరిస్థితులు నెలకొనడంతో పోలీసులు భారీ ఎత్తున మొహరించి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. అలాగే కోల్‌కతా పోలీసులు శనివారం ఆ ఈవెంట్ ఆర్గనైజర్ శతాద్రు దత్తను అరెస్టు చేశారు. ఆకస్మికంగా మెస్సీని స్టేడియం నుంచి తీసుకెళ్లడంతో ప్రేక్షకులు వీరంగం సృష్టించారు. ఎయిర్‌పోర్టులో శతాద్రు దత్తను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు చెప్పారు. సాల్ట్ లేక్ స్టేడియంలో తీవ్ర స్థాయిలో ప్రాపర్టీకి నష్టం జరిగింది. పలు రకాల సెక్షన్ల కింద నిర్వాహకుడిపై కేసు పెట్టనున్నారు. త్వరలో ఎఫ్ఐఆర్ నమోదు చేయనున్నట్లు కోల్‌కతా పోలీసులు వెల్లడించారు. లీగల్ చర్యలు తీసుకుంటామని శాంతిభద్రతల అదనపు డీజీ జావెద్ షామిమ్ తెలిపారు. అభిమానుల్ని విస్మరించడం పట్ల ఆరా తీస్తామని, ఎక్కడ లోపం జరిగిందో తెలుసుకుని చర్యలు తీసుకుంటామన్నారు. కోల్‌కతా ఘటనను సుమోటోగా స్వీకరించిన కేసును నమోదు చేయనున్నట్లు కోల్‌కతా పోలీసులు తెలిపారు. ప్రేక్షకుల టికెట్ డబ్బును రిఫండ్ చేయాలని నిర్వాహకులకు పోలీసులు ఆదేశాలు ఇచ్చారు. ఇలాంటి మేనేజ్మెంట్‌ను సహించబోమని కోల్‌కతా పోలీసు కమీషనర్ రాజీవ్ కుమార్ తెలిపారు. అర్జెంటీనా ఫుట్‌బాల్ స్టార్ ప్లేయర్ లియోనల్ మెస్సి భారత పర్యటనకు వచ్చిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కోల్‌కతాలో ఇవాళ ఉదయం ల్యాండ్ అయ్యారు. అనం తరం స్థానిక సాల్ట్ లేక్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇక మెస్సిని చూసేందుకు కోల్‌కతా సహా పలు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున ఫ్యాన్స్ తరలివచ్చారు. అక్కడ అభిమానులకు నిరాశే ఎదురైంది. ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో మెస్సి ఆడాల్సి ఉండగా ఆడకుండానే స్టేడియం నుంచి వెళ్లిపోయారు. దీంతో ఫ్యాన్స్ ఆగ్రహంతో ఊగిపోయారు. అప్రమత్తమైన అధికారులు వారిని అడ్డుకున్నారు. స్టేడియం వద్ద భద్రతను పెంచారు.

**మెస్సీకి మమతా బెనర్జీ క్షమాపణలు:** సాల్ట్‌లేక్ స్టేడియంలో జరిగిన ఉద్రిక్తతలపై పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ స్పందించారు. జరిగిన సంఘటనలు దురదృష్టకరమని పేర్కొంటూ ప్రపంచ దిగ్గజ ఆటగాడు లియోనెల్ మెస్సీకి, మెస్సీ అభిమానులకు క్షమాపణలు చెప్పారు. స్టేడియంలో నిర్వహణ లోపం పట్ల దిగ్భ్రాంతి కలిగిందని, మెస్సీని చూసేందుకు వచ్చిన వేలాదిమంది క్రీడాభిమానులతోకలిసి నేనుకూడా చూద్దామని స్టేడియానికి బయలుదేరానని, అక్కడి పరిస్థితిని తెలిసి వెనుదిరిగినట్లు చెప్పారు. స్టేడియంలోజరిగిన ఘటనకు మెస్సీకి, ఆయన అభిమానులకు క్షమాపణలు చెపుతున్నట్లు తెలిపారు. ఈ ఘటనపై జస్టిస్ ఆషిమ్ కుమార్ అధ్యక్షతన విచారణ కమిటీని ఏర్పాటు చేస్తున్నానని, దర్యాప్తు అనంతరం నిర్వహణ వైఫల్యానికి కారకులపై చర్యలు తీసుకుంటామని, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.


# పార్లమెంటుపై ఉగ్రదాడికి 24 యేళ్లు: నివాళులర్పించిన ప్రముఖనేతలు

**న్యూఢిల్లీ, డిసెంబరు 13:** ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యానికి ప్రతీకగా నిలిచే భారత పార్లమెంటుపై ఉగ్రదాడికి నేటితో 24 ఏళ్లు పూర్తి. 2001 డిసెంబర్ 13వ తేదీన ఢిల్లీలోని పార్లమెంటు భవనంపై ఉగ్రదాడి జరిగిన విషయం తెలిసిందే. ఆ దాడిలో మరణించిన జవాన్లకు పలువురు నేతలు నివాళులర్పించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ, ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ సీపీ రాధాకృష్ణన్, కేంద్ర మంత్రులు కిరెన్ రిజుజు, జితేంద్ర సింగ్, అర్జున్ రామ్ మేఘ్వాల్, కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహ పలువురు ఎంపీలు, సీనియర్ లీడర్లు జవాన్లకు నివాళులర్పించారు.

2001, డిసెంబర్ 13న పార్లమెంటు శీతాకాల సమావేశాలు జరుగుతున్న సమయంలో ఉగ్రమూక పథకం ప్రకారం పార్లమెంటు ప్రాంగణంలోకి చొరబడింది. హోం శాఖ అనుమతి ఉన్న స్టిక్కర్‌తో ఎరుపు రంగు అంబాసిడర్ బుగ్గకారులో లోపలికి ప్రవేశించింది. అక్కడ నిలిపిఉన్న ఉపరాష్ట్రపతి కారును ఢీ కొట్టింది. అనంతరం కిందకు దిగిన ముష్కరులు కాల్పులతో బీభత్సం సృష్టించారు. అడ్డువచ్చిన వారిని కాల్చుకుంటూ పోయారు.

# హెచ్1బి వీసా ఫీజు పెంపుపై యుఎస్‌లో ఆగ్రహం

## కోర్టుకెక్కిన 20 కీలక రాష్ట్రాలు



**కాలిఫోర్నియా, డిసెంబరు 13:** అధ్యక్షుడు ట్రంప్ 2025 సెప్టెంబర్ 19న జారీ చేసిన ఆదేశాల మేరకు హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం జారీచేసిన హెచ్1బి వీసా లక్షడాలర్ల ఫీజులపై కాలిఫోర్నియాతో సహా 20 రాష్ట్రాలు అమెరికా కోర్టులో దావా దాఖలుచేసాయి. ట్రంప్ ఆదేశాలమేరకు హోంల్యాండ్ సెక్యూరిటీ ఈ కొత్త ఫీజును అమలులోకి తెచ్చింది. ఈ విధానం వల్ల ఆసుపత్రులు, విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు వంటి సంస్థలు తీవ్రంగా నష్టపోతాయని రాష్ట్రాలు వాదిస్తున్నాయి. ఈ దావాకు నాయకత్వం వహిస్తున్న కాలిఫోర్నియా అటార్నీ జనరల్ రాబ్ బొంటా మాట్లాడుతూ, ఈ అక్రమ ఫీజు వల్ల ప్రభుత్వ సంస్థలపై తీవ్ర ఆర్థిక భారం పడుతుంది. కీలక రంగాల్లో ఇప్పటికే ఉన్న సిబ్బంది కొరత మరింత పెరుగుతుందని అన్నారు. ఈ ఫీజును విధించే అధికారం ప్రభుత్వానికి లేదని, ఇది అమెరికా రాజ్యాంగాన్ని, అడ్మినిస్ట్రేటివ్ ప్రొసీజర్ యాక్ట్‌ను ఉల్లంఘించడమేనని రాష్ట్రాలు తమ పిటిషన్‌లో పేర్కొన్నాయి. ప్రస్తుతం హెచ్1బీ పిటిషన్లకు 960 డాలర్ల నుంచి 7,595 డాలర్ల వరకు మాత్రమే ఫీజులు ఉన్నాయి. ఈ కొత్త నిర్ణయం వల్ల విద్య, వైద్య రంగాల్లో ఖాళీలను భర్తీ చేయడం మరింత కష్టమవుతుందని రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికే దేశంలోని అనేక పాఠశాలలు ఉపాధ్యాయుల కొరతతో ఇబ్బంది పడుతున్నాయి. అలాగే 2036 నాటికి అమెరికాలో 86,000 మంది వైద్యుల కొరత ఏర్పడవచ్చని అంచనాలున్నాయి. భారత్ నుంచి వెళ్లే టెక్ నిపుణులు, వైద్యులకు హెచ్1బీ వీసా అత్యంత కీలకమైన మార్గంగా ఉన్న నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది. కాలిఫోర్నియా, మసాచుసెట్స్ సహా న్యూయార్క్, న్యూజెర్సీ, అరిజోనా వంటి రాష్ట్రాలు ఈ దావాలో పాలుపంచుకున్నాయి. దీనివల్ల భవిష్యత్తులో ప్రతిభావంతులైన నిపుణులు అమెరికాకు రాకపోవచ్చని, ఇప్పటికే నిపుణుల కొరతను ఎదుర్కొంటున్నట్లు కాలిఫోర్నియా అటార్నీ జనరల్ వెల్లడించారు. కీలక రాష్ట్రాల్లో భారీ ఎత్తున భారతీయ విదేశీ నిపుణులు పనిచేస్తున్నారని వీరి నిష్క్రమణం వల్ల ఇపుడు ఈ కంపెనీలకు నిపుణుల కొరత ఎదురవుతుందని, ఫలితంగా వీటిద్వారా లేఆఫ్‌లు కూడా పెరుగుతాయని ఆందోళన వ్యక్తంచేసారు. ఇప్పటికే ప్రతినిధుల సభలో ట్రంప్ సుంకాలు వ్యతిరేకిస్తూ ముగ్గురు ప్రతినిదులు తీర్మానం తెచ్చారు. డెబోరా రాస్, మార్క్ వీసీ, రాజాకృష్ణమూర్తిలు ఈ తీర్మానం ప్రవేశపెట్టారు. సుంకాలు చట్టవిరుద్ధం అని వీటివల్ల అమెరికన్లకే ఎక్కువ నష్టమని వారు తమ తీర్మానంలో వెల్లడించారు.

## మహిళల కోసం 'వయాగ్రా' క్రీమ్..

### డేర్ బయోసైన్సెస్ ప్రత్యేక ఆవిష్కరణ

**శాన్‌ఫ్రాన్సిస్కో, డిసెంబరు 13:** పురుషుల లైంగిక సామర్థ్యాన్ని పెంచే వయాగ్రా అందుబాటులోకి వచ్చి మూడు దశాబ్దాలు దాటింది. ఇపుడు మహిళల కోసం కూడా ప్రత్యామ్నాయంగా ఒక కొత్త ఉత్పత్తిని శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. అమెరికాకు చెందిన డేర్ బయోసైన్స్ అనే సంస్థ మహిళల్లో లైంగిక ప్రేరేపణను పెంచే ఒక ప్రత్యేకమైన క్రీమ్‌ను తయారు చేసింది. డేర్ టు ప్లే పేరుతో వస్తున్న ఈ క్రీమ్ కేవలం 10 నిమిషాల్లోనే ప్రభావం చూపుతుందని సంస్థ చెబుతోంది. ఈ క్రీమ్‌లో వయాగ్రాలో ఉపయోగించే ఖిసిల్డెనాఫిల్‌ఖి అనే రసాయనాన్నే వాడారు. దీన్ని ప్రైవేట్ భాగాల్లో రాసుకోవడం ద్వారా రక్త ప్రసరణ పెరిగి, స్పర్శ జ్ఞానం, లైంగిక వాంఛ మెరుగుపడతాయని తయారీదారులు చెబుతున్నారు. "మహిళల శరీరాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేకంగా రూపొందిస్తే సిల్డెనాఫిల్ అద్భుతంగా పనిచేస్తుందని శాస్త్రీయంగా నిరూపించాం. 1998లో వయాగ్రా పురుషుల లైంగిక వైద్యంలో విప్లవం సృష్టించింది. కానీ మహిళల విషయంలో దాదాపు 30 ఏళ్లుగా ఎలాంటి పురోగతి లేదు" అని డేర్ బయోసైన్స్ సీఈఓ సబ్రినా మార్టుక్కీ జాన్సన్ తెలిపారు. ఈ ఉత్పత్తి భద్రత, సామర్థ్యాన్ని పలు క్లినికల్ ట్రయల్స్ ద్వారా నిర్ధారించామని, అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ అనుమతుల కోసం ప్రయత్నిస్తున్నామని కంపెనీ పేర్కొంది. సుమారు 200 మంది మహిళలపై జరిపిన ప్రయోగాల్లో ఎలాంటి దుష్ప్రభావాలు లేకుండానే వారిలో లైంగిక ఆసక్తి, కోరికలు, భావప్రాప్తి వంటివి గణనీయంగా పెరిగినట్లు తేలింది. పురుషులకు ఉన్నట్లుగా మహిళలకు పిల్ ఎందుకు తయారు చేయలేదన్న ప్రశ్నకు, దానికి చాలా ఎక్కువ మోతాదులో సిల్డెనాఫిల్ అవసరమవుతుందని, అది ఆచరణ సాధ్యం కాదని జాన్సన్ వివరించారు. ప్రస్తుతం అమెరికాలోని 10 రాష్ట్రాల్లో ఈ క్రీమ్ కోసం ప్రీఆర్డర్లు స్వీకరిస్తుండగా, 2026 ప్రారంభం నాటికి దేశవ్యాప్తంగా అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

# ఎలాన్ మస్క్‌కు ఇమ్రాన్‌ఖాన్ మాజీ భార్య బహిరంగ లేఖ



**ఇస్లామాబాద్, డిసెంబరు 13:** ప్రపంచ కుబేరుడు ఎలాన్‌మస్క్‌కు పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ మాజీ భార్య జెమీమా గోల్డ్‌స్మిత్ బహిరంగ లేఖ రాశారు. తన ఎక్స్ ఖాతాలో విజిబిలిటీ ఫిల్టరింగ్‌ను సరిచేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. జైలులో ఉన్న ఇమ్రాన్‌ఖాన్ పరిస్థితి గురించి తాను పెడుతున్న పోస్టులు ప్రజలకు చేరడం లేదని వెల్లడించారు. ఈ మేరకు జెమీమా తన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. దీనికి మస్క్‌ను ట్యాగ్ చేశారు. ఆ పోస్టులో 'ఎలాన్‌మస్క్‌కు ఓ వ్యక్తిగత విజ్ఞప్తి. చట్టవిరుద్ధంగా ఏకాంత నిర్బంధంలో నా భర్త ఇమ్రాన్‌ను చూసేందుకు, మాట్లాడేందుకు నా ఇద్దరు కుమారులకు అనుమతి ఇవ్వడం లేదు. కేవలం 'ఎక్స్' ద్వారా మాత్రమే ఇమ్రాన్ ఖాన్ గురించి మా ఆవేదనను ప్రపంచానికి చెప్పగలుతున్నాం' అని రాసుకొచ్చారు. పాక్ అధికారులు ఇమ్రాన్‌పై వ్యవహరిస్తున్న తీరు గురించి తాను పెడుతున్న పోస్టులు బయటకు రావడం లేదని జెమీమా ఆరోపించారు. అవి ప్రజలకు చేరడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో తన ఎక్స్ ఖాతాలో విజిబిలిటీ ఫిల్టరింగ్‌ను సరిచేయాలని ఆమె మస్క్‌కు విజ్ఞప్తి చేశారు. 2023 నుంచి ఇమ్రాన్‌ఖాన్ అడియాలా జైలులోనే ఉన్నారు. ఇటీవల ఆయన మృతి చెందినట్లు సామాజిక మాధ్యమాల్లో పెద్దఎత్తున ప్రచారం జరిగింది. ఈ క్రమంలో ఆయన మద్దతుదారులు ఇమ్రాన్‌ను కలిసేందుకు అవకాశమివ్వాలని నిరసనలు వ్యక్తం చేశారు. ఆ తర్వాత ఇమ్రాన్ సోదరి ఉజ్మా ఖానుమ్‌కు మాత్రమే ఆయనను కలిసే అవకాశం కల్పించారు. జైలులో ఇమ్రాన్ సురక్షితంగానే ఉన్నారని ఆ తర్వాత ఖానుమ్ ప్రకటించారు.

# కాంగ్రెస్ పునరుజ్జీవం ఒక జాతీయ బాధ్యత



కేంద్ర మాజీ మంత్రి అశ్వినీకుమార్


**న్యూఢిల్లీ, డిసెంబరు 13:** దేశంలో కాంగ్రెస్ పార్టీ లేకుండా సమర్థవంతమైన ప్రతిపక్షాన్ని ఊహించలేమని, అయితే ఆ పార్టీ తన ప్రాభవాన్ని ఎక్కడో కోల్పోయిందని మాజీ కేంద్ర మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత అశ్వనీ కుమార్ అభిప్రాయపడ్డారు. పార్టీ పునరుజ్జీవం పొందడం ఒక జాతీయ బాధ్యత అని ఆయన వ్యాఖ్యానించారు. తన కొత్త పుస్తకం గార్డియన్స్ ఆఫ్ ది రిపబ్లిక్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రతిపక్ష పార్టీలలో తప్పులు వెతకడం కంటే, కాంగ్రెస్ తనలోని బలహీనతలను గుర్తించేందుకు ఆత్మపరిశీలన చేసుకోవాలని ఆయన సూచించారు. రాహుల్ గాంధీ హృదయం సరైనదే, ఆయన పేదల పక్షాన మాట్లాడతారు. కానీ ఎక్కడో పార్టీ సందేశం ప్రజల్లోకి బలంగా వెళ్లడం లేదు. ఈ విషయాన్ని వారే గుర్తించాలని కుమార్ అన్నారు. ఈవీఎంల ద్వారా ఎన్నికల్లో మోసాలు జరుగుతున్నాయని ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలపైనా ఆయన స్పందించారు. హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో గెలిచినప్పుడు ప్రభుత్వాలను ఏర్పాటు చేసి, ఓడిపోయినప్పుడు మాత్రమే ఈవీఎంలను నిందించడం వల్ల నైతిక విశ్వసనీయతను కోల్పోతారు. ఈ ద్వంద్వ వైఖరి సరికాదని ఆయన హితవు పలికారు. తాను పార్టీని వీడినప్పటికీ, సోనియాగాంధీ పట్ల తనకు అపారమైన గౌరవం ఉందని అశ్వనీ కుమార్ తెలిపారు. ప్రజా జీవితంలో ఆమె చూపిన హుందాతనాన్ని, ఎందరో ప్రధాని అభ్యర్థులు ఉన్నప్పటికీ తన నాగరికత, గౌరవం కారణంగా మన్మోహన్ సింగ్‌ను ఎంపిక చేయడాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. ప్రస్తుత ప్రభుత్వం, ప్రధాని ప్రతిదీ తప్పు చేస్తున్నారనే భావన కూడా సరైంది కాదని ఆయన పేర్కొన్నారు.

# పేరు మార్చడం కాదు..ప్రయోజనం పెరగాలి: ప్రియాంక



**న్యూఢిల్లీ, డిసెంబరు 13:** కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును పూజ్య బాపు గ్రామీణ్ రోజ్‌గార్ యోజనగా మార్చి నిర్ణయంపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకాగాంధీ స్పందించారు. ఉపాధి హామీ పథకం పేరును మార్చడంవల్ల ప్రజలకు చేకూరే ప్రయోజనం ఏమిటని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇలాంటి చర్యలతో డబ్బు ఖర్చు తప్ప మరే ఉపయోగం లేదని విమర్శించారు. వంద రోజులు ఉపాధి కల్పించడం ద్వారా పల్లెప్రాంత పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం కోసం ఎన్నో ఏళ్లుగా అమలు చేస్తున్న ఈ పథకానికి ఇప్పుడు పేరు మార్చాల్సిన అవసరం ఏమిటో తనకు అర్థం కావడం లేదని అన్నారు. పథకం పేరు మార్చితే దానికి సంబంధించిన అన్ని కార్యాలయాలు, వస్తువులపై ఇప్పటికే ముద్రించిన పేర్లను మార్చాల్సి వస్తుందని ప్రియాంకాగాంధీ అన్నారు. ఇది ఖరీదైన ప్రక్రియ అని, చాలా డబ్బు ఖర్చు చేయాల్సి వస్తుందని ఆమె చెప్పారు. కాగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును పూజ్య బాపు గ్రామీణ్ రోజ్‌గార్ యోజనగా మారుస్తూ శుక్రవారం కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. అలాగే పనిదినాల సంఖ్యను 100 నుంచి 125కి పెంచింది. ఒక రోజుకు ఇచ్చే కనీస వేతనాన్ని రూ.240కి సవరించింది.

# ట్రంప్ సుంకాలతో అమెరికాకే నష్టం



## ముగ్గురు రిపబ్లికన్ల సభలో తీర్మానం

**వాషింగ్టన్, డిసెంబరు 13:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ దిగుమతులపై విధించిన 50 శాతం సుంకాలను రద్దు చేయాలని కోరుతూ ముగ్గురు అమెరికా చట్టసభ సభ్యులు నిన్న ప్రతినిధుల సభలో తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ టారిఫ్‌లు చట్టవిరుద్ధమని, అమెరికా కార్మికులకు, వినియోగదారులకు, ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని వారు ఆరోపించారు. కాంగ్రెస్ సభ్యులు డెబోరా రాస్, మార్క్ వీసే, రాజా కృష్ణమూర్తి ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఆగస్టు 27, 2025న అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం కింద భారత్‌పై అదనంగా విధించిన 25 సుంకాలను రద్దు చేయాలని ఈ తీర్మానం లక్ష్యంగా పెట్టుకుంది. అంతకుముందు విధించిన సుంకాలను కలుపుకొని భారత ఉత్పత్తులపై మొత్తం టారిఫ్‌లు 50 శాతానికి చేరిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కాంగ్రెస్ సభ్యురాలు డెబోరా రాస్ మాట్లాడుతూ, భారత కంపెనీలు మా రాష్ట్రమైన నార్త్ కరోలినాలో బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు పెట్టాయి. వేలాది ఉద్యోగాలు సృష్టించాయి. ఈ టారిఫ్‌లు మా ఆర్థిక వ్యవస్థకు నష్టం కలిగిస్తున్నాయని అన్నారు. మరో సభ్యుడు మార్క్ వీసే స్పందిస్తూ, భారత్ మాకు ముఖ్యమైన భాగస్వామి. ఈ చట్టవిరుద్ధ సుంకాలు ఇప్పటికే అధిక ధరలతో ఇబ్బంది పడుతున్న సామాన్యులపై మరింత భారం మోపుతాయని తెలిపారు. భారత సంతతికి చెందిన కాంగ్రెస్ సభ్యుడు రాజా కృష్ణమూర్తి మాట్లాడుతూ ఈ సుంకాల వల్ల అమెరికా ప్రయోజనాలకు బదులు నష్టమే ఎక్కువ. ఇవి సరఫరా గొలుసులను దెబ్బతీసి, కార్మికులకు నష్టం కలిగించి, వినియోగదారులపై భారం పెంచుతాయి. వీటిని రద్దు చేయడం ద్వారా అమెరికాభారత్ ఆర్థిక, భద్రతా సహకారాన్ని బలోపేతం చేసుకోవచ్చని వివరించారు. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలును కొనసాగిస్తోందన్న కారణంతో ట్రంప్ ఆగస్టులో భారత్‌పై దశలవారీగా 50 సుంకాలు విధించారు. ట్రంప్ ఏకపక్ష వాణిజ్య విధానాలను వ్యతిరేకించడంలో భాగంగా కాంగ్రెస్‌లోని డెమొక్రాట్లు ఈ ప్రయత్నాలు చేస్తున్నారు. గత అక్టోబర్‌లో కూడా ఈ ముగ్గురు సభ్యులతో పాటు మరో 19 మంది కాంగ్రెస్ సభ్యులు ట్రంప్‌కు లేఖ రాసి, టారిఫ్ విధానాలను మార్చుకోవాలని కోరారు.

# కనుమరుగవుతున్న ద్వీపకల్పదేశం 'తువాలు'

## వాతావరణ మార్పులే కారణం


## దేశ పౌరులకు ఆస్ట్రేలియా ఆహ్వానం



**ఫునాఫుటి(తువాలు), డిసెంబరు 13:** వాతావరణ మార్పుల కారణంగా ఒక దేశం నెమ్మదిగా కనుమరుగైపోతుంటే, మరో దేశం ఆ ప్రజల భవిష్యత్తుకు భరోసా ఇస్తూ అండగా నిలుస్తోంది. సముద్ర మట్టాలు పెరిగి అస్తిత్వాన్ని కోల్పోతున్న పసిఫిక్ ద్వీప దేశం 'తువాలు' పౌరులకు ఆస్ట్రేలియా ఆశ్రయం కల్పిస్తోంది. ఈ చరిత్రాత్మక ఒప్పందం కింద, తువాలు నుంచి తొలి వలసదారుల బృందం ఈ వారం ఆస్ట్రేలియాలో అడుగుపెట్టింది. వాతావరణ మార్పుల వల్ల ముంపునకు గురవుతున్న తమ పౌరులకు 'గౌరవప్రదమైన వలస'అవకాశం కల్పించాలని తువాలు చేసిన విజ్ఞప్తి మేరకు 2023లో ఆస్ట్రేలియాతో ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం, తువాలు పౌరులకు ప్రత్యేక వీసాలు జారీ చేస్తున్నారు. ఈ వీసా ద్వారా వారు ఆస్ట్రేలియాలో నివసించవచ్చు, చదువుకోవచ్చు, పని చేసుకోవచ్చు. అర్హత సాధించిన వారికి ఆస్ట్రేలియా పౌరసత్వం కూడా లభిస్తుంది. ఇక్కడికి వచ్చిన వెంటనే వారికి విద్య, వైద్య బీమా (మెడికేర్), ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుబాటులోకి వస్తాయి. సుమారు 11,000 జనాభా మాత్రమే ఉన్న తువాలు దేశం నుంచి, ఈ ఏడాది జూన్‌లో వీసా దరఖాస్తులు ప్రారంభం కాగానే 3,000 మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. అయితే, తువాలులో మేధోవలసను నివారించేందుకు ఏటా కేవలం 280 మందికి మాత్రమే వీసాలు జారీ చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా ఆస్ట్రేలియా విదేశాంగ మంత్రి పెన్నీ వాంగ్ మాట్లాడుతూ, వాతావరణ మార్పుల ప్రభావం తీవ్రమవుతున్న వేళ, తువాలు పౌరులకు ఆస్ట్రేలియాలో కొత్త జీవితం ప్రారంభించే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. మరోవైపు, తమ దేశ సంస్కృతి, సంప్రదాయాలను ఎప్పటికీ మర్చిపోవద్దని వలస వెళుతున్న పౌరులకు తువాలు ప్రధాని ఫెలెటి టియో సూచించారు. ప్రపంచంలోనే ఈ తరహా ఒప్పందం ఇదే మొదటిది కావడం గమనార్హం.

# సంక్షిప్తంగా..

## చమురు ట్యాంకర్‌ను సీజ్ చేసిన ఇరాన్



**టెహ్రాన్, డిసెంబరు 13:** భారీ పరిమాణంలో చమురును మోసుకెళ్తోన్న ఒక నౌకను ఇరాన్ సీజ్ చేసింది. గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో శుక్రవారం అర్ధరాత్రి తర్వాత ఈ ఘటన చోటుచేసుకొంది. అందులోని సిబ్బందిలో భారతీయులు కూడా ఉన్నారని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ నౌకలో మొత్తం 18 మంది సిబ్బంది ఉండగా.. వారిలో బంగ్లాదేశ్, శ్రీలంక వాసులు కూడా ఉన్నారని పేర్కొన్నాయి. '60 లక్షల లీటర్ల చమురును ఒక నౌకలో అక్రమంగా తరలిస్తున్నారు. అందుకే నౌకలోని నావిగేషన్ వ్యవస్థలన్నింటినీ నిలిపివేశారు' అని ఇరాన్ మీడియా వెల్లడించింది. గల్ఫ్‌లో అక్రమంగా ఇంధనం రవాణా చేస్తోన్న నౌకలను అడ్డుకుంటున్నట్లు ఇరాన్ ఇప్పటికే పలుమార్లు వెల్లడించింది.

## పాక్ గూఢచర్యంపై అసోం రిటైర్డ్ ఎయిర్‌ఫోర్స్ అధికారి అరెస్టు



**గువాహతి, డిసెంబరు 13:** పాకిస్థాన్ గూఢచర్య నెట్‌వర్క్‌తో సంబంధాలున్నాయన్న ఆరోపణలపై భారత వైమానిక దళానికి చెందిన ఒక రిటైర్డ్ అధికారిని అసోం పోలీసులు అరెస్ట్ చేశారు. తేజ్‌పూర్‌లోని పాటి యా ప్రాంతానికి చెందిన కులేంద్ర శర్మను నిన్న రాత్రి అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. కొంతకాలంగా కులేంద్ర శర్మపై నిఘా పెట్టిన పోలీసులు, ప్రాథమిక విచారణ అనంతరం అతడిని అరెస్ట్ చేశారు. నిందితుడు పాకిస్థాన్ గూఢచర్య సంస్థతో సంబం ధాలున్న వ్యక్తులతో టచ్‌లో ఉంటూ, వారికి దేశభద్రతకు సంబంధించిన సున్ని తమైన సమాచారాన్ని చేరవేస్తున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అతని మొబైల్ ఫోన్, ల్యాప్ టాప్‌ను స్వాధీనం చేసుకోగా, అందులో కొన్ని అనుమానాస్పద ఆధారాలు లభించినట్లు తెలిసింది. అయితే, కొంత డేటాను నిందితుడు డిలీట్ చేసి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

## నోయిడా ఎక్స్‌ప్రెస్‌వేపై ఢీకొన్న వాహనాలు



**నోయిడా, డిసెంబరు 13:** ఢిల్లీ ఎన్‌సీఆర్ ప్రాంతాన్ని దట్టమైన పొగమంచు కమ్మేయడంతో శనివారం ఉదయం ఘోర ప్రమాదం జరిగింది. నొయిడా ఎక్స్‌ప్రెస్‌వేపై పొగమంచు కారణంగా దారి కనిపించక, 12కు పైగా వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కార్లు, ట్రక్కులు ధ్వంసం కాగా, పలువురు గాయపడ్డారు. ప్రమాదం కారణంగా ఎక్స్‌ప్రెస్‌వేపై కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. ఈఘటన హర్యానా, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల మీదుగా వెళ్లే 135 కిలోమీటర్ల పొడవైన ఈస్టర్న్ పెరిఫెరల్ ఎక్స్‌ప్రెస్‌వే (కుండ్లిఘజియాబాద్‌పాల్వాల్ ఎక్స్‌ప్రెస్‌వే)పైచోటుచేసుకుంది. ప్రమాద స్థలంలో కనిపించిన దృశ్యాలు తీవ్రతను తెలియజేస్తున్నాయి. ఒక కారు ముందు భాగం నుజ్జునుజ్జై డివైడర్‌పైకి ఎక్కగా, మరో కారు ట్రక్కు కింద ఇరుక్కుపోయి కనిపించింది. ఈ ప్రమాదంపై గౌతమ్ బుద్ధ నగర్ (నొయిడా) పోలీస్ కమిషనరేట్ కార్యాలయం ఎక్స్ (ట్విట్టర్) ద్వారా స్పందించింది.

## యుపి బిజెపి చీఫ్‌గా కేంద్ర సహాయమంత్రి పంకజ్ చౌదరి



**లక్నో, డిసెంబరు 13:** కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్ చౌదరీని ఉత్తరప్రదేశ్ బీజేపీ పార్టీ చీఫ్‌గా హైకమాండ్ నియమించనున్నది. ఆదివారం లక్నోలో గ్రాండ్ ఆ సెర్మనీ జరిగే ఛాన్సు ఉన్నట్లు తెలు స్తోంది. ఇవాళ ఆయన తన నామినేషన్ పేపర్స్ దాఖలు చేసే అవకాశం ఉన్నది. నామినేషన్ దాఖలు కార్యక్రమానికి కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ హాజరుకానున్నారు. జాతీయ కార్యదర్శి వినోద్ తవడే కూడా హాజరవుతారు. మహారాజ్‌గంజ్ నియోజకవర్గం నుంచి పంకజ్ చౌదరీ ఏడుసార్లు ఎంపీగా గెలిచారు.

## నోబెల్ పురస్కార గ్రహీతను అరెస్టు చేసిన ఇరాన్



**టెహ్రాన్, డిసెంబరు 13:** నోబెల్ శాంతి పురస్కార గ్రహీత, ఇరాన్‌కు చెందిన మానవ హక్కుల కార్యకర్త నర్గెస్ మొహమ్మదిని స్థానిక పోలీసులు మరోసారి అరెస్టు చేశారు. ఇటీవల మరణించిన ఓ మానవ హక్కుల న్యాయవాది స్మారక చిహ్నం వద్ద నివాళులర్పిస్తుండగా ఆమెను అదుపులోకి తీసుకున్నట్లు ఆమె మద్దతుదారులు, సంబంధిత స్వచ్ఛంద సంస్థలు వెల్లడించాయి. అయితే, ఆమె అరెస్టుపై ఇరాన్ ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన ఇంకా వెలువడలేదు. మహిళల హక్కుల కోసం, ఇరాన్ ప్రభుత్వ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా నర్గెస్ మొహమ్మది మూడు దశాబ్దాలకు పైగా పోరాడుతున్నారు. ఆమె అలుపెరగని పోరాటానికి గుర్తింపుగా 2023లో నోబెల్ శాంతి బహుమతి లభించింది. ఆ పురస్కారం ప్రకటించే సమయానికి కూడా ఆమె జైల్లోనే ఉండటం గమనార్హం.



:కానిస్టేబుల్ అభ్యర్థులకు నియామక పత్రాల జారీ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న అనిత

# కానిస్టేబుల్ అభ్యర్థులకు నియామక పత్రాలు 16న జారీ: హోంమంత్రి అనిత

**విజయవాడ,డిసెంబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** కానిస్టేబుల్ అభ్యర్థులకు నియామక పత్రాల 16వ తేదీన జారీచేస్తున్నామని హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు.కానిస్టేబుళ్ళ ఎంపిక పరీక్షలను సీఎం చంద్రబాబు ఆదేశాలకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహించినట్లు తెలిపారు.ఎంపికైన అభ్యర్ధులకు వెంటనే పోస్టింగ్ పత్రాలు ఇస్తారని వివరించారుకూటమి ప్రభుత్వం మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. డీఎస్సీ లో ఉద్యోగాలు సాధించిన వారికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా ఆఫర్ లెటర్స్ ఇచ్చారు. ఇదే పంథాను మరోసారి కొనసాగిం చనున్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పోలీసు శాఖలో సుమారు 6 వేల కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేసింది. వీరికి ఈనెల 16న ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా నియామక పత్రాలు ఇవ్వను న్నారు.అందుకోసం గుంటూరు జిల్లా మంగళగిరి ఆరో బెటాలియన్ పరేడ్ గ్రౌండ్‌లో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. మొత్తం 18 వేల మంది హాజరయ్యేలా అధికారులు చర్యలు తీసుకుం టున్నారు మంగళగిరి లోని 6వ బెటాలియన్‌ను రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత సందర్శిం చారు. ఈ నెల 16వ తేదీన జరగనున్న కానిస్టేబుల్ అభ్యర్థులకు నియామక పత్రాల జారీ కార్యక్ర మానికి సంబంధించిన ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి అనిత పోలీస్ ఉన్నతాధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ, సభా వేదిక నిర్మాణం, వేదికకు చేరుకునే మార్గాలు, పార్కింగ్ సౌకర్యాలు, వీవీఐపీ మరియు వీఐపీలకు ఏర్పాటు చేసే వసతులు, ఇతర జిల్లాల నుండి హాజరయ్యే అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యు లు, బందోబస్తుకు వచ్చే పోలీస్ అధికారులు., సిబ్బందికి కల్పించాల్సి న సౌకర్యాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. అనంతరం, ఎక్కడ ఎలాంటి లోటుపాట్లు లేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని, కార్యక్రమాన్ని సజావుగా మరియు విజయవ ంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో కృషి చేయాలని, తగినంత పోలీస్ బలగాలతో సమర్థవంతమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని హోం మంత్రి పోలీస్ ఉన్నతాధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమం లో డీఐజీ సత్య యేసు బాబు, గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఐపీఎస్, బెటాలియన్ కమాండెంట్ నగేష్ ఐపీఎస్, జిల్లా అదనపు ఎస్పీ ఏటీవీ రవికుమార్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



# నైపుణ్య విద్యలో అగ్రగామి సెంచూరియన్ వర్సిటీ!

- వికసిత్ భారత్ నిర్మాణంలో యువత పాత్ర కీలకం
- ఘనంగా 5వ స్నాతకోత్సవం
- విశిష్ట అతిధులు డాక్టర్ ఎస్.ఎన్.సాబత్, శంకరన్ నరేన్

**నెల్లిమర్ల (విజయనగరం జిల్లా), డిసెంబర్ 13 ప్రభాతవార్త :** ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి శిక్షణ నివ్వడంలో సెంచూరియన్ విశ్వవిద్యాలయం (సియుటిఎం) ఒక ప్రత్యేకతను సంతరించుకొని అగ్రగామిగా నిలిచిందని ఉత్తరప్రదేశ్ సబార్డినేట్ సర్వీసెస్ సెలక్షన్ బోర్డు ఛైర్మన్ డాక్టర్ ఎస్.ఎన్.సాబత్ అన్నారు. శనివారం సెంచూరియన్ విశ్వవిద్యాలయ 5వ స్నాతకోత్సవ వేడుకలకు ఆయన విశిష్ట అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్.ఎన్.సాబత్ మాట్లాడుతూ నాణ్యమైన విద్య, ఆచరణాత్మక జ్ఞానం, అభ్యాస ఆధారిత విద్యకు సెంచూరియన్ నిదర్శనమన్నారు. యువత నిజాయితీ, నైతిక విలువలతో ముందడుగు వేయాలన్నారు. వికసిత్ భారత్ నిర్మాణంలో కూడా యువత భాగస్వాములు కావాలన్నారు. మరో విశిష్ట అతిథి ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ ఎఎంసి సిఐఒ శంకరన్ నరేన్ మాట్లాడుతూ రాబోయే కాలంలో కృత్రిమ మేధస్సు, జన్యు చికిత్స, బయో టెక్నాలజీ వంటి ఆవిష్కరణలతో కొత్త కొత్త మార్పులు రాబోతున్నాయన్నారు. ఎవరైతే సాంకేతిక మార్పుతో వేగం పెంచుకోలేకపోయారో వారు వెనుకబడినట్టు చరిత్ర ద్వారా నిరూపితమవుతుందన్నారు. అందువల్లనే యువత మార్పును స్వాగతించాలన్నారు. ఈ వేడుకలకు అధ్యక్షత వహించిన ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు మాట్లాడుతూ సెంచూరియన్ యూనివర్శిటీ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్ మెంట్ అనేది నైపుణ్య సమీకృత ఉన్నత విద్యా కేంద్రమని కొనియాడారు. ఈ విశ్వవిద్యాలయాన్ని స్థాపించిన ప్రొఫెసర్ ముక్తికాంత్ మిశ్రా, ప్రొఫెసర్ డి.ఎన్.రావు గొప్ప నాయకత్వ లక్షణాలు కలిగిన విద్యావేత్తలని శ్లాఘించారు. విద్యార్థులు తమ జీవితంలో ఎదురయ్యే అనేక సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. ప్రతి ఒకరు ఉన్నతంగా ఎదగడానికి కావాల్సి న లక్షణాల గురించి వివరించారు. అనంతరం ఛాన్సలర్ ప్రొఫెసర్ రాజు, విశిష్ట అతిధులు డాక్టర్ ఎస్.ఎన్.సాబత్, శంకర్ నరేన్, ప్రొఫెసర్ ముక్తికాంత్ మిశ్రా, ప్రొఫెసర్ డి.ఎన్.రావు అతిధుల చేతుల మీదుగా ఆరు పిహెచ్ డిలతోపాటు 409 మందికి డిగ్రీలను ప్రధానం చేశారు. అలాగే ఉత్తరప్రదేశ్ సబార్డినేట్ సర్వీసెస్ సెలక్షన్ బోర్డు ఛైర్మన్ డాక్టర్ ఎస్.ఎన్.సాబత్, ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ ఎఎంసి సిఐఒ శంకరన్ నరేన్‌లకు గౌరవ డాక్టరేట్లను ప్రధానం చేశారు. అలాగే వివిధ విభాగాలలో టాపర్లకు 14 బంగారు పతకాలను, 8 మందికి నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. అనంతరం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి మాట్లాడుతూ విద్య నాణ్యత, పరిశోధనలను పెంపొం దిం చేందుకు సెంచూ రియన్ తీసు కుంటున్న చర్యల గురించి వివ రించారు.

# ఇండియా జట్టులో రెడ్డిచర్ల దేవీప్రియ



**తిరుపతి క్రీడ, డిసెంబర్ 13, ప్రభాతవార్త** తిరుపతి జిల్లాకు చెందిన నెరబైలు రెడ్డిచర్ల దేవి ప్రియ ఇటీవల పంజాబ్ రాష్ట్రంలో గత నవంబర్‌లో జరిగిన గోల్ షాట్ బాల్ ఇండియా జట్టు ఎంపికలకు హాజరై ప్రతిభ కనబరిచి ఇండియా జట్టులో స్థానం సంపాదించారు. దేవీప్రియ డిసెంబర్ నెలలో 5వ తేదీ నుండి 13వ తేదీ వరకు ఇండియా జట్టులో ప్రాక్టీస్ క్యాంప్‌లో మహారాష్ట్ర పుణె లో పాల్గొని డిసెంబర్ 15 నుండి 19వ తేదీ వరకు జరిగే సౌత్ ఆసియా అంతర్జాతీయ ఛాంపియన్షిప్ నేపాల్ దేశం ఖాట్మండులో జరగనున్న పోటీలలో పాల్గొననున్నారని గోల్ షాట్ బాల్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి మనోహర్ రెడ్డి తెలిపారు. తండ్రి రామకృష్ణ కుటుంబ పోషణకై కువైట్‌లో పనిచేస్తారు. తల్లి సుబ్బమ్మ వ్యవసాయం చేస్తారు. దేవి ప్రియ మెరిటస్ అకాడమీ జూనియర్ ప్రైవేట్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూన్నారు. దేవీ ప్రియ క్రీడాప్రస్థానం తన చిన్ననాటి నుండి మొదలు 2010 నుండి 2025 వరకు హాకీ, ఫుట్బాల్, వాలీబాల్, షూటింగ్ బాల్ మొదలగు వాటిల్లో రాష్ట్ర మరియు జాతీయ స్థాయిలో రాణించింది.

# 'సరస్వతిపవర్' ఒప్పందాలు అందుకే రద్దు

## షర్మిలకు చట్టబద్ధ హక్కులు లేవు: ఎన్‌పిఎస్‌టిలో జగన్

**విజయవాడ,డిసెంబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** సరస్వతి పవర్ లిమిటెడ్‌తో పాటు కొన్ని ఆస్థులను ప్రేమతో చెల్లి షర్మిలకు ఇవ్వాలని నిర్ణయించి 2019 ఆగస్టు 31న అవగాహన ఒప్పందం,వాటాల బదిలీల ఒప్పందం కుదుర్చుకున్నామని, అయితే షర్మిళ రాజకీయంగా వ్యక్తిగతంగానూ తన ప్రతిష్టను దెబ్బతీయంతో ఈ ఒప్పందాలను అమలు చేయకూడదని నిర్ణయించుకున్నట్లు ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చెన్నై లోని జాతీయ కంపెనీ అప్పీలెట్ ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌ఏటీ)కి నివేదించారు. సరస్వతి పవర్ లిమిటెడ్ ఆస్థుల జప్తునకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తెలంగాణ హైకోర్టులో అప్పీలు దాఖలు చేసిందని, ఈ కేసులన్నీ పూర్తయ్యాక ఆస్థులు వాటాల బదలాయింపు అమలు చేయాలని గతంలో నిర్ణయించుకున్నట్లు తెలిపారు. చెల్లిపై ప్రేమతో భవిష్యత్తులో ఆస్థులు బదలాయించడానికే గతంలో ఒప్పందం కుదిరిందన్నారు. ఈ ఆస్థులన్నీ తన స్వార్జితమని,షర్మిళకు ఎలాంటి పట్టబద్దమైన హక్కులూ లేవన్నారు. ఎలాంటి చట్టబద్దమైన పత్రాలు లేకుండా విజయమ్మ,చాగరి జనార్ధనరెడ్డిల తేఖల ఆధారంగా తమ పేర్లతో ఉన్న వాటాలను బదలాయిస్తూ సరస్వతి కంపెనీ బోర్డు ఏకపక్షంగా తీర్మానం చేసిందని, ఈ తీర్మానాన్ని సవాలు చేస్తూ,తాను హైదరాబాద్ జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్‌లో పిటీషన్ వేసినట్లు తెలిపారు. దీనిపై విచారించిన ఎన్‌సీఎల్‌టీ సరస్వతి కంపెనీ బోర్డు తీర్మానాన్ని రద్దు చేసి వాటాలను పునరుద్దరించాలని ఆదేశించిందన్నారు.ఈ ఆదేశాల అనంతరం తన వాటా 29.88 భారతిరెడ్డి 16.30 క్లాసిక్ రియాలిటీ వాటా 4.83,విజయమ్మ వాటా 48.99 శాతం చొప్పున పునరుద్దరించాల్సి ఉందన్నారు. దీనికి విరుద్దంగా ఎన్‌సీఎల్‌టీ ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ సరస్వతి పవర్ లిమిటెడ్ ఇక్కడ అప్పీలు దాఖలు చేసిందన్నారు. ఇలా అప్పీలు దాఖలు చేసే అర్హత సరస్వతి పవర్ లిమిటెడ్‌కు లేదని తెలిపారు. ఎన్‌సీఎల్‌టీ ఉత్తర్వుల వల్ల కంపెనీకి ఎలాంటి నష్టం వాటిల్లలేదన్నారు. తటస్థంగా ఉండాల్సిన సరస్వతి పవర్ కంపెనీ వైఎస్ విజయమ్మ,చాగరి జనార్ధన్‌రెడ్డిల తరపున వకాల్తా పుచ్చుకునేందుకు వీల్లేదన్నారు. బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ చట్ట విరుద్దంగా వ్యవహారించినపుపడు వారిని సమర్ధిస్తూ కంపెనీ అప్పీఊలు చేయడానికి వీల్లేదన్నారు. తల్లి విజయమ్మ ట్రస్టీగా చెల్లికి వాటాలతో సహా కొన్ని ఆస్థులు ఇవ్వడానికి అవగాహన ఒప్పందం కుదిరిందన్నారు. కోర్టు కేసులు తేలిన తర్వాత బదలాయింపు నిమిత్తం వాటాల సర్టిఫికెట్లు కూడా ఇవ్వలేదన్నారు. వాటాల బదలాయింపును సమర్థించుకునేందుకు సరస్వతి కంపెనీ ప్రయత్నిస్తోందన్నారు. తనతో పాటు భారతిరెడ్డి,క్లాసిక్ రియాలిటీలు విజయమ్మకు గిఫ్ట్‌డీడ్‌లు ఇచ్చామని, ఇందులో సరస్వతి కంపెనీ ప్రమేయం లేకపోయినా వారి తరపున వాదనలు వినిపించిందన్నారు. వాటాల బదలాయింపు ఒప్పందం జరిగిన మూడేళ్ళు మౌనంగా ఉండి తర్వాత బదలాయించడాన్ని సమర్థించుకోవడానికి సరైన కారణం లేదన్నారు. ఎన్‌సిఎల్‌టీ తీర్పుపై ఇచ్చిన స్టే ఉత్తర్వులు తొలగించాలని అభ్యర్థించారు.

# చినగొలుగువలసలో అగ్ని ప్రమాదం

## వృద్ధురాలు మృతి.. 12 పూరిళ్లు దగ్ధం.. ఆరు లక్షల ఆస్తి నష్టం



**తెర్లాం (విజయనగరం జిల్లా) డిసెంబర్ 13 ప్రభాతవార్త:** విజయనగరం జిల్లా తెర్లాం మండలంలో కొరటాం గ్రామపంచాయతీ మధుర గ్రామం సీతారాంపురం (చిన గొలుగువలస) గ్రామంలో శుక్రవారం రాత్రి 11 గంటలకు అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో కోస్ట్ పాపమ్మ (70) అగ్నికి ఆహుతయ్యింది. ఈ ప్రమాదంలో 12 ఇళ్లు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాద బాధితులంతా కూలీలు, గీత కార్మికులు. రాత్రి ఒక్కసారి మంటలు రావడంతో, అనంతరం పెద్ద శబ్దం రావడంతో ప్రజలు భయాందోళనతో పరుగులు తీశారు. సంఘటన స్థలానికి స్థానిక ఎస్సై జి.సాగర్‌బాబు, తహసిల్దార్, సిబ్బంది హాజరయ్యారు. రాజాం అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే తహసిల్దార్ జి.హేమంత్ కుమార్ రెవెన్యూ సిబ్బందిని అప్రమత్తం చేశారు. బాధితులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా సహాయక చర్యలు చేపట్టారు. శనివారం బాధితులకు ఐదు రోజులకు సరిపడ వంటసామగ్రిని అందజేశారు. బొబ్బిలి రెవెన్యూ డివిజనల్ అధికారి రామ్మోహన్‌రావు సంఘటన స్థలాన్ని పరిశీలించి బాధితులకు తక్షణ సహాయం కింద 13 వేల రూపాయలు వంట సామాగ్రి కలిపి అందజేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. రూరల్ సీఐ కే.నారాయణరావు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రమాద సంఘటనలో హెచ్‌డిటి జి. సత్యనారాయణ, ఆర్ఐ కృష్ణమూర్తి, విఆర్వోలు గణపతి, రాము, రవికుమార్, సుధాకర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ ప్రమాదంలో రెండున్నర తులాల బంగారం, 80 వేల రూపాయలు నగదు, 50 తులాలు వెండి కాలి బూడిద అయిందని, అదేవిధంగా కోస్ట్ అప్పడుకు చెందిన అర తులం బంగారం, లక్ష రూపాయలు నగదు కాలిపోయాయి.

# లింగాలవలస ఎయిర్‌పోర్ట్ కాలనీలో దారుణ హత్య

**భోగాపురం (విజయనగరం జిల్లా), డిసెంబర్ 13 ప్రభాతవార్త:** విజయనగరం జిల్లా భోగాపురం మండలం లింగాలవలస ఎయిర్‌పోర్ట్ కాలనీలో దారుణ హత్య చోటుచేసుకుంది. ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలు ముడసల అప్పయ్యమ్మను గుర్తు తెలియని దుండగులు హతమార్చి, ఆమె మెడలో ఉన్న నాలుగు తులాల బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. అదే విధముగా మృతురాలు ఇంటి పక్కనే ఉన్న వాటర్ ట్యాంక్ సమీపంలో మృతదేహం ఉండటం గమనార్హంగావుంది. కుటుంబ సభ్యులు తీరదయాత్రకు వెళ్లిన సమయంలో ఈ ఘటన జరిగినట్టు తెలిపారు. అప్పయ్యమ్మ మృతదేహం సమీపంలోని వాటర్ ట్యాంక్ వద్ద పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అలాగే పోలీసులకు సమాచారం అందించ డముతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దుండగులను గుర్తించి త్వరలో అరెస్ట్ చేస్తామని పోలీసులు తెలిపారు.ఈ ఘటనతో లింగాలవలస ఎయిర్‌పోర్ట్ కాలనీలో భయాందోళనలు నెలకొన్నాయి.

# ఎన్టీఆర్ జిల్లాలో సమసిపోని టిడిపి వర్గపోరు

- ఎంపి కేశినేని నానిపై తిరువూరు ఎమ్మెల్యే శ్రీనివాసరావు ఆరోపణలు - అధిష్ఠానం చెప్పినా బేఖాతర్



**విజయవాడ, డిసెంబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** ఎన్టీఆర్ జిల్లాలో టీడీపీ వర్గపోరు సమసి పోలేదు.స్వయంగా టీడీపీ అధినేత చంద్రబాబు ఆదేశాలతో తిరువూరు ఎంఎల్ఏ కొలికపూడి శ్రీనివాసరావు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) నడుమ దాదాపు 18 నెలలుగా సాగుతుంది. రెండు వర్గాలు మీడియా సమావేశాల్లోను, సామాజిక మాధ్యమాల్లో నేరుగా ఆరోపణలకు దిగాయి.ఎప్పటికప్పుడు ఇరు వర్గాల మధ్య సఖ్యత కుదిరించేందుకు టీడీపీ అధిష్టానం ప్రయత్నం చేస్తుంది.విషయం పరిష్కారమయినట్లే అవుతుంది.మళ్ళీ రాజుకుంటుంది.ఎంపీ చిన్నికి కొలికలపూడికి మధ్య జరగుతున్న వర్గపోరులో పరోక్షంగా ఉన్నత సామాజిక వర్గ అహంభావం స్పష్టం ఉందని ఎంఎల్ఏ అనుచరులు బహిరంగంగా ఆరోపణలు సాగించాయి.ఈ వివాద పరిష్కారానికి వేసిన కమిటీలోను అవే వర్గాలకు ప్రాధాన్యత ఇవ్వడం తనకు అన్యాయం జరుగుతుందని కొలికలపూడి వ్యాఖ్యానించినట్లు చెబుతున్నారు.అయితే ఈ వివాదంలో ఎంపీ కేశినేని చిన్ని వర్గీయులు తప్ప,ఆయన పెద్ద స్పందించి ప్రకటనలు చేసిన సందర్భాలు లేవు. ఈ క్రమంలో "నువ్వు దేనికి అధ్యక్షుడివి? పేకాట క్లబ్‌కా ? పేకాట కోసం ఆఫీస్ పెట్టావంటే నువ్వు నిజంగా రాయల్వే అంటూ ఎన్టిఆర్ జిల్లా తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తన వాట్సప్ స్టేటస్‌లో పోస్టు పెట్టడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. "కొండపర్వ గట్టు దగ్గర డే అండ్ నైట్ పేకాట మ్యాచ్ ఆడిస్తున్నావ్ అంటూ స్టేటస్‌లో వ్యాఖ్యలు పెట్టారు. ఈ పోస్టులు ఎవరినుద్దేశించో పెట్టారో అర్థంగాక టిడిపి శ్రేణులు జుట్టు పీక్కుంటున్నాయి. దీంతో తిరువూరు నియోజకవర్గ టిడిపిలో రచ్చ మరోసారి తారాస్థాయికి చేరినట్లయింది. విజయవాడ ఎంపి, టిడిపి నాయకులు కేశినేని శివనాథ్ (చిన్ని) గ్రూపునకు చెందిన వారు ఇటీవల ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య వద్దకు వెళ్లి ఎంఎల్ఏ కొలికపూడి వ్యవహారశైలిపైనా, తిరువూరు నియోజకవర్గంలో పార్టీ దుస్థితిపైనా ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలోనే ఎంఎల్ఏ కొలికపూడి పైవిధంగా ఎంపి గ్రూపునకు చెందిన వారిపై స్పందించినట్లు ప్రచారం జరుగుతోంది. వర్ల రామయ్య వద్దకు వెళ్లిన వారిలో టిడిపి విస్సన్నపేట మండల అధ్యక్షుడు రాయల సుబ్బారావు కూడా ఉన్నారు. ఎంఎల్ఏ పెట్టిన పోస్టుపై రాయల సుబ్బారావు స్పందించి మీడియా ముందుకు వచ్చారు. తననుద్దేశించే ఎంఎల్ఏ పోస్టు పెట్టారని భావించిన ఆయన విస్సన్నపేటలో మీడియా సమావేశం పెట్టి కొలికపూడిపై తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. బెల్ట్ షాపులు లేకుండా చేస్తానని చెప్పి వైన్‌షాపు డీలర్ల నుండి ఎంఎల్ఏ డబ్బులు తీసుకున్నారని, గత ఏడాది సంక్రాంతి పండుగ సమయంలో కోడిపందేల బరుల వద్దకు వెళ్లి పందెందారుల నుండి ఎన్ని డబ్బులు తీసుకున్నారో అందరికీ తెలుసునని విమర్శిం చారు. గోపాలపురం క్వారీలో అక్రమంగా గ్రావెల్ తోలించారని ఆరోపించారు.

# ఏ రాష్ట్రంలో లేని విధంగా నూతన పారిశ్రామిక విధానం ఎపిలో ఉంది: మంత్రి కొండపల్లి శ్రీనివాస్



**విజయవాడ, డిసెంబరు 13,ప్ర భాత వార్తప్రతినిధి:** దేశం లో ఏ రాష్ట్రంలో లేని విధంగా నూతన పారిశ్రా మిక విధా నాన్ని ఆంధ్రప్రదేశ్‌లో క్గా టవిు ప్రభుత్వం తీసుకొచ్చిందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఏపీ చాంబర్స్ బిజినెస్ ఎక్స్‌పోలో మంత్రి మాట్లాడుతూ.. పాతికేళ్ళ క్రితం చంద్రబాబు ఎలా ఆలోచించారో చూశామని.. ఐటీకి భవిష్యత్తు ఉంటుందని, నాటి యువతను ప్రోత్సహించారని గుర్తుచేశారు. అవసరమైన మౌలిక సదుపాయాలను ఆ నాడు ఏర్పాటు చేశారని తెలిపారు. తాను ఐటీ రంగంలో 16 ఏళ్ళు రాణించానంటే చంద్రబాబు నాయుడు ఆనాడు ఏర్పాటు చేసిన విధానాలే కారణమని చెప్పుకొచ్చారు. ప్రతీ ప్రొడక్ట్ కూడా భారత సమాజంలో విక్రయించే అవకాశం ఉంటుందని.. ప్రపంచంలో వాడే ప్రతీ వస్తువు భారత్‌లో వినియోగిస్తారని తెలిపారు. భారత్ వైపు ప్రపంచం చూస్తోందన్నారు. భారత్‌లో పెట్టుబడులు ఎలా పెట్టాలని.. భారత్ మార్కెట్‌లో ఎలా అడుగు పెట్టాలనే దానిపై ప్రపంచ దేశాలు చూస్తున్నాయని వెల్లడించారు. ఈ మేరకు ఎన్డీఏ ప్రభుత్వం, ప్రధాని పని చేస్తున్నారని అన్నారు. డ్రోన్ టెక్నాలజీ, ఏరో స్పేస్, బయో టెక్నాలజీ ఇలా అనేక రంగాల్లో క్లస్టర్‌లను ఏర్పాటు చేశారని మంత్రి తెలిపారు. చంద్రబాబు నాయుడు పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేసే దిశగా పని చేస్తున్నారన్నారు. చిన్న తరహా పరిశ్రమలు అన్నీ ఆ దిశగా అడుగులు వేయాలని.. పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తున్నాయని సూచనలు చేశారు.పెద్ద పరిశ్రమలు వచ్చే దగ్గర చిన్న తరహా పరిశ్రమలకు అవకాశాలు ఉన్నాయని.. వాటిని చిన్న తరహా పరిశ్రమల పారిశ్రామిక వేత్తలు వినియోగించుకోవాలని సూచించారు. వ్యవసాయ ఉత్పత్తులకు భారత్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు.

# ఇన్ సర్వీస్ వైద్యులకు డిఎన్‌బి సీట్ల కేటాయింపు

**విజయవాడ,డిసెంబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** సర్వీసులో ఉన్న వైద్యుల కోసం (ఇన్ సర్వీస్) 2025-26 సంవత్సరానికి సంబంధించి డీఎన్‌బీ (డిప్లొమేట్ ఆఫ్ నేషనల్ బోర్డు) సీట్లు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మూడేళ్ళ కాలపరిమితితో కూడిన పోస్ట్ ఎంబీబీఎస్ డీఎన్‌బీ కోర్సుకు సంబంధించి విజయనగరంలోని వైద్యకళాశాలలకు ఆర్థోపెడిక్, నంద్యాల వైద్య కళాశాలకు ఎమర్జెన్సీ మెడిసిన్,అనకాపల్లిలో ఎబీజీ విభాగాల్లో ఒక్క సీటు కేటాయించింది. పోస్టు ఎంబీబీఎస్ రెండేళ్ళ డీఎన్‌బీ కోర్సుకు సంబంధించి రాష్ట్రం లోని 18 భోధనాస్పత్రుల్లో అనస్థీషియా-6,ఎబీజీ-5, పీడియాట్రిక్స్- 3,ఈఎన్‌టీ-2, ఆర్థోపెడిక్-5,మెడిసిన్-5,రేడియోలజీ-5 సీట్లు చొప్పున మొత్తం 27 సీట్లు కేటాయించింది. ఈ మేరకు వైద్యారోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్‌గౌర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మెడికల్ కౌన్సిల్ ఎన్నికల నిర్వహణకు ఆర్వో నియామకం ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ ఎన్నికల నిర్వహణకు సెకండరీ హెల్త్ డైరెక్టర్‌ను రిటర్నింగ్ అధికారిగా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఏపీ హైకోర్టు గత నెల 11న ఇచ్చిన ఆదేశాలకనుగుణంగా త్వరగా ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలన్నారు.

# ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరులో కిడ్నీ వ్యాధుల నియంత్రణకు చర్యలు

- ఎ.కొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని నాలుగు పడకల డయాలసిస్ కేంద్రం ద్వారా సేవలు : జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. ఎం.సుహాసిని

**విజయవాడ,డిసెంబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఎ.కొండూరులో కిడ్నీ వ్యాధుల నియంత్రణకు విస్తృత, నిరంతర ఆరోగ్య చర్యలు చేపడుతున్నామని ఆ శాఖ జిల్లా అధికారి డాక్టర్ ఎం. సుహాసిని తెలిపారు.రోగుల జీవన ప్రమాణాలు పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలుచేస్తున్నామన్నారు.ఈ చర్యల కారణంగానే సీకేడీ వ్యాధి తీవ్రత తగ్గిందని గ్రామస్థాయిలోనే వ్యాధికి జీవనాధార చికిత్సలు అందుబాటులో ఉన్నాయని.. ఎ.కొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని నాలుగు పడకల డయాలసిస్ కేంద్రం ద్వారా సేవలు అందుతున్నాయన్నారు. ప్రస్తుతం ఇక్కడ 26 మంది రోగులు ఈ సేవలు పొందుతున్నారన్నారు. విజయవాడకు వెళ్లాల్సి న అవసరం లేకుండానే రోగులు ఇక్కడ సేవలు పొందుతున్నారన్నారు. ప్రతి దయాలసిస్ రోగికి ప్రభుత్వం ద్వారా నెలకు రూ. 10 వేల ఆర్థిక సహాయం అందుతోందన్నారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు సమగ్ర వైద్య పర్యవేక్షణ అందించేందుకు నెఫ్రాలజిస్ట్ ఓపీ సేవలను విస్తరించినట్లు తెలిపారు. ఈ సేవల ద్వారా రోగులకు నేరుగా నిపుణుల సలహాలు, చికిత్స మార్గదర్శకాలు, మందుల సర్దుబాటు, అవసరమైన సూచనలు అందుతున్నాయని.. దీనివల్ల వ్యాధి తీవ్రతను తొలిదశలోనే గుర్తించి నియంత్రించే అవకాశం పెరిగిం దన్నారు. జిల్లా కలెక్టర్ వారి మార్గ నిర్దేశనంతో ఎ.కొండూరు ప్రాంతంలో వైద్య ఆరోగ్య శాఖతో పాటు సమన్వయ శాఖల అధికారుల బృందాలు నిరంతర పర్యవేక్షణలో ప్రత్యేక సర్వేలు నిర్వహిస్తు న్నట్లు డీఎంహెచ్వో తెలిపారు. మొదటి సర్వేలో 242 కేసులను గుర్తించగా.. ఇటీవలి సర్వే నాటికి ఈ సంఖ్య గణనీయంగా తగ్గిందన్నారు. నిరంతర మందుల వినియోగం, జీవనశైలి మార్పులు, వైద్య పర్యవేక్షణ వల్ల కొందరు రోగులు పూర్తిగా కోలుకోగా, మరికొందరిలో వ్యాధి తీవ్రత తగ్గిందని వివరించారు. దయాలిసిస్ అవసరమైన రోగుల సంఖ్య స్థిరంగా ఉండటం చికిత్సల ప్రభావం ఇచ్చిన ఫలితాలకు నిదర్శనమన్నారు. మూత్రపిండ వ్యాధిగ్రస్తులకు అవసరమైన మందులు, పోషక సప్లిమెంట్లు పూర్తిగా ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. అవసరమైన వారికి ఎప్పటికప్పుడు రక్త పరీక్షలు, మూత్ర పరీక్షలు నిర్వహిస్తూ రోగుల ఆరోగ్య స్థితిని సమగ్రంగా పరిశీలిస్తున్నారు. దయాలిసిస్, ఇతర చికిత్సల కోసం రోగులకు ప్రత్యేక రవాణా సౌకర్యం అందుబాటులో ఉంది.



కిడ్నీ వ్యాధిగ్రస్తులను పరామర్శిస్తున్న ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. ఎం.సుహాసిని

# జరీబు భూముల సమస్యలను నెల రోజుల్లో పరిష్కరిస్తాం : కేంద్ర మంత్రి పెమ్మసాని

**విజయవాడ,డిసెంబరు 13. ప్రభాతవార్తప్రతినిధి:** జరీబు భూముల సమస్యల పరిష్కారానికి నెల రోజుల సమయం పడుతుందని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. నేల స్వభావంపై పరీక్షలు నిర్వహించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. సీఆర్డీఏ కార్యకలాపాలపై ఆయన సమీక్ష నిర్వహించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. సీఆర్డీఏ కార్యకలాపాలపై ఆయన సమీక్ష నిర్వహించి మాట్లాడారు.ఉండవల్లి లేఅవుట్ అభివృద్ధి ప్రారంభమైదని పేర్కొన్నారు. లంక జభూముల సమస్య కూడా పరిష్కారమైందని చెప్పారు. 7 వేల ప్లాట్ల రిజిస్ట్రేషన్ పెండింగ్‌లో ఉందని వివరించారు. 'భూ సమీకరణ చేయని భూముల్లో ప్లాట్లు పొందిన వారి సమస్య పెండింగ్‌లో ఉంది. అక్కడ రైతులతో ఎంఎల్ఏ మంత్రి మాట్లాడాక భూసేకరణకు వెళ్తాం.వేరే చోట్ల ప్లాట్లు కావాలని అడిగిన వారికి లాటరీ ద్వారా కేటాయించే చర్యలు తీసుకుంటాం.పెద్ద ప్లాట్లు పొందేవారు కొంత సమయం వేచి ఉండాలి. కమర్షియల్ ప్లాట్లలో వాస్తు ప్రకారం ఉండాలని కొందరు అడిటారు. 7 ఎకరాల మేర ప్లాట్లు మార్చాల్సి ఉంటుంది. రైతులు మళ్ళీ వాస్తు పేరిట రావొద్దని కోరుతున్నాం. 26 గ్రామాల్లో అభివృద్ధి పనుల డీపీఆర్‌లు సిద్ధం చేస్తున్నాం.వారంలో డీపీఆర్‌లు సిద్ధం చేసి నెలాఖరులోగా పనులు ప్రారంభిస్తాం. సామాజిక అభివృద్ధిలో భాగంగా కమ్యూనిటీ హాళ్ళు,శ్మశానాలు నిర్మిస్తాం.వీటికి భూమి, నిధులు సమకూరుస్తున్నాం.

# ఇడబ్ల్యుఎస్, కాపు వర్గాలకు క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీల ఏర్పాటు : మంత్రి ఎస్.సవిత



**విజయవాడ,డిసెంబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** బ్రాహ్మణ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ తరహాలో అన్ని ఇడబ్ల్యుఎస్, కాపు వర్గాలకు క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీలను ఏర్పాటు చేయనున్నట్లు బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఇందుకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. ఇడబ్ల్యుఎస్, కాపు కార్పొరేషన్ ఛైర్మన్లు, డైరెక్టర్లతో రాష్ట్ర సచివాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 201419ల మధ్య ఇడబ్ల్యుఎస్ సామాజిక వర్గాల కోసం అమలు చేసిన అన్ని పథకాలను తిరిగి ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆర్యవైశ్యులు కోరిన విధంగా కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మర్పణ దినాన్ని అధికారిక కార్యక్రమంగా నిర్వహించామన్నారు. ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్తను తీర్చిదిద్దే లక్ష యంలో భాగంగా ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటు చేయనున్న ఎంఎస్ఎంఇ పార్కుల్లో ఇడబ్ల్యుఎస్ సామాజిక వర్గాలకు ప్రాధాన్యమిస్తున్నట్లు వెల్లడించారు. వివిధ పథకాల అమలులో భాగంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఇడబ్ల్యుఎస్ కార్పొరేషన్‌లకు కూటమి ప్రభుత్వం రూ.10,608.61 కోట్లు కేటాయించిందన్నారు. వాటిలో ఇబిసిలకు రూ.915.28 కోట్లు, కమ్మ కార్పొరేషన్‌కు రూ.1,711.42 కోట్లు, క్షత్రియ కార్పొరేషన్‌కు రూ.1,946.36 కోట్లు, క్షత్రియ కార్పొరేషన్‌కు రూ.260.20 కోట్లు, కాపు కార్పొరేషన్‌కు రూ.4,884.83 కోట్లు, ఆర్యవైశ్య కార్పొరేషన్‌కు రూ.545.05 కోట్లు, బ్రాహ్మణ కార్పొరేషన్‌కు రూ.345.46 కోట్లు కేటాయించామని తెలిపారు. కాపుల అభ్యున్నతి కోసం సీఎం చంద్రబాబు పెద్దపీట వేస్తున్నారని మంత్రి సవిత తెలిపారు. 201419లో అప్పటి చంద్రబాబు ప్రభుత్వం రూ.172 కోట్లతో మంజూరు చేసిన 13 జిల్లా స్థాయి కాపు భవనాలను, 487 మినీ కాపు భవనాలు/కాపు కమ్యూనిటీ హాళ్లను గాలి కొదిలేసిందన్నారు.

## శేషవస్త్రం కొనుగోలు టెండరు రద్దు - నూతనంగా కొనుగోలుకు అనుమతి

**తిరుమల,డిసెంబర్ 13ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవారి దర్శనంలో భాగంగా ప్రముఖులు, దాతలు, ఆర్జితసేవల భక్తులకు కల్పించే వేదాశీర్వచనంకోసం పట్టుశేషవస్త్రాల సరఫరా టెండర్‌ను టిటిడి రద్దుచేసింది. ఆ స్థానంలో కొత్తవారికి అవకాశం ఇచ్చి అసలైన పట్టువస్త్రాల కొనుగోలుపై దృష్టి సారించింది. గత కొన్నేళ్ళుగా పట్టుదుప్పట శేషవస్త్రంకు బదులు పాలిస్టర్‌తో తయారైన వస్త్రం సరఫరాతో నగరి ఏకాంబరకుప్పానికి చెందిన విఆర్ఎస్ ఎక్స్‌పోర్ట్స్ టెండర్‌ను బోర్డు రద్దుచేసింది. ప్రస్తుతానికి అందుబాటులో ఉన్న వస్త్రాలతోనే వేదాశీర్వచనం చేయాలని నిర్ణయించింది. అంతేగాక పలు సంస్థలతో టిటిడి అధికారులు సంప్రదింపులు చేస్తున్నారు. నకిలీ వస్త్రాలు సరఫరా చేయడంతోనే ఈ చర్యలు తీసుకుంది.

# మైనర్ బాలికను మాదక ద్రవ్యాల ఉచ్చులోకి లాగిన వారిపై కఠిన చర్యలు: ఈగల్ ఐజి ఎకె రవికృష్ణ



**గుంటూరు ఈస్ట్ క్రైమ్, డిసెంబర్ 13, ప్రభాతవార్త:** మైనర్ బాలికకు, ఆమె కుటుంబానికి పూర్తి స్థాయిలో న్యాయం జరిగేలా సమగ్ర దర్యాప్తు చేపట్టి, నిందితులకు సత్వర శిక్ష పడే విధంగా చర్యలు తీసుకుంటామని గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ వెల్లడించారు. లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని చిన్నబజార్ ప్రాంత నివాసితులైన ఒక దంపతుల కుమార్తె (మైనర్) ఇంటర్మీడియట్ చదువుచుండగా, ఆమెకు ఇన్స్టాగ్రామ్ ద్వారా పరిచయమైన ఇద్దరు యువకులు ప్రేమ పేరుతో ఆమెను నమ్మించి, మాదక ద్రవ్యాల (మత్తు) కు అలవాటు చేసి, వాటికి బానిసగా మార్చినట్లు ప్రాథమిక విచారణలో వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనతో తీవ్ర మానసిక ఆవేదనకు గురైన బాలిక తల్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే గుంటూరు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమెకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే ఈగల్ ఐజీ శ్రీ ఏ.కే. రవికృష్ణ, గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, గుంటూరు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని సందర్శించి, డ్యూటీలో ఉన్న వైద్యుల నుంచి బాధితురాలి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె ఆత్మహత్యాయత్నానికి గల కారణాలపై వివరాలు తెలుసుకుని, బాధ్యులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని బాధిత కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. అదేవిధంగా డ్రగ్స్ కు బానిసైన మైనర్ బాలికకు అవసరమైన కౌన్సెలింగ్ నిర్వహించి, డీఅడిక్షన్ కేంద్రం ద్వారా చికిత్స అందించి ఆమె సాధారణ స్థితికి చేరుకునేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఈగల్ ఏ.కె. రవికృష్ణ మాట్లాడుతూసోషల్ మీడియా ద్వారా మైనర్ విద్యార్థినిని మాదక ద్రవ్యాల ఉచ్చులోకి లాగిన ఘటన అత్యంత తీవ్రమైనదని, ఈ కేసులో బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ తన మాట వినడం లేదని బాలికను ఆమె తల్లి వారించే సరికి బాలిక ఆమెపై తిరగబడిందని, అదే విధంగా ఆమె కొంతకాలంగా డ్రగ్స్ తీసుకుంటుందని తెలుసుకుని ఆ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం జరిగిందని.ఆ బాలికకు డ్రగ్స్ ఎక్కడ నుండి వస్తున్నాయి?, ఎవరు ఇస్తున్నారు? అనే కోణంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి విచారించడం జరుగుతుందన్నారు. గడిచిన మూడు నెలల్లో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలు సేవిస్తున్న సుమారు 150 మందిని గుర్తించి, వారిపై కేసులు నమోదు చేయడం జరిగింది.ఈ కేసుల్లో మాదక ద్రవ్యాలు ఎక్కడ నుండి వస్తున్నాయి?, ఎవరు తెస్తున్నారు?, ఎవరు విక్రయిస్తున్నారు? అనే కోణంలో దర్యాప్తు జరుపుతూ బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయడం జరుగుతుంది కొన్ని కాలేజీల్లోని విద్యార్థులు మాదక ద్రవ్యాలకు అలవాటు పడుతున్నారని మాకు సమాచారం ఉంది.

# వైభవంగా భవానీ దీక్షల విరమణ ఉత్సవాలు



**ఇంద్రకీలాద్రి, డిసెంబర్ 13, ప్రభాత వార్త :** మూడోరోజు భవానీ దీక్షలు విరమణ ఉత్సవాలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. శనివారం దీక్షధారులు భక్తుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. వారికి సరైన వసతులు, సౌకర్యాలు అందేలా ఇఓ, చైర్మన్ పాలకమండలి , అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు. భక్తిశ్రద్ధలతో దీక్షాధారులు ఇరుముడులను శిరస్సున ధరించి దుర్గమ్మవారి ఆలయానికి జై దుర్గా... జైజై దుర్గా నామస్మరణతో చేరుకున్నారు. అక్కడ అమ్మవారికి ఇరుముడులు భక్తితో సమర్పించుకున్నారు. శ్రీ అమ్మవారు దీక్షల సందర్భంగా అమ్మవారి ప్రత్యేక పూల అలంకరణతో భక్తులను అనుగ్రహించారు.

– మూడోరోజు ఆదాయం: దుర్గమ్మవారి ఆలయంలో శ్రీ భవానీ దీక్షల విరమణల సందర్భంగా ప్రసాదాల అమ్మకాలు, కేశఖండన తదితరాల ద్వారా మొత్తం రు,62,09,425ల ఆదాయం లభించిందని ఇఓ తెలిపారు. అదేవిధంగా రెండోరోజైన శుక్రవారం రు.72,16,431ల ఆదాయం లబించిందన్నారు.

# వికసిత్ భారత్ 2047 సాధనకు విద్యారంగంలో ఉపాధ్యాయుల పాత్ర గురుతరం:సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ



ఆంధ్రప్రదేశ్ ప్రాంత అభ్యాస వర్గ (స్టేట్ ఫ్యాకల్టీ ట్రైనింగ్) కార్యక్రమంలో మాట్లాడుతున్న వీవీ లక్ష్మీ నారాయణ

**విజయవాడ,డిసెంబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** వికసిత భారత 2047 సాధనకు విద్యారంగంలో ఉపాధ్యాయుల పాత్ర గురుతరమని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్, వీవీ లక్ష్మీ నారాయణ అన్నారు. తాడేపల్లి, వడ్డేశ్వరం లోని కే ఎల్ విశ్వవిద్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్ (ఏబీఆర్ఎస్ఎం), ఆంధ్రప్రదేశ్ ప్రాంత అభ్యాస వర్గ (స్టేట్ ఫ్యాకల్టీ ట్రైనింగ్) కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... విద్యార్థులను తీర్చి దిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర తరగతి నుండి మొదలవుతుందని ప్రాచీన గురు శిష్య విధానం ఎప్పటికీ అనుసరణీయమని, విశేషమైందని అన్నారు. భారత్ అంటేనే సూర్య కాంతి, జ్ఞాన కాంతిల సమ్మేళనం అన్నారు. వేదాల స్ఫూర్తితో విద్యార్థులను జ్ఞాన సముపార్జన దిశగా ప్రోత్సహిచాలన్నారు. గురు శిష్య పరంపర విశేషమైందని విద్యార్థులలో ప్రశ్నించే అలవాటును కలగ చేయాలన్నారు. తర్కం, మీమాంస, భారతీయతత్వం లో ఇమిడి ఉన్నాయన్నారు. విద్యా ర్థులను చైతన్యవంతులుగా మార్చుతూ ధర్మబద్ధమైన జీవనం ఎలా ఉంటుందో చెప్పాలన్నారు. ఆలోచనా పరిధిని విస్తృతం చేయాలన్నారు. మాతృ భాషను వాడుక భాషనుఅలవరు చుకో వడం అత్యవసరమన్నారు.. పిల్లల్లో సృజనాత్మక శక్తి పెంపొందించాలి, కొత్తగా ఆలోచించడం అవసరం, విలువలు, నైతికత జీవనసాఫల్యతకు ఎంత అవసరమో మార్గదర్శనం చేయవలసిన అవసరం ఉంది అని లక్ష్మీ నారాయణ అన్నారు. కే ఎల్ యు వీసీ ప్రొఫెసర్ రాజశేఖర్ రావు మాట్లాడుతూ దేశానికి ఉపాధ్యాయులు అందరూ జాతీయ స్ఫూర్తితో పాటు తమ సబ్జెక్టులో అద్భుతమైన నైపుణ్యాలు కలిగి ఉండి విద్యార్థులు తమ సబ్జెక్టులలో ప్రతిభ కనబరిచే విధంగా పనిచేయాలని కోరారు. ఏబీఆర్ఎస్ఎం జాతీయ కార్యదర్శి, ప్రధాన వక్త గుంత లక్ష్మణ్ జీ మాట్లాడుతూ దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే అగ్రగామి ఉపాధ్యాయ సంస్థ అని, భారతదేశంలో ప్రాథమిక దశ నుండి ఉన్నత విద్యా సంస్థల వరకు 15 లక్షల మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని తెలియజేశారు. దేశ సంస్కృతి, సాంప్రదాయాలు,ఆచారాలు ,విలువలు, మానవీయత ఆధారంగా విద్యా విధానము ముందుకు వెళ్లాలని తద్వారా మాత్రమే భారత విశ్వ గురువుగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ కే. మధుమూర్తి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ 2047 నాటికి భారతదేశాన్ని విశ్వ గురువు గా మార్చడములో ముఖ్యంగా విద్యా వ్యవస్థ, ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తారని అన్నారు. పరిశ్రమ, వ్యవసాయం, గృహనిర్మాణం, ఆరోగ్యం వంటి రంగాలలో దేశాభివృద్ధికి, సమాజ అవసరాలకు సరిపోయేలా భారతీయ విద్యా వ్యవస్థను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని భారత ప్రభుత్వం జాతీయ విద్యా విధానం 2020 తీసుకువచ్చిందని మరియు మరిన్ని ఉద్యోగాలను సృష్టించడం, దేశంలో పేదరికాన్ని నిర్మూలించడం లక్ష్యంగా పని చేస్తుందన్నారు. భారతీయ విద్యా వ్యవస్థను ఆధునీకరించడం లో ప్రాచీన భారతీయ విజ్ఞాన వ్యవస్థ మరియు భారతీయ వారసత్వాన్ని గుర్తించాలన్నారు. వికసిత్ భారత్ ,స్వర్ణాంధ్ర సాధన లో నూతన జాతీయ విద్యా విధానం ప్రముఖమైన పాత్ర పోషిస్తుందని తెలియజేశారు. డిగ్రీ ,ఇంజనీరింగ్ , ఇంటర్మీడియట్ కళాశాలలు, రాష్ట్ర, మరియు కేంద్రీయ విశ్వవిద్యాలయాలు. ఇతర ఉన్నత విద్యా సంస్థల నుండి 200 మంది ప్రతినిధులు రాష్ట్ర అభ్యాస వర్గకు హాజరయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎబిఆర్ ఎస్ఎం ప్రొఫెసర్ డిఎస్వివిఎస్ బాల సుబ్రమణ్యం, డాక్టర్ సంధ్య అధూరి, రాష్ట్ర మహిళా

# ఇంధన సంరక్షణలో ఎపికి నాలుగోసారి పురస్కారం

## రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ వెల్లడి

## అవార్డు అందుకోనున్న ఎపి ఎస్పీడిసిఎల్ సిఎండి శివశంకర్



**విజయవాడ, డిసెంబర్ 13,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం మరోసారి ఎనర్జీ ఎఫిషెన్సీ రంగంలో దేశవ్యాప్తంగా తన ప్రతిభను చాటి చెబుతూ వరుసగా నాలుగో ఏడాది ప్రతిష్ఠాత్మక జాతీయ ఇంధన సంరక్షణ అవార్డుని సాధించిందని, ఇది రాష్ట్రం ఇంధన సంరక్షణ, ఇంధన సామర్థ్య అభివృద్ధి రంగాలలో స్థిరంగా ముందుకు సాగుతున్న పురోగతిని ప్రతిబింబించే అసాధారణమైన మైలురాయి అని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ పేర్కొన్నారు. జాతీయ ఇంధన పరిరక్షణ అవార్డుల ప్రకటనలో భాగంగా, ఏపీకి జాతీయ స్థాయిలో ప్రథమ అవార్డు లభించిన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఈ అరుదైన విజయంతో ఆంధ్ర ప్రదేశ్ దేశంలోనే అత్యంత సృజనాత్మకంగా, అన్ని రాష్ట్రాలకు రోల్ మోడల్ గా ఇంధన సామర్థ్యాన్ని పెంపొందిస్తున్న రాష్ట్రంగా నిలిచిందని చెప్పారు. రాష్ట్రం లోని ప్రభుత్వ భవనాలు, పారిశ్రామిక, మునిసిపల్, వ్యవసాయ, డిస్కం, రవాణా వంటి అన్ని ప్రధాన రంగాలలో రాష్ట్రం ఇంధన సామర్థ్య కార్యక్రమాలలో పురోగతి కనబరచడంతోనే నేషనల్ ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డు–2025లో గ్రూప్॥ విభాగంలో మొదటి స్థానంలో నిలిచి అవార్డు కైవసం చేసుకుందని కె విజయానంద్ వివరించారు. విద్యుత్ రంగం సాధిస్తున్న పురోగతి లోను, విద్యుత్ ఆదా లో రాష్ట్రం సాధించిన ఈ విజయం లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి దూరదృష్టి, గొట్టిపాటి రవికుమార్ గారి సహాయ సహకారాలు ఉన్నాయని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తెలిపారు. సమగ్ర, విస్తృత, ప్రభావవంతమైన విద్యుత్ ఆదా (ఎనర్జీ కన్జర్వేషన్) కార్యక్రమాలను రాష్ట్రంలో అమలు చేయడంలో దేశంలోనే అగ్రస్థానంలో ఏపీ ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పాటు ప్రజల పూర్తి సహకారం తోనే జాతీయ స్థాయిలో ఈ గుర్తింపు సాధ్యమయ్యిందని తెలిపారు.నాలుగేళ్ల వరుసగా ఈ ప్రతిష్టాత్మక అవార్డు సాధించడం ద్వారా రాష్ట్రం యొక్క ఇంధన సంరక్షణ సామర్థ్యంలో ఉన్న సంస్థాగత బలం , నిరంతర కృషి కి నిదర్శనమని, ఈ సందర్భంగా ఏపీఎస్ఈసిఎం సిఈఓ ఎస్. నాగలక్ష్మి ,, ఎస్ఈసిఎం బృందాన్ని , సంబంధిత ప్రభుత్వ శాఖలను సిఎస్ అభినందించారు. జాతీయ ఇంధన సంరక్షణ దినోత్సవం సందర్భంగా

ఈ నెల 14 న న్యూ ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్లో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఏపీఎస్ఈసిఎం కు జాతీయ అవార్డును ప్రదానం చేయనున్నారని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తెలిపారు . ఈ అవార్డు స్వీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏపీఎస్పీడీసిఎల్ సిఎండీ ఎల్. శివశంకర్ ని రాష్ట్ర ప్రతినిధిగా నామినేట్ చేసారు.

# డిజిటల్ మోసగాళ్లు అరెస్ట్

**ఆకివీడు ( పశ్చిమ గోదావరి జిల్లా ప్రతినిధి )** గత కొంతకాలంగా డిజిటల్ అరెస్ట్ పేరిట సైబర్ మోసాలకు పాల్పడుతూ లక్షలు కాజేస్తున్న సైబర్ నేరగాళ్లను పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు పోలీసులు అరెస్టు చేశారు. పశ్చిమగోదావరి జిల్లాలో సంచలనంగా మారిన ఈ సంఘటనను సవాలుగా తీసుకున్న పోలీసులు జిల్లా ఎస్పీ అద్నాన్ నయిూమ్ అస్మి ఆధ్వర్యంలో ఆకివీడు సీఐ వి జగదీశ్వరరావు, భీమవరం వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఎం నాగరాజులు నాలుగు బృందాలుగా ఏర్పడి బ్యాంక్ లావాదేవీల విశ్లేషణ, సాంకేతిక ఆధారాలు, అంతర్ రాష్ట్ర దర్యాప్తుల ద్వారా ఈ కేసులో పురోగతి సాధించారు. ఈ మేరకు శనివారం నలుగురు నిందితులను అరెస్టు చేశారు. కేసు వివరాల్లోకెళితే ఆకివీడు పట్టణానికి చెందిన ఓ మహిళా రిటైర్డ్ హైస్కూల్ హెడ్ మాస్టర్ ను లక్ష్యంగా చేసుకొని సైబర్ నేరగాళ్లు తాము పోలీసు అధికారులమంటూ ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్లు అనధికారికంగా ఉపయోగించి అక్రమాలకు పాల్పడ్డారంటూ దీనికై మీ మీద అరెస్టు వారెంట్ విడుదలయిందని నకిలీ పత్రాలను పంపించి బెదిరింపులకు పాల్పడ్డారు. దీనికి డిజిటల్ అరెస్ట్ అనే నూతన పదాన్ని ఉపయోగించారు. దీంతో మానసికంగా భయపడిన మహిళ తనకు చెందిన మూడు ఖాతాల నుంచి సైబర్ నేరగాళ్లకు చెందిన తొమ్మిది ఖాతాలకు 93,25,000 బదిలీ చేశారు. చివర్లో అనుమానంతో డిజిటల్ అరెస్ట్ లేఖను విచారించగా తాను మోసపోయినట్లు గమనించారు. ఈ విషయమై ఆకివీడు పోలీస్స్టేషన్లో ఫిర్యాదు చేయగా శనివారం నలుగురు నిందితులను అరెస్టు చేశారు. అయితే ఇందులో మరికొంతమంది వ్యక్తులు ఉన్నట్లుగా ఆకివీడు సీఐ జగదీశ్వరరావు తెలిపారు. ఇంతవరకు వీరినుంచి 7,34, 240 రూపాయిలు రికవరీ చేశామని, మిగతా సొమ్ము కూడా రాబట్టే ప్రయత్నాల్లో ఉన్నామన్నారు. ఈ సందర్భంగా సీఐ జగదీశ్వరరావు మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల నుంచి వచ్చే ఫేక్ కాల్స్ కోర్టు నోటీసులు డిజిటల్ అరెస్ట్ వారెంట్లో అంటూ వస్తే నమ్మవద్దని వాళ్ళు అడిగినట్లు డిపాజిట్ కోసం డబ్బు పంపవద్దని, వారి పట్ల ప్రజలు జాగ్రత్త వహించాలని హెచ్చరించారు. ఈ కేసులో పురోగతి సాధించడానికి సహకరించిన ఎస్సైలు సిహెచ్ నాగరాజు, ఎండి నజీరుల్లా, ఎన్ శ్రీనివాసరావు, వంశీ, రెహమాన్, వీర్రాజులను పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయిూమ్ అస్మి అభినందించారు.

## అమరావతిలో భూమిలేని పేదల పెన్షన్లపై కీలక నిర్ణయం

### - త్రిసభ్య కమిటీ పునరాలోచన

**విజయవాడ,డిసెంబరు 13,ప్రభాత వార్తప్రతినిది:..** అమరావతిలో భూమిలేని పేదల పెన్షన్లపై మంత్రుల త్రీసభ్య కమిటీ కీలక నిర్ణయం..4,929 మంది పెన్షన్లపై త్రిసభ్య కమిటీ పునరాలోచన చేసింది. రద్దు అయిన పెన్షన్లపై దరఖాస్తుల స్వీకరణకు దిళిదీతికు గ్రీన్సిగ్నల్.అర్హులైన వారికి నెలకు రూ.5 వేల పెన్షన్ ఇచ్చే యోచన.గ్రామసభల సమయంలో అర్జీలు సమర్పించవచ్చుభూమి లేని పేదలకు న్యాయం చేస్తామని ఏపీ త్రిసభ్యకమిటీ నిర్ణయించింది.

## 15న జరగాల్సిన జిల్లాస్థాయి పిజిఆర్ఎస్ రద్దు

**విజయవాడ (గన్నవరం), డిసెంబర్ 13, ప్రభాతవార్త :** ఈనెల 15వతేదీ సోమవారం విజయవాడలోని ఎన్టిఆర్ జిల్లాకలెక్టర్ కార్యాలయంలో జరగాల్సిన జిల్లాస్థాయి పిజిఆర్ఎస్ను రద్దు చేస్తున్నట్లు జిల్లా ఇన్చార్జ్కలెక్టర్ ఎస్.ఇలక్కియ తెలిపారు. విజయవాడ ఇంద్రకీలాద్రిపై భవానిదీక్షల విరమణ కార్యక్రమం సోమవారం వరకు కొనసాగనున్నందున జిల్లా అధికార యంత్రాంగం మొత్తం భవానిదీక్షల కార్యక్రమంలో నిమగ్నమై ఉన్నందున ప్రజాసమస్యల పరిష్కారవేదిక( పిజిఆర్ఎస్)ను రద్దుచేస్తున్నట్లు చెప్పారు. తదుపరి సోమవారం నుండి యధావిధిగా పిజిఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని, అర్జీదారులు తమ అర్జీలను మీకోసం వెబ్సైట్లోనూ నమోదు చేయవచ్చని సూచించారు. నమోదైన అర్జీల స్థితి, సమాచారం కోసం 1100 నెంబర్కు ఫోన్చేసి తెలుసుకోవచ్చని సూచించారు.

## కోనలో వైభవంగా పెనుశిల లక్ష్మీనృసింహుని కళ్యాణోత్సవం



**రాపూరు (నెల్లూరు), డిసెంబర్ 13, ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శనివారం శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారి కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున 4.30కి స్వామి వారి మూలమూర్తికి అభిషేకం, గోపూజ, పూలాంగి సేవ నిర్వహించారు. ఉదయం 9.30కి స్వామి వారి ఆస్థాన మండపంలో స్వామి వారికి ఉభయ దేవేరులైన ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్లతో వేదపండితులు,వేద మంత్రోచ్ఛరణలతో స్వామి వారి కళ్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.సాయంత్రం స్వామి,అమ్మవార్లను తిరుచ్చిపై వుంచి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. తదుపరి స్వామి అమ్మవార్లకు సహస్ర దీపాలంకరణ మండపంలో ఊంజల్ సేవ నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావలసిన భోజన,వసతి ఏర్పాట్లను ఆలయ ఉప కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ సూపరిడెంట్ పాలవల్లి లక్ష్మీ నారాయణ,సిబ్బంది నరసింహా, వెంకటసుబ్బయ్య, తదితరులు పర్యవేక్షించారు.స్వామి వారి పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా ఆలయ ప్రధానార్చకులు గుండ్లూరు రామయ్య స్వామి, పెంచల పెంచలయ్య స్వామి, ముఖ్య అర్చక స్వామి గుండ్లూరు శశి స్వామి, అర్చక స్వాములు మధు స్వామి, వర్ధన్ స్వామి, వెంకట బాలాజీ స్వామి, వినోద్ స్వామి, నాగరాజు స్వామి, సాయి స్వామి తదితరులు నిర్వహించారు.

## సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డును రాష్ట్ర పాఠశాల ప్రమాణాల అథారిటీ (ఎస్ఎస్ఎస్ఏ)గా ప్రభుత్వ ఉత్తర్వులు

**విజయవాడ,డిసెంబరు 13,ప్రభాతవాక్తప్రతినిధి:** రాష్ట్రంలో పాఠశాలల నాణ్యత మదింపు, హామీ ఫ్రేమ్ వర్క్ అమలు కోసం సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డును రాష్ట్ర పాఠశాల ప్రమాణాల అథారిటీ (ఎస్ఎస్ఎస్ఏ)గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలకు అనుమతులు ఇవ్వడం, వాటి నాణ్యతపైన ఈ అథారిటీ దృష్టి సారిస్తుంది. ఆయా పాఠశాలల్లోని ప్రమాణాల ఆధారంగా ప్రగతి, జాగృతి, అభిలాష అనే గ్రేడ్లను ఇస్తుంది. రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాల విద్యా వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం, నాణ్యత హామీని పెంపొందించడం, మాధ్యమిక పాఠశాలల్లో కనీస వృత్తిపరమైన నాణ్యతా ప్రమాణాలను పాటించేలా చూడటానికి ఎస్ఎస్ఎస్ఏను నియమించింది. ఇందులో పాఠశాల విద్య కార్యదర్శి ఛైర్మన్ గా, డైరెక్టర్ వైస్ ఛైర్మన్ గా, ఇంటర్మీడియట్ విద్యామండలి కార్యదర్శి, సమగ్ర శిక్షా ప్రాజెక్టు డైరెక్టర్, ఎస్సీఈఆర్టీ డైరె క్టర్ సభ్యులుగా ఉంటారు. ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ మెంబర్ కన్వీనర్ గా వ్యవహరిస్తారు.

## ఎన్టిఆర్జిల్లాలో 79,503 మెట్రిక్టన్నుల ధాన్యం కొనుగోలు

**విజయవాడ (గన్నవరం), డిసెంబర్ 13, ప్రభాతవార్త :** ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో ఎన్టిఆర్ జిల్లాలో రైతుల వద్దనుండి 79,503మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఈఏడాది మొత్తం 1,50,000మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్ధేశించగా జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన రైతుసేవాకేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 10,514మంది రైతుల నుండి 79,503 మెట్రిక్టన్నుల ధాన్నాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసినట్లు జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యానికి రూ.160.62కోట్ల నగదును రైతులకు చెల్లించినట్లు వివరించారు. ధాన్యం కొనుగోలు చేసిన 24గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమచేస్తున్నట్లు చెప్పారు. జిల్లాపై తుఫాన్ ప్రభావం ఉండటంతో కల్లాలోని ధాన్యాన్ని నేరుగా కొనుగోలు చేయటంతోపాటు, 2,200 టార్పాలిన్లను రైతులకు ఉచింతంగా అందించినట్లు చెప్పారు. ధాన్యం కోనుగోలులో రైతులకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు అధికారులు వివరించారు.

## సురక్షితంగా గమ్యం చేరిన బస్సు ప్రమాద బాధితులు

### బాధితులకు అండగా నిలిచిన ఎపి ప్రభుత్వం

**చింతూరు డిశంబర్ 13 ప్రభాతవార్త** మన్యం ప్రాంతానికి అనుకోని అతిధులుగా వచ్చి ,వారు ప్రయాణిస్తున్న బస్సు ప్రమాదానికి గురై ఆ బస్సులో ప్రయాణిస్తున్న యాత్రికులు 9 మంది మృతిచెందటం,మరో 21 మంది గాయపడటం చాలా భాధాకరం.ఈ ఘటన చింతూరు -మారేడుమిల్లి ఘాట్లో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన విషయం అందరికి తెలిసింది.ప్రమాదం జరిగిన వెంటనే ఎపి ప్రభుత్వం స్పందించి ,భాధితులకు అండగా నిలబడి వారిని ఆదుకోవటంలో ప్రభుత్వం,అధికారులు చేపట్టిన చర్యల పట్ల ప్రతి ఒక్కరు సంతృప్తి వ్యక్తం చేశారు.రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రమాద ఘటనపై దిగ్భ్రాంది వ్యక్తం చేస్తూ హూటా హూటిన హోమ్ మంత్రి అనిత,జిల్లా ఇన్చార్జ్ మంత్రి గుమ్మడి సంధ్యారాణి,రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి ,రంపచోడవరం యంయల్ఎ మిరియాల శిరీషదేవిని ఘటన స్దలానికి పంపించి,క్షతగాత్రులను పరమర్శించి వారికి మెరుగైన వైద్యసేవలు అందేలా చేపట్టిన చర్యల పట్ల క్షతగాత్రులతో పాటు స్దానికులు ప్రభుత్వ చర్యలను అభినందించారు.క్షతగాత్రులతో నిండిన చింతూరు ఏరియా ఆసుపత్రిలో ఆసుపత్రి ప్రధాన వైద్యాధికారి కోటి రెడ్డి,డిప్యూటి డియం అండ్ హెచ్ ఒ పుల్లయ,ఆసుపత్రి వైద్యులు ,సిబ్బంది సేవలను అధికారులు కొనియాడారు.బస్సు ప్రమాదం తెల్లవారుజామున 3గం॥జరిగింది.ఘాట్ రోడ్డులో ఆ సమయంలో పెద్దగా రకపోకలు ఉండవు.ఉదయం 5గం॥ల ప్రాంతంలో చింతూరు యస్.ఐ.రమేష్కు ఘాట్ రోడ్డులో బస్సు ప్రమాదం జరిగిందని,చాలా మంది ప్రయాణికులు మృతిచెందినట్టు సమాచారం అందింది.దాంతో వెంటనే స్పందిన ఆయన 108కు సమాచారం అందించి విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశారు.

చింతూరు సిఐ.గోపాల కృష్ణ,చింతూరు యస్.ఐ.రమేష్,మోతుగూడెం యస్.ఐ.సాధిక్ తమ సిబ్బందితో ఘటన స్దలానికి చేరుకోని బస్సు అద్దాలు పగలగొట్టి ప్రమాద భాధితులను బస్సు నుండి బయటకు తీసి చాలామంది ప్రాణాలను రక్షించారు.అప్పటికే 9మంది ప్రాణాలు కోల్పోవటం చాలా భాధకారం.విషయం తెలుసుకున్న చింతూరు ఐటిడిఎ పివో శుభం నోక్వాల్,చింతూరు ఎయస్పి హేమంత్ ఘటన స్దలానికి చేరుకోని పోలీసులు,ఐదు 108ల సహాయంతో క్షతగాత్రులను,మృతదేహాలను చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## ఆధునిక విజ్ఞాన శాస్త్రాలకు న్యాయశాస్త్రమే అసలైన దిక్సూచి

### వైస్ ఛాన్సలర్ డాక్టర్ వెంకట్రావు

**తిరుపతి విద్య, డిసెంబర్ 13 ప్రభాతవార్త** సంప్రదాయ సామాజిక శాస్త్రాల నుంచి వర్తమాన సమాజంలో ప్రాధాన్యత పెరుగుతున్న కృత్రిమ మేధ (ఏ ఐ), సైబర్ క్రైమ్, డిజిటలైజేషన్ మొదలైన ఆధునిక విజ్ఞాన శాస్త్రాలకు న్యాయ శాస్త్రం దిక్సూచి వంటిదనే సత్యాన్ని న్యాయ శాస్త్రాన్ని అధ్యయనం చేసేవారందరూ గుర్తుంచుకోవాలని డాక్టర్ అంబెడ్కర్ గ్లోబల్ లా ఇన్స్టిట్యూట్ లో శనివారం మొదలైన జాతీయ సదస్సులో సంబంధిత రంగ నిపుణులు పిలుపునిచ్చారు. ఆవిష్కరణ, నైతికత, శ్రేష్ఠత లకు న్యాయశాస్త్రమే భావి దిక్సూచి అనే అంశం పై లా ఇన్స్టిట్యూట్ ఆవరణలో రెండురోజులజాతీయ సదస్సు మొదలైంది . ఇన్స్టిట్యూట్ అధినేత డాక్టర్ ఆర్ తిప్పారెడ్డి నేతృత్వంలో జరిగిన సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఇండియా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ అఫ్లీగల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రాంభట్ల వెంకట్రావు, రాష్ట్ర హై కోర్ట్విశ్రాంత న్యాయమూర్తి డాక్టర్ వి ఆర్ కె కృపాసాగర్, దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ (వైజాగ్) వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి సూర్యప్రకాశ రావు, శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ టాటా నరసింగరావు ప్రధాన వక్తలుగాపాల్గొన్నారు. డాక్టర్ వెంకట్రావు మాట్లాడుతూ ప్రపంచంలో సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మెడికల్ విద్యలప్రాధాన్యతాక్రమంలో న్యాయ శాస్త్రాన్నికూడా చేర్చాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఇటీవలిదశకాలలో భారత దేశానికిచెందిన ఐ టి నిపుణులకు ప్రపంచ దేశాల్లో ముఖ్యంగా అమెరికా లోని సిలికాన్ వ్యాలీ లో పెరుగుతున్న ప్రాధాన్యత ను ప్రస్తావిస్తూ వారి మేధో విజ్ఞానానికి సామాజిక న్యాయ కోణంలో మానసిక పరిపక్వత తోడు చేసే అవకాశం న్యాయశాస్త్రం లోనే ఉందన్నారు. ఆ కోణంలో ఆలోచించడానికి , డాక్టర్ అంబెడ్కర్రూపొందించిన భారత రాజ్యాంగం పై పూర్తి అవగాహన పెంచుకోడానికిన్యాయశాస్త్ర పరిజ్ఞానం ఎంతో ఉపకరిస్తుందన్నారు .

## వరాహస్వామి ఆలయ దర్శన వేళలు పొడిగింపు

**తిరుమల,డిసెంబర్ 13ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలక్షేత్రసాంప్రదాయంలో కీలకమైన భూవరాహస్వామి ఆలయం దర్శన వేళలను పొడిగిస్తూ టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి అనుమతించారు. రోజురోజుకూ తిరుమలకు వస్తున్న భక్తుల రద్దీ పెరగడంతోబాటు వరాహస్వామి దర్శనానికి భక్తులు తొలుత ప్రాదాన్యతనిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ తిరుమలకు వచ్చినపుడు వరాహస్వామీ ఆలయాన్ని రాత్రి 8గంటలకే మూసివేశారు. ఈ విషయాన్ని టిటిడి అధికారులకు, మీడియాకు తెలిపారు. వరాహస్వామి ఆలయ వేళలు పొడిగించి భక్తులకు అసౌకర్యం లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన టిటిడి ఛైర్మన్ బిఆర్నాయుడు అదనపు ఇఒ వెంకయ్యచౌదరికి సూచించారు. ఇక ఆదివారం నుండి వరాహస్వామి ఆలయం రాత్రి 10గంటలవరకు భక్తులకు దర్శనం కల్పించేలా వేళల్లో మార్పులు చేయడంతో భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

## గోదావరి పుష్కరాలు 2027 జూన్ 26నుంచి జూలై 7వరకు 12 రోజులు

**విజమవాడ,డిసెంబరు 13,ప్రభాత వార్తప్రతినిధి:**గోదావరి పుష్కరాలు 2027 జూన్ 26నుంచి జూలై 7వరకు (12రోజులు) జరుగుతాయని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు రెవెన్యూ(ఎండోమెంట్స్) శాఖ జీఓ ఆర్టి నెంబరు 1575ను విడుదల చేసింది. తిరుమల తిరుపతి దేవస్థానాల ఆస్థాన సిద్ధాంతి తంగిరాల వెంకట కృష్ణ పూర్ణప్రసాద్ అభిప్రాయాలను పరిశీలించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో తెలిపారు. పుష్కరాల తేదీలను అన్ని శాఖలు, దేవస్థానాలు, జిల్లా యంత్రాంగం పరిగణలోకి తీసుకుని, అవసరమైన ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. ఇప్పటికే ఏపీ ప్రభుత్వం గోదావరి పుష్కరాల ఏర్పాట్లు ప్రారంభించింది. పాత ఘాట్ల అభివృద్ధి,నూతన ఘాట్ల ఏర్పాటు,విశ్రాంతి గదులుతో

గోదావరి తీరంలో పర్యాటక సొగసులను కల్పించే దిశలో కార్యచరణ చేపట్టింది.ఎక్కడిక్కడ భద్రతా చర్యలు చేపట్టే దిశలో ముందుకు వెళ్తుంది.,దీంతో రహదారులు,వంతెనల నిర్మాణాలు చేపట్టింది.

## తల్లి,కూతుళ్ల మధ్య డ్రగ్స్ వివాదం- తల్లి ఆత్మహత్యాయత్నం

**గుంటూరు, డిసెంబర్ 13, ప్రభాతవార్త ప్రతినిధి:** తల్లి, కూతుళ్ల మధ్యలో డ్రగ్స్ వివాదాన్ని రేపాయి. కూతురు చెప్పిన మాట వినటం లేదని తల్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడమే కాకుండా కూతురు డ్రగ్స్ బానిసైందని ఫిర్యాదు చేయడం కలకలం రేపింది. కూతురు మాత్రం ఇష్టం లేని పెళ్లి చేస్తున్నారని ఆరోపిస్తుంది. దీంతో ఉన్నతాధికారులు రంగంలోకి దిగి కేసు దర్యాప్తు చేపట్టారు. గుంటూరు ఆర్టిసి కాలనీకి చెందిన స్వప్న,రాజేష్ దంపతులకి ఇంటర్ మొదటి ఏడాది చదువుతున్న కుమార్తె ఉంది. స్వప్న హైదరాబాద్లో యాంకర్గా పనిచేస్తుంది. అయితే కొన్ని రోజులుగా కుమార్తె ప్రవర్థన అనుమానాస్పదంగా ఉండటంతో ఆమెపై తల్లి దండ్రులు దృష్టి పెట్టారు. ఈ క్రమంలోనే కూతురికి కౌశిక్ అనే యువకుడితో పరిచయం ఉన్నట్లు తేలింది. ఇన్ స్టాలో పరిచయమైన కౌశిక్తో మైనర్ చనువుగా ఉన్నట్లు గుర్తించారు. ఈక్రమంలోనే తమ కుమార్తెకు పెళ్లి చేసేందుకు సిద్ధమయ్యారు. అయితే తల్లిదండ్రుల పెళ్లి చేసుకునేందుకు భూమిక ఇష్టపడలేదు. దీంతో శుక్రవారం రాత్రి భూమిక ఫోన్ తీసుకున్న తల్లిదండ్రులు తమ కుమార్తె డ్రగ్స్కు బానిసైనట్లు గుర్తించారు. తప్పుడు మార్గంలో ప్రయాణిస్తుందని తనతో గొడవకు దిగారు. తల్లిదండ్రులను టీనేజర్ ఎదిరించి మాట్లాడటంతో తల్లి కుమార్తెను కొట్టింది. ఇద్దరి మధ్య వివాదం మధ్య వివాదం ముదరడంతో మనస్థాపానికి గురైన తల్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమెను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుమార్తెను డ్రగ్స్ కు బానిస చేసి ఆమెతో చనువుగా ఉంటూ డ్రగ్స్ వినియోగిస్తున్న వీడియోస్ కూడా ఉన్నట్లు తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ క్రమంలోనే ఈ పిర్యాదుపై పోలీసు శాఖ అప్రమత్తమైంది. జిజిహెచ్లో చికిత్స పొందుతున్న తల్లి స్వప్నను ఈగిల్ చీఫ్ ఆకే రవికృష్ణ, గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పరామర్శించారు. ఇద్దరి స్టేట్ మెంట్స్ తీసుకున్నామని కేసును దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు చెప్పారు. స్వప్న కుమార్తె డ్రగ్స్ తీసుకున్నట్లు ప్రాథమిక సమాచారం ఉన్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ చెప్పారు. కేసు పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసిన తర్వాత వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

## తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌ను సందర్శించిన రైతులు, విద్యార్థులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 13:** రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట్ లో రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 8,9వ తేదీలలో నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ప్రాంగణంలోనికి ఈ నెల 10వ తేదీ బుధవారం నుండి సందర్శకులను అనుమతించడంతో చివరి రోజైన శనివారం రైతులు,విద్యార్థులతో పాటు సందర్శకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అక్కడ ప్రభుత్వం, ప్రైవేటు రంగాల వారు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. ఉదయం ప్రస్తుత పద్ధతుల నుండి భవిష్యత్తు శ్రేయస్సు వరకు రైతుల ఆదాయాన్ని పెంచడానికి అరుదైన వ్యూహాపై, మధ్యాహ్నం వ్యవసాయం, గ్రామీణ పరివర్తన గ్రామీణ తెలంగాణను పట్టణ అవకాశాలతో అనుసంధానించే అరుదైన నివారణ వంతెనపై రైతులకు, విద్యార్థులకు రెండు పర్యాయాలు సెమినార్ నిర్వహించి క్లుప్తంగా వివరించారు.నాగర్ కర్నూలు జిల్లా నుండి వచ్చిన ఆదర్శ మహిళా రైతు లావణ్య సేంద్రీయ వ్యవసాయ ద్వారా కలిగే స్వీయ ప్రయోజనాలను వివరించారు.ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులతో సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. ప్రముఖ సినీగాయని మంగ్లీ గీతాలు ఆలపించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి ఈటల రాజేందర్

## రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రా, ఈవెంట్ మేనేజరా?

### ప్రజాసమస్యలు పక్కనపెట్టి ఫుట్‌బాల్ ఆడడమా?

### ఎంపి ఈటల సూటి ప్రశ్న

**జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజా సమస్యలను పక్కనపెట్టి ఒక ఈవెంట్ మేనేజర్‌లా వ్యవహరిస్తు న్నాడని, మెస్సితో ఫుట్‌బాల్ ఆడడం రాష్ట్ర ప్రజలకు ప్రయోజనమేంటని, జీతాలు లేక అష్టకష్టాలు పడుతున్న సింగరేణి కార్మికుల సొమ్ము వంద కోట్లు తీసుకువచ్చి ఫుట్‌బాల్ మ్యాచ్‌కు ఖర్చుపెట్టడం ఎలా ప్రజాప్రభుత్వం అవుతుందని రాష్ట్ర మాజీ మంత్రి, మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సూటిగా ప్రశ్నించారు. శనివారం కరీంనగర్ జిల్లా హుజురాబాద్ నియోజకవర్గంలోని తన స్వస్థలం కమలాపూర్‌లో ఇటీవల సర్పంచులుగా గెలిచిన వారిని అభినందించడానికి వచ్చిన ఈటల రాజేందర్ రాష్ట్ర ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపి ఈటల రాజేందర్ మాట్లాడుతూ సింగరేణిలో కార్మికులు తలదాచుకోవడానికి వారు నివాసం ఉంటున్న ఇండ్లు బాగుచేయడానికి, సిబ్బందికి జీతాలు ఇవ్వడానికి డబ్బులు లేక సింగరేణిలో కార్మికులు అవస్థలు పడుతుంటే సింగరేణి నిధుల నుండి వంద కోట్లు తీసుకువచ్చి దుబారా చేయడం ఏమిటని ఈటల ఆగ్రహం వ్యక్తం చేసారు. హైడ్రా పేరుతో రాజదాని నగరంలో పేదల ఇండ్లను కూలుస్తున్న హైడ్రా అధికారులు పెద్దలు కబ్జా చేసిన సర్కారు భూములను పట్టించుకోవడం లేదని, పేదల ఇండ్లను హైడ్రా పేరుతో కూల్చివేస్తున్నారని ఈటల అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రికి దమ్ము, ధైర్యం ఉంటే కేసిఆర్ కూతురు కల్వకుంట్ల కవిత చేసిన ఆరోపణలపై రాష్ట్ర ప్రభుత్వం న్యాయవిచారణ చేపట్టలని, ఆక్రమిత ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని పేదలకు పంచి ప్రభుత్వ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ఎంపి ఈటల రాజేందర్ సవాల్ విసిరారు. సింగరేణి సంస్థ నుండి వంద కోట్ల రూపాయలు తీసుకువచ్చి 70 కోట్ల రూపాయలు మెస్సికి ఇచ్చి, క్రికెట్ స్టేడియం మార్చి కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డిలో సిఎం ప్రాక్టిస్ చేయడానికి ఫుట్‌బాల్ కోర్టు తయారు చేసుకుని, ప్రాక్టిస్ చేస్తు సింగరేణి కార్మికుల సొమ్ము వృదా చేయడం కాదా..? అని ఈటల రాజేందర్ విలేకరుల సమావేశంలో తీవ్రంగా దుయ్యబట్టారు. రెండు సంవత్సరాల కాంగ్రెస్ పాలనపై విసుగుచెందిన రాష్ట్ర ప్రజలు ఈ నెల 11న జరిగిన పంచాయితీ మొదటి దశ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసారని, దానికి కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులు 50 శాతం లోపు గెలుపొందడం సిగ్గుచేటన్నారు. ఎక్కడైన అధికారంలో ఉన్న ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికలు అనుకూలంగా ఉంటాయని తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేక గాలులు వీస్తున్నాయని ఎంపి ఈటల అన్నారు.

## ఉద్యాన వర్సిటీలో కౌన్సెలింగ్

### రిజిస్ట్రార్ డాక్టర్ భగవాన్

**హైదరాబాద్, డిసెంబరు 13, ప్రభాతవార్త :** తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని ఉద్యాన కళాశాలల్లో ప్రవేశాలను నిర్వహిస్తున్నట్లు యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఏ. భగవాన్ తెలిపారు. డిగ్రీలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి కౌన్సిలింగ్ జరిపామని ఒక ప్రకటనలో వెల్లడించారు. ఉద్యాన యూనివర్సిటీ, దాని అనుబంధ కళాశాలల్లో 2025-26 సంవత్సరానికిగాను బీ. ఎస్సీ (ఆనర్స్) హార్టికల్చర్ డిగ్రీలో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు వివరించారు. ఈనెల 17న ఉదయం 10.30 నుంచి బైపీసీతో ఈపిసెట్ -2025కు అర్హులై ఉండటంతో పాటు, వ్యవసాయ విశ్వవిద్యా లయం కంబైన్డ్ కౌన్సిలింగ్‌కు దరఖాస్తులు సమర్పించి ఉండాలని పేర్కొ న్నారు. ఈ నేపథ్యంలో ర్యాంకు పొందిన విద్యార్థులు ఈ కౌన్సిలింగ్ కు హాజరు కావచ్చని వివరించారు. కాగా సీట్ల వివరాలను వెల్లడిస్తూ రాజేంద్రనగర్ లోని ఉద్యాన కళాశాలలో 15 సీట్లు, వనపర్తి జిల్లా మోజెర్ల ఉద్యాన కళాశాలలో 32 సీట్లు, మహబూబాబాద్ జిల్లాలోని మల్యాల ఉద్యాన కళాశాలలో 10 సీట్లు ఉన్నాయన్నారు. మరిన్ని వివరాలు ఉద్యాన యూనివర్సిటీ వెబ్‌సైట్‌తో పాటు, ఇతర సమాచారం కోసం 9652456779 మొబైల్ నెంబర్ ను సంప్రదించవచ్చని రిజిస్ట్రార్ భగవాన్ తెలిపారు.

## విత్తన ధ్రువీకరణతోనే రైతుకు నాణ్యమైన విత్తనం

### తెలంగాణ జెఎసి చైర్మన్ కోదండరామ్

**హైదరాబాద్, డిసెంబరు 13, ప్రభాతవార్త :** విత్తన ధ్రువీకరణ జరిగితేనే రైతుకు నాణ్యమైన విత్తనం అందుతుందని తెలంగాణ జెఏసి చైర్మన్ ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. విత్తన హబ్ గా చెప్పుకునే తెలంగాణలో, రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడంలో విత్తన ధ్రువీకరణ సంస్థ పాత్ర అత్యంత కీలకం అన్నారు. హైదరాబాద్‌లోని ఆ సంస్థ కేంద్ర కార్యాలయంలో శనివారం తెలంగాణ విత్తన ధృవీకరణ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఇందులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సంస్థ అభివృద్ధి విషయంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విత్తన ధృవీకరణ సంస్థకు డెపార్ట్ మెంట్ హోదా కల్పిస్తూ, ట్రెజరీ నుంచి నేరుగా ఉద్యోగుల జీతాలు ఇచ్చేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరతామని చెప్పారు. అనంతరం సమావేశంలో పలు తీర్మానాలు చేసింది. ఉద్యోగుల పెన్షన్ ను 30 వేలకు పెంచాలని, విత్తన ధృవీకరణ సంస్థను వ్యవసాయ శాఖ లో ఒక ప్రత్యేక విభాగం క్రింద చేర్చాలని, ఔట్ సోర్సింగ్ వారిని కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పరిగణించి వారి జీతాలను పెంచాలని, కాంట్రాక్ట్ ప్రాతిపదిక ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్స్‌కు వ్యవసాయ విస్తరణ అధికారి బేసిక్ సాలరీకి సమానంగా, 32,000 లకు పెంచాలని, ఉద్యోగులకు కొత్త హెల్త్ ఇన్స్యూరెన్స్ పాలసీని తీసుకువచ్చి వారికి ఆరోగ్య భద్రత కల్పించాలని తీర్మానం చేసింది.

## మాతో పోరాడేందుకు కాంగ్రెస్, బిఆర్ఎస్ ఏకమయ్యాయి

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 13:** 'మాతో పోరాడేందుకు కాంగ్రెస్ బిఆర్ఎస్ ఏకమయ్యాయి' అని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు విమర్శించారు. కాంగ్రెస్ సారథ్యంలోని ఇండియా కూటమిలో ఉన్న సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌తో మంతనాలు జరపడంలోని మతలబు ఏమిటని ఆయన శనివారం విలేకరుల సమావేశంలో ప్రశ్నించారు.

ప్రధాన రాజకీయ ప్రత్యర్థి తాము (బిజెపి) కాబట్టి కాంగ్రెస్‌బిఆర్ఎస్ ఏకమయ్యా యని ఆయన విమర్శించారు. గతంలో తమిళనాడు సిఎం స్టాలిన్ పిలిచినప్పుడు కూడా ఈ రెండు పార్టీల నేతలు వెళ్ళారని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ ప్రజలు చైతన్యవంతులని, తోడు దొంగల ఈ రాజకీయాలను గమనిస్తున్నారని ఆయన అన్నారు. ఈ రెండు పార్టీలకు స్టాలిన్, అఖిలేష్, మమతా బెనర్జీ వంటి వాళ్ళు మద్దతునిస్తున్నారని ఆయన ఆరోపించారు.

గ్రామ పంచాయతీ మొదటి విడత ఎన్నికల్లో తమ పార్టీ మూడు వందల సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకున్నదని రాంచందర్ రావు తెలిపారు. తమ పార్టీ నాయకులు, కార్యకర్తల కృషి ఫలితంగా ఈ విజయం చేకూరింద న్నారు. అంతేకాకుండా బిఆర్ఎస్, కాంగ్రెస్ పాలనతో ప్రజలు విసుగెత్తారని, తమ పార్టీ వైపు చూస్తున్నారని ఆయన తెలిపారు.

వచ్చే రెండు విడతల్లోనూ తమ పార్టీని ఆదరించి, ఆశీర్వదించాలని ఆయన ప్రజలను కోరారు. గతంలో తమకు ఒక్క స్థానం కూడా లేని జనగాంలో రెండు, మహబూబాబాద్‌లో ఆరు, భూపాల్ పల్లిలో మూడు, సంగారెడ్డిలో ఆరు, వనపర్తిలో ఆరు, నాగర్ కర్నూలులో మూడు సర్పంచ్ స్థానాలను గెలు పొందామని ఆయన వివరించారు. ఉప సర్పంచ్‌లతో పాటు అనేక వార్డు సభ్యులుగా కూడా తమ పార్టీకి చెందిన వారు గెలుపొందారని ఆయన వివరించారు. తాము గెలుపొందని జిల్లా అంటూ ఏదీ లేదని, అన్ని జిల్లాల్లోనూ గెలుపొందామని ఆయన చెప్పారు. మొదటి విడతలో వేల సంఖ్యలో గెలిచామని కాంగ్రెస్, బిఆర్ఎస్ చెప్పుకుంటున్నాయని ఆయన తెలిపారు. గెలుపొందిన వారు ఎవరు? ఎక్కడ ఉన్నారు? అని ఆయన ప్రశ్నించారు.

## క్యూఆర్ కోడ్ శాలువాను ఆవిష్కరించిన కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 13:** సాంకేతికతను, మగ్గాన్ని జోడించి సిరిసిల్లకు చెందిన ప్రముఖ నేతన్న నల్ల విజయ్ కుమార్ రూపొందించిన 'క్యూఆర్ కోడ్' శాలువాను బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ నంది నగర్‌లోని నివాసంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ ప్రతిభను కెటిఆర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా నేతన్న నల్ల విజయ్ కుమార్ మాట్లాడుతూ, తన నాన్న గతంలో అగ్గిపెట్టెలో పట్టే చీరను తయారు చేశారని, ఆయనే తనకు స్ఫూర్తి అని పేర్కొన్నారు. గతంలో తాను రంగులు మారే చీరను, అగ్గిపెట్టెలో పట్టే చీరను తయారు చేసినప్పుడు, అప్పటి సిఎం కెసిఆర్ చేతుల మీదుగా ఉగాది పురస్కారం అందుకోవడం తన అదృష్టం అని గుర్తు చేసుకున్నారు. కెసిఆర్ తెలంగాణకు చేసిన అభివృద్ధిని,మన వారసత్వ సంపదను పది మందికి తెలియజేయాలనే ఆలోచనతోనే ఈ క్యూఆర్ కోడ్ శాలువాను రూపొందించినట్లు తెలిపారు. సిరిసిల్ల ఎప్పుడూ కొత్త ఆవిష్కరణలకు అడ్డా అని నిరూపించడమే తన లక్ష్యం అని పేర్కొన్నారు. ఈ అద్భుత ఆవిష్కరణను కెటిఆర్ ద్వారా కెసిఆర్‌కు అందించాలనే తన కోరిక అని చెప్పారు. అందుకు కెటిఆర్ స్పందిస్తూ తప్పకుండా ఈ శాలువాను కెసిఆర్‌కు అందజేస్తానని హామీ ఇచ్చారు. నేతన్నలకు కెటిఆర్ ఎల్లప్పుడూ అండగా ఉంటూ ప్రోత్సహిస్తున్నారని, భవిష్యత్తులో మరిన్ని అద్భుతాలు సృష్టిస్తామని విజయ్ సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, బిఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రటరీ రావుల చంద్రశేఖర్ రెడ్డి, సీనియర్ నాయకులు జాన్సన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. 'పోగు బంధంతో ఫోన్ బంధం' అనే కాన్సెప్ట్‌తో విజయ్ కుమార్ ఈ శాలువాను రూపొందించారు. శాలువాపై నేసిన క్యూఆర్ కోడ్‌ను మొబైల్ ఫోన్‌తో స్కాన్ చేయగానే తెలంగాణ చరిత్ర, సంస్కృతి, ప్రముఖ దేవాలయాలు, చారిత్రక కట్టడాలు కనిపిస్తాయి. అంతేకాకుండా, కెసిఆర్ హయాంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ, కాళేశ్వరం ప్రాజెక్టుల గొప్పతనాన్ని, యాదాద్రి ఆలయ వైభవాన్ని తెలిపేలా ఈ కోడ్‌ను తీర్చిదిద్దారు. కేవలం 15 రోజుల వ్యవధిలో ఇంతటి అద్భుతమైన శాలువాను విజయ్ కుమార్ రూపొందించడం విశేషం.

## మెస్, అద్దె, కరెంట్ బిల్లులు చెల్లించక మూసివేత దిశగా బిసి హాస్టళ్లు

### చొరవ తీసుకోవాలని సిఎం రేవంత్‌రెడ్డికి ఆర్.కృష్ణయ్య లేఖ

**హైదరాబాద్, డిసెంబరు 13, ప్రభాతవార్త:** తొమ్మిది నెలలగా మెస్ బిల్లులు, మూడేళ్లగా హాస్టల్ భవనాల అద్దె బిల్లులు, ఏడాదిగా కరెంటు బిల్లుల బకాయిలు చెల్లించకపోవడంతో బిసి హాస్టళ్లు మూసివేసే దిశగా ఉన్నాయని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. బిసి హాస్టల్‌లో విద్యార్థులకు భోజనం పెట్టే పరిస్థితి లేదని, బిల్లులు చెల్లించకపోతే మూసివేస్తామని హాస్టల్ అధికారులు అంటున్నారని లేఖలో పేర్కొన్నారు. వెంటనే ఈ బకాయిలు చెల్లించడానికి బడ్జెట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.'కూరగాయలు, మాసం, గుడ్ల బిల్లులు గత పప్పులు, నూనెలు, ఇతర నిత్యావసర వస్తువుల బిల్లులు గత ఐదు నెలలుగా చెల్లించడం లేదు. దీనితో హాస్టల్లకు వస్తువులు సరఫరా చేసే కాంట్రాక్టర్లు వ్యాపారస్తులు హాస్టల్ అధికారులు అప్పుల పాలయ్యారు. నిత్యావసర వస్తువులు సరఫరా నిలిపి వేస్తామని అంటున్నారు. దీనిమూలంగా హాస్టల్లో మూసివేసే పరిస్థితి ఏర్పడింది. రాష్ట్రం లోని మొత్తం బీసీ కాలేజీ హాస్టళ్లు అద్దెభవనాల్లో ఉన్నాయి. మూడేళ్లుగా అద్దె చెల్లించడం లేదు. వీపరీత జాప్యం మూలంగా అద్దె యజమానులు భవనాలు ఖాళీ చేయమని బ్యాంకు రుణాలు ఎలా కట్టాలి అంటున్నారు. వెంటనే అద్దె భవనాల బిల్లులు పాస్ చేయాలి. హాస్టళ్ళ కరెంట్ బిల్లులు గత రెండేళ్ల నుండి పెండింగ్‌లో ఉన్నాయి. పరీక్ష సమయంలో హాస్టళ్లకు కరెంటు కట్‌చేస్తే విద్యార్థులు ఎలా చదువుకుంటారు.గత నాలు గేళ్లుగా కాలేజీ ఫీజుల బకాయిలు 8వేల కోట్లు ఉన్నాయి.బకాయిలు ఇవ్వక పోవడం విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురువుతున్నారు. వెంటనే బీసీ కాలేజీ హాస్టళ్ళ పెండింగ్ బిల్లులు చెల్లించాలి' అని కృష్ణయ్య డిమాండ్ చేశారు.

## దివ్యాంగుల అభ్యున్నతికి సంస్కరణలు చేపట్టాలి

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



దివ్యాంగుడికి చేతికర్రను అందిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, చిత్రంలో చింతల రామచంద్రారెడ్డి తదితరులు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), డిసెంబరు 13, ప్రభాతవార్త:** దివ్యాంగుల అభ్యున్నతికి అవసరమైన సంస్కరణలు, సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వాలు చేపట్టాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కోరారు. ఖైరతాబాద్ నియోజకవర్గం ఆనంద్ నగర్‌కాలనీలోని సామాజిక భవనంలో ప్రత్యేక ప్రతిభావంతులకు రూ. కోటి విలువైన ట్రైసైకిళ్లు, అధునాతన సెల్‌ఫోన్లు, చేతి కర్రలతోపాటు ఇతర పరికరాలను పంపిణీ చేశారు. ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డితో కలిసి వాటిని అందించిన కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆర్థికంగా ఎదిగిన ప్రతి ఒక్కరూ దివ్యాంగులను ఒక్కరిని దత్తత తీసుకోవాలని కోరారు. దివ్యాంగులలో ఎంతో ప్రతిభ దాగి ఉంటుందన్నారు.ఇటీవల దివ్యాంగుల జట్టు దేశం తరుపున అద్భుత ప్రతిభను ప్రదర్శించిందని, ప్రపంచంలోనే నెంబర్ వన్ జట్టుగా నిలిచందన్నారు. ప్రధాని మోడీ సైతం దివ్యాంగుల వెన్నుతట్టి ప్రోత్సహిస్తున్నారన్నారు. దివ్యాంగులకు ఇంకా మంచి జరగాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా ప్రభుత్వాలు అవసరమైన ప్రోత్సాహాన్ని అందించాలన్నారు. దివ్యాంగులు సైతం సమాజాన్ని అడిగి తమకు కావాల్సిన వాటిని తీసుకోవాలని, అంతేకాని బాధపడి వెనకడుగు వేయవద్దని సూచించారు. ప్రధాని మోడి పాతికేళ్లుగా సీఎం, పీఎంగా ఒక్కరోజు సెలవు తీసుకోకుండా సేవలు అందిస్తున్నారని, ఆయనను దివ్యాంగులు అందరూ ఆశీర్వదించాలని కోరారు. రైల్వే, బస్ స్టేషన్లతోపాటు ఎయిర్‌పోర్టులలో ప్రత్యేక సౌకర్యాలు ఏర్పాటుచేస్తున్నామని, ప్రైవేటు కార్యాలయాల్లోనూ దివ్యాం గుల కోసం ప్రత్యేక వసతులు కల్పించాలని కోరారు. లేదంటే చట్టప్రకారం చర్య లు తీసుకుంటామన్నారు. ప్రధాని మోడీ వచ్చాకనే వికలాంగులను దివ్యాంగులుగా మార్చారని ఆయన అన్నారు.

## షాహి ఎక్స్‌పోర్ట్ కంపెనీలో మహిళా కార్మికులకు రూ.16,000 వేతనం అందేలా చూడాలి

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ లేఖ

**హైదరాబాద్, డిసెంబరు 13, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని నాచారం పారిశ్రామిక వాడలో కొనసాగుతున్న షాహి ఎక్స్‌పోర్ట్ పరిశ్రమలో పనిచేస్తున్న మహిళా కార్మికులకు రూ. 16,000 వేతనం అందేలా చర్యలు తీసుకోవాలని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు జాన్‌వెస్లీ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి శనివారం లేఖ రాశారు. షాహి ఎక్స్‌పోర్ట్ కంపెనీలో దాదాపు 2000 మందికి పైగా మహిళా కార్మికులు పనిచేస్తున్నారని, 20 యేళ్లుగా ఈ పరిశ్రమ నడుస్తున్నప్పటికీ, కార్మికుల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందన్నారు. వారికి నెలకు రూ. 26వేల వేతనం ఇవ్వాల్సి వుండగా, నెలకు కేవలం రూ.11,230లు మాత్రమే గ్రాస్ జీతం ఇస్తున్నారని సిఎంకి రాసిన లేఖలో వెస్లీ పేర్కొన్నారు. వారికి ఒక్కసారి కూడా ఇంక్రిమెంట్ ఇవ్వలేదని, నెల వేతనం కనీసం రూ. 16వేలు అయినా ఇవ్వాలని కోరుతూ గత 6రోజులుగా కంపెనీ గేటుముందే తీవ్రమైన చలిలో కూడా మహిళా కార్మికులు సమ్మె చేస్తున్నారని, అయినప్పటికీ యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తుందన్నారు. లేబర్ కమిషనర్ తగిన పద్ధతిలో స్పందించడంలేదని.. వారికి అందుతున్న తక్కువ వేతనంతో కుటుంబాలు చితికిపోతున్నాయని.. తక్షణమే ఈ కార్మికులకు వేతనం కనీసం రూ. 16వేలు అమలయ్యే విధంగా చూడాలని సిఎంకి రాసిన లేఖలో జాన్ వెస్లీ కోరారు. తమకు జీతాలు పెంచాలని యాజ మాన్యాలను అడిగితే.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న జీవో నంబర్ 60 ప్రకారమే వేతనం ఇస్తున్నామని, ఎక్కువ ఇవ్వలేమని, ఇష్టం లేకపోతే రాజీనామా చేయాలని బెదిరిస్తున్నారని తెలిపారు. కనీస వేతనాన్ని ప్రతి ఐదేళ్లకోసారి సవరించాల్సి నప్పటికీ.. ప్రభుత్వం 15 సంవత్సరాలుగా సవరించ లేదన్నారు. తక్షణమే కనీస వేతన జీవోను పెరిగిన ధరలకనుగుణంగా సవరించాలని, మహిళా కార్మికులతో ఓవర్‌టైం పనికి అదనంగా డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సిఎంకు రాసిన లేఖలో జాన్‌వెస్లీ కోరారు. పరిశ్రమలో 250 మంది కార్మికు లున్న చోట సబ్సిడీ క్యాంటీన్ ఉండాలని నిబంధనలు ఉన్నప్పటికీ.. కంపెనీలో 2వేల మంది ఉన్నా కనీసం టీ తాగడానికి క్యాంటీన్ కూడా ఏర్పాటు చేయలేదన్నారు. తక్షణమే మహిళా కార్మికుల సంక్షేమాన్ని దష్టిలో ఉంచుకుని, వారి సమస్యలను పరిష్కరించాలని, షాహి ఎక్స్‌పోర్ట్ యాజ మాన్యంపై చర్యలు తీసుకునే విధంగా లేబర్ కమిషనర్, కార్మికశాఖను ఆదేశించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాసిన లేఖలో జాన్‌వెస్లీ కోరారు.

## ఫుడ్‌పాయిజన్ బాధిత విద్యార్థులను పరామర్శించిన మాజీమంత్రి హరీశ్‌రావు

**హైదరాబాద్ (గోషామహల్), డిసెంబరు 13, ప్రభాతవార్త:** హైదరాబాద్ బాగ్‌లింగం పల్లిలోని మైనార్టీ గురుకుల పాఠశాల లో విద్యార్థులు ఫుడ్‌పాయిజన్‌కు గురై హైదరాబాద్ జిల్లా కింగ్‌కోఠి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను మాజీమంత్రి టి.హరీశ్‌రావు పరామర్శించారు. ఫుడ్‌పాయిజన్‌కు గల కారణా లను వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ఉన్న



సిటిస్కాన్ గత ఆరు నెలల నుంచి తాళంవేసి మూసి ఉంచడం పట్ల ఆసుపత్రి సూపరింటెండెంట్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని బాగ్ లింగంపల్లిలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో ఉంటున్న సుమారు 90మంది విద్యార్థులు తినే ఆహారం ఫుడ్ పైజన్‌కు గురై చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఫుట్‌బాల్ మీద ఉన్న ఆస్తకి విద్యార్థులపై లేదన్నారు. ఫుట్‌బాల్ ఆడడానికి ముఖ్యమంత్రి ఐదుకోట్లు ఖర్చుపెడుతున్నట్లు దుయ్యబట్టారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని గాలికి వదిలివేశారన్నారు. విజన్ 2047 అంటూ డబ్బా కొట్టుకుంటున్నారని, అది విజన్ 2047 కాదు.పాయిజన్ 2047 అని తీవ్రంగా విమర్శించారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నోరు విప్పితే అబద్దాలు మాట్లాడుతున్నారన్నారు. 90మంది పాఠశాల విద్యార్థులకు ఫుడ్ పైజన్ అయి ఆసుపత్రిలో ఉంటే కనీసం పట్టించుకోకపోవడం పట్ల విచార వ్యక్తం చేశారు. న్యాణమైన ఆహారం పెట్టకుండా కలుషిత ఆహారం పెట్టి విద్యార్థుల ప్రాణాలతో చెలగాట మాటడుతున్న అధికారులపై ముఖ్యమంత్రి, సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు.

తరుచుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢీల్లి వెళ్లే సమయం ఉంది.కాని గురుకుల్లాలో అస్వస్థతకు గురైన పిల్లలను పట్టించుకునే సమయం లేదా?అని ప్రశ్నించారు.అవినీతి, అహంకారం, ఆరాచకంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైజింగ్ అంటూ ఎద్దేవా చేశారు.ఈ వెంట బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నాయకులు ఉన్నారు.

## వ్యవస్థీకృతమైన లోపాల వల్లే పుట్టుకొస్తోన్న పైరసీ

### సిపిఐ జాతీయ నాయకుడు నారాయణ

**హైదరాబాద్, డిసెంబరు 13, ప్రభాతవార్త:** వ్యవస్థీకృతమైన లోపాల వల్లే పైరసీ పుట్టుకొస్తోందని భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) జాతీయ నాయకుడు డాక్టర్ కె నారాయణ అన్నారు. మితిమీరిన టికెట్ ధరలు, అధిక ధరలకు స్నాక్స్ విక్రయాలతో థియేటర్లు సామాన్య ప్రజల జేబులకు గుల్లా చేస్తున్నాయని మండిపడ్డారు. సినిమా థియేటర్లు, మల్టీప్లెక్స్‌లను ప్రభుత్వాలు కట్టడి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు సంబంధించిన ఒక వీడియోను నారాయణ విడుదల చేశారు. విడుదలైన ఒక్కరోజులోనే నందమూరి బాల కృష్ణ నటించిన అఖండ-2 మూవీ పైరసీ బయటకు రావడంపై నారాయణ స్పందించారు. సినిమాల పైరసీకి పాల్పడిన నిందితుడు ఐబొమ్మ రవిని ఉరి తీయాలని కొందరు డిమాండ్ చేస్తున్నారని.. అలా చేసినా సినిమాల పైరసీ ఆగదన్నారు. ఇపుడు రవి పోలీస్ కస్టడీలో ఉండగానే అఖండ-2 మూవీ పైరసీ ఎలా బయటకు వచ్చిందని నారాయణ ప్రశ్నించారు. అసలు పైరసీకి మూలం ఎక్కడుందని, అందుకు సంబంధించిన ఆధారాలు ఎక్కడ లభ్యం అవుతాయో కనిపెట్టాలన్నారు. నిర్మాతలు, సినిమా నిర్వాహకులు కేవలం టికెట్ ధరలు పెంచుకోవాలి, లాభాలు రాబట్టుకోవాలి అంటే ఎలా కుదురుతుందని ప్రశ్నించారు. ప్రజలపై భారం మోపడం వల్లే వాళ్లు ఇతర మార్గాలు వెతుక్కుంటున్నారని.. అందుకే థియేటర్లకు జనం రావట్లేదన్నారు.



దహెగాం మండలం ఐనం సమీపంలో కల్వర్టు వంతెన వద్ద తనిఖీలు చేస్తున్న బాంబు డిస్పోజల్ టీమ్, డాగ్ స్క్వాడ్ బృందం

## కుమ్రంభీం జిల్లాలో భద్రత కట్టుదిట్టం

### బాంబు డిస్పోజల్ టీమ్, డాగ్‌స్క్వాడ్ తనిఖీలు

### జిల్లా ఎస్పీ నితిక పంత్

**కాగజ్‌నగర్ రూరల్, డిసెంబరు 13, ప్రభాతవార్త :** కుమ్రంభీం జిల్లాలో ఎన్నికలు పూర్తిగా శాంతియుతంగా, నిష్పక్షపాతంగా జరిగేందుకు అన్ని రకాల భద్రతా చర్యలు తీసుకుంటున్నాని జిల్లా ఎస్పీ నితిక పంత్ అన్నారు. ఇందులో భాగంగా ఆదివారం జరిగే గ్రామపంచాయతీ రెండో విడత ఎన్నికల నేపథ్యంలో మండలాల వ్యాప్తంగా బాంబు డిస్పోజల్ టీమ్, డాగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు.ఆదివారం జిల్లా పరిధిలోని కౌటాల, చింతలమనేపల్లి, బెజ్జూర్, సిర్పూర్ టీ, దహెగాం, పెంచికల్పేట్ మండలాలలో జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని, పోలింగ్ కేంద్రాలు, పరిసర ప్రాంతాల్లో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయడానికి జిల్లా పోలీస్ బాంబు డిస్పోజల్ టీమ్, డాగ్ స్క్వాడ్ టీమ్ ప్రత్యేక తనిఖీలు చేపట్టింది. ఎన్నికల ముందు భద్రతా పరిస్థితిని సమగ్రంగా సమీక్షి స్తూ, పోలింగ్ కేంద్రాలు, రూట్ మ్యాపులు, ప్రజా రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలు, వంతెనలు, బస్ స్టాండ్లు, గ్రామ ప్రవేశ ద్వారాల వద్ద తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాంబు డిస్పోజల్ టీమ్, డాగ్ స్క్వాడ్ సిబ్బంది అనుమానాస్పద వస్తువులను గుర్తించే విధానం, భద్రతా ప్రోటోకాలు, అత్యవసర స్పందన చర్యలను సమీక్షి ంచారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నితిక పంత్ మాట్లాడుతూ ఎన్నికలు పూర్తిగా శాంతియుతంగా, నిష్పక్షపాతంగా జరిగేందుకు అన్ని రకాల భద్రతా చర్యలు తీసుకుంటున్నాం. బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, రిజర్వ్ పోలీస్ ఫోర్స్, స్ట్రైకింగ్ ఫోర్స్ బృందాలు, రూట్ మొబైల్ టీమ్స్ నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నట్లు, ఎటువంటి అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరుతున్నామని ఎస్పీ తెలిపారు. రెండు విడత గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో 862 మంది పోలీస్ అధికారులు, సిబ్బందిని నియమించినట్లు జిల్లా తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో ఎటువంటి చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడరాదని, జిల్లా పోలీసులు ఎన్నికల భద్రతాపై పూర్తి దృష్టి పెట్టినట్టు తెలిపారు.

## రబీకి సరిపడా యూరియా

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, డిసెంబరు 13, ప్రభాతవార్త :** రాష్ట్రంలో ప్రస్తుత రబీ సీజనుకు సంబంధించి సరిపడా యూరియా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నట్లు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటనలో యూరియా నిల్వలను త్వరితగతిన తరలించేందుకు కేంద్రానికి లేఖలు రాసినట్లు చెప్పారు. రాష్ట్రంలో జనవరి, ఫిబ్రవరిలో యూరియా వినియోగం అత్యధికంగా ఉండే అవకాశం ఉన్నందున, ఆ సమయంలో రైతులకు కొరత లేకుండా ఎరువుల సరఫరాకు అవసరమైన చర్యలు చేపడుతున్నామన్నారు. ఇందుకు బఫర్ నిల్వలను అందుబాటులో ఉంచడానికి అక్టోబర్ నుండి నెలకు 2 లక్షల టన్నుల చొప్పున ఇప్పటి వరకూ యూరియాను అందించాలని ఇప్పటికే కేంద్రాన్ని కోరినట్టు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 2.48 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువుల బఫర్ స్టాక్ అందుబాటులో ఉందని, ఈ నెలాఖరికి ఇంకా పెంచాలని సూచించారు. ఈ నెలకు తెలంగాణకు కేటాయించిన యూరియాలో 86 వేల టన్నుల ఇప్పటికే పోర్టులకు చేరిందన్నారు.

## ఫుడ్‌పాయిజన్‌తో ఆస్పత్రిలో చేరిన పిల్లల ఆరోగ్య పరిస్థితి భేష్

### మాజీమంత్రి హరీశ్‌రావు ఆరోపణలను ఖండించిన కింగ్‌కోఠి సూపరింటెండెంట్ డాక్టర్ సంతోష్‌బాబు

**హైదరాబాద్, డిసెంబరు 13, ప్రభాతవార్త:** కింగ్‌కోఠి హాస్పిటల్‌లో అడ్మిట్ అయిన పిల్లలకు అల్ట్రాసౌండ్, సీటీ స్కాన్ చేయడం లేదంటూ బీఆర్ఎస్ లీడర్, మాజీ మంత్రి హరీశ్ రావు చేసిన ఆరోపణలను కింగ్ కోఠి హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సంతోష్ బాబు ఖండించారు. పిల్లలకు చేసిన స్కానింగ్ రిపోర్టులను చూపించిన సూపరింటెండెంట్.. ఫుడ్ పాయిజన్‌తో అడ్మిట్ అయిన పిల్లలందరూ స్టేబుల్‌గా ఉన్నారని, వారికి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని వెల్లడించారు. లక్షల మందికి సేవలు అందిస్తున్న హాస్పిటల్‌పై తప్పుడు ఆరోపణలు చేయొద్దని సూపరింటెండెంట్ విజ్ఞప్తి చేశారు. కింగ్ కోఠి హాస్పిటల్‌లో 2 అల్ట్రాసౌండ్ మిషన్లు, ఒక సీటీ స్కాన్ యంత్రం ఉందని.. అన్నీ వర్కింగ్ కండీషన్‌లో ఉన్నాయని సూపరింటెండెంట్ డాక్టర్ సంతోష్‌బాబు స్పష్టం చేశారు. ప్రతి రోజూ సుమారు 100 మందికి స్కానింగ్ సేవలు అందిస్తున్నామని వెల్లడించారు.

# పసందైన రుచులు



## క్యారెట్ గులాబ్‌జామ్

**కావలసినవి:** పంచదార 250 గ్రాములు, పాలు 200 ఎం.ఎల్. యాలకులు 4, క్యారెట్లు 200 600 గ్రా, మిల్క్ పౌడర్ 100 గ్రా, నెయ్యి 2 టేబుల్ స్పూన్లు, ఉప్మారవ్వ 5 టేబుల్ సూ నూనె వేయించేందుకు సరిపడా, పిస్తా పలుకులు 2 స్పూన్లు **తయారీ:** పంచదారలో 200 ఎం.ఎల్ నీళ్లు, యాలకులు చేర్చి సన్న సెగ మీద కలియతిప్పుతుండాలి. కొంచెం చిక్కగా అయ్యాక దించేసి పక్కనుంచాలి. క్యారెట్లు కడిగి.. పీల్ గ్రైండ్ చేయాలి. ప్యాన్లో నెయ్యి వేడయ్యాక.. క్యారెట్ ముద్దను వేయించాలి. అది వేగిన తర్వత పాలు, రవ్వ జతచేసి.. కలియబెడుతుండాలి. పాలన్నీ ఇగిరిపోయి.. పొడిపొడిలాడుతున్నప్పుడు మిల్క్ పౌడర్ జోడించి.. ఉండలు కట్టకుండా కలుపుతుండాలి. దగ్గరగా అయ్యాక సెగ తీసేసి, ఆరేడు నిమిషాల పాటు చల్లారనివ్వాలి. ఈ మిశ్రమంతో చిన్న బాల్స్ చేసి కాగుతున్న నూనెలో దొరగా వేయించాలి. వాటిని పంచదార సిరప్లో వేసి, పిస్తా పలుకులు చల్లాలి. అవి ఓ గంట నానితే చాలు.. నోరూరించే క్యారెట్ గులాబీమ్ రెడీ.

## పనీర్ షాహీ కుర్మా



**కావలసినవి:** పనీర్ పావు కిలో, ఉల్లి తరుగు, కొబ్బరి తురుము అర కప్పు, టొమాట కప్పు, ఉప్పు రుచికి సరిపోతుంది, పావు స్పూన్, బాదంపప్పులు 12, జీడిప నూనె 4 స్పూన్లు, అల్లం వెల్లుల్లి పేస్టు, కారం, జీలకర్ర స్పూన్ చొప్పున, ధనియా పొడులు, గరంమసాల అర స్పూన్ చొప్పున, బిర్యానీ ఆకు 1, నల్ల యాలకులు పుదీనా, కొత్తిమీర తరుగు, పెరుగు 2 టేబుల్ స్పూన్ల చొప్పున

**తయారీ:** రెండు స్పూన్ల నూనెలో పన్నీర్ ముక్కలను వేయించి పక్కనుంచాలి. బాద వేడినీళ్లలో నానబెట్టి పొట్టు తీయాలి. వాటికి కొబ్బరి తురుము, జీడిపప్పు, తగినన్ని గ్రైండ్ చేయాలి. ప్యాన్‌లో మిగిలిన నూనె వేడిచేసి.. బిర్యానీ ఆకు, యాలకులు, జీత వెల్లుల్లి పేస్టు, పుదీనా, ఉల్లి తరుగులను వేయించాలి. అవి వేగాక.. పసుపు, జీలక ఉప్పు, టొమాటో ప్యూరీ జోడించి పచ్చితనం పోయే వరకూ వేయించాలి. అందులో మిశ్రమం జతచేసి ఉడికించాలి. పది నిమిషాల తర్వాత వేయించిన పనీర్, గరంమ పౌడర్, పెరుగు చేర్చి కలియ తిప్పాలి. చివర్లో కొత్తిమీర తరుగు వేసి దించాలి. పనీర్ షాహీ కుర్మా తయారైపోతుంది.

## ఆవ పెట్టిన పులిహోర

**కావలసినవి:** అన్నం 2 కప్పులు, ఉప్పు రుచికి తగినంత, చింతపండు ముప్పావు స్పూన్ **తాలింపు:** నువ్వుల నూనె పావు కప్పు, ఆవాలు స్పూన్, పసుపు మినప్పప్పు ఒకటిన్నర స్పూన్ చొప్పున, పల్లీలు గుప్పెడు, పచ్చిమిర్చి కరివేపాకు 2 రెబ్బలు, ఇంగువ తగినం **తయారీ:** ముప్పావు స్పూన్ ఆవాలను నూనె లేకుండా వేయించి.. పొడిచే కలిపి పక్కనుంచాలి. చింతపండును కడిగి పావుగంట వేడినీళ్లలో నానబెట వేడయ్యాక.. ఆవాలు, పల్లీలు, శనగపప్పు, మినప్పప్పు, ఎండుమిర్చి, కరివే చీల్చిన పచ్చిమిర్చి, పసుపు ఒక్కొక్కటిగా వేయాలి. అవి వేగాక.. చింతపం సన్న సెగ మీదుంచాలి. అడుగంటకుండా కలియతిప్పుతూ ఐదారు నిమిషాల వండి సిద్ధంగా ఉంచిన అన్నంలో ఈ తాలింపును, ఆవపిండి మిశ్రమాన్ని అంతే.. ఘుమఘుమలాడే ఆవ పెట్టిన పులిహోర సిద్ధం. □



# కర్తవ్యం ముందు బుల్లెట్ బలాదూర్ ..



**ఓవైపు దూసుకొస్తున్న బుల్లెట్లు. మరోవైపు పక్కనే వాటికి గాయపడిన సహోద్యోగి. చావు ఏ క్షణమైనా పలకరించొచ్చు. అలాంటి భయంకర పరిస్థితుల్లోనూ వృత్తి ధర్మాన్ని మర్చిపోలేదు అంజలి కుల్తే! ఎంతోమంది అమ్మలకు పునర్జన్మను ఇచ్చారామె! నాటి అనుభవాల్ని పంచుకున్నారిలా..**

దేశంలో ఉగ్రదాడి అనగానే మొదట గుర్తొచ్చేది 26/11 ముంబయి దాడులే! నరమేధానికి గుర్తు ఆ దాడి. 'రాత్రి పదిన్నర అవుతోందేమో! బుల్లెట్ల మోత విని నేను, నా సహోద్యోగి.. తొలి అంతస్తులోని కిటికీ దగ్గరికి పరుగెత్తాం. తొంగి చూస్తే ఇద్దరు ఆగంతుకులు గోడదూకి లోపలికి వస్తున్నారు. మమ్మల్ని గమనించి కాల్పులు జరిపారు. నేను తప్పించుకున్నా. నా సహోద్యోగికే బుల్లెట్ దిగింది' అంటూ గుర్తు చేసుకుంటారు అంజిలి. కసబ్, మరో ఉగ్రవాదిదాడి చేసిన 'కామా హాస్పిటల్'లో నర్సుగా పనిచేసేవారామె. ఆ రోజు ఆమె మెటర్నిటీ వార్డుకి ఇన్‌చార్జి. 'ఆగంతకులు ఆసుపత్రిలోకి చొచ్చుకొచ్చారు. అడ్డొచ్చిన సెక్యూరిటీనీ చంపేశారు. వాళ్లు ఏ క్షణమైనా పైకి రావొచ్చు. అందుకే ముందు ఆ అంతస్తు తలుపులు మూసేశా. మెటర్నిటీ వార్డులో 20మంది గర్భిణులు, వాళ్ల కుటుంబ సభ్యులున్నారు. వాళ్లని ఎలాగైనా కాపాడాలి అనుకుని, అంతస్తు చివర్లోని చిన్న గదిలోకి తీసుకెళ్లా. ఓవైపు గ్రెనేడ్ల కారణంగా భవంతి కంపిస్తోంది. బుల్లెట్ల మోత మోగుతోంది. చావు భయం తరుముతోంది. అయినా రేపటి పౌరులకు జన్మనిస్తోన్న అమ్మలు, వారి ప్రాణాలే ముఖ్యమనుకున్నా. భయం, దానికితోడు హైబీపి ఏదైనా వాళ్లకి నొప్పులు ప్రారంభమవ్వడానికి కారణం కావొచ్చు. ఆ స్థితిలో ప్రసవం చేస్తే తల్లికీ, బిడ్డకీ కూడా అపాయమే అందుకే.. నా భయాన్ని పక్కన పెట్టి, వాళ్లలో ధైర్యం నింపా' అని గుర్తు చేసుకుంటారు అంజిలి. కానీ సరిగ్గా ఆ సమయంలోనే ఓ గర్భిణికి నొప్పులు మొదలయ్యాయి. రెండో అంతస్తులో మెడికల్ ఆఫీసర్లు. ఉన్నారు. వాళ్లకి వెంటనే విషయం చెప్పా. కాల్పులు భయంకరంగా జరుగుతున్నాయి. దీంతో కిందకి రావడం అసాధ్యమన్నారు వాళ్లు. ఒక్క క్షణం నాకేం చేయాలో అర్థం కాలేదు. చివరికి ధైర్య తెచ్చుకుని ఆమెను మెటర్నిటీ వార్డుకి తీసుకెళ్లాదమనుకున్నా. కానీ ఆ తల్లి బయటికి అడుగుపెట్టడానికే భయపడింది. ఆమెకునచ్చజెప్పి మెట్లమీదుగా పైకి తీసుకెళ్లా. ప్రతిక్షణం భయమే. దేవుడి మీద భారం వేశా. ఎలాగైతేనేం ఆ తల్లిని డాక్టర్లకు అప్పగించి తిరిగి కిందకి వచ్చా' అనే అంజలి ఆ రాత్రంతా తన వార్డులోని గర్భిణులకు అండగా ఉన్నారు. పోలీసులు వచ్చి తలుపు తట్టేవరకూ ఆ గది తులుపులే తీయలేదు. చివరికి సురక్షితంగా బయటపడినా.. ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపారట అంజలి. 'ఆ కాళరాత్రిని తలుచుకుంటే ముచ్చెమటలు పోసేవి. అది జరిగిన నెలకి టెర్రరిస్టులను గుర్తించడానికి రమ్మని పోలీసులు పిలిచారు. ఇంట్లోవాళ్లంతా భయపడ్డారు. కానీ నేను వెళ్లా. కసబ్‌ని గుర్తుపట్టా కూడా. నన్ను చూసి అతను 'నన్ను బాగానే గుర్తు పట్టరే! నా పేరు అజ్మల్ కసబ్' అంటూ నవ్వాడు. పశ్చాత్తపం ఏ మాత్రం లేతనిలో పైగా ఏమీ చేయలేరన్న ధైర్యం కనిపించింది. అతని ముఖం, నవ్వు రెండూ నన్ను భయపెట్టాయి' అనే అంజలి తన యూనిఫామ్‌లోనే కోర్టుకి హాజరయ్యారు. తనని ఆ రోజు ఆ యూనిఫామే ధైర్యంగా విధులు నిర్వర్తించేలా చేసిందట. అందుకే దాన్నే ధరిస్తానని అడిగారట అంజలి. తన ధైర్యానికి గుర్తింపుగా భారత్ తరఫున యునైటెడ్ నేషన్స్ సెక్యూరిటీ కైన్సిల్ ప్రాతినిధ్యం వహించే అవకాశం దక్కించుకున్నారామె. ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపునీ పొందారు. అయినా ఆమె మాత్రం 'నా విధిని నేను నిర్వర్తించా' నంటారు వినమ్రంగా బుల్లెట్లకు ఎదురొడ్డి కర్తవ్యాన్ని నిర్వర్తించిన ఈమె ధైర్యానికి సలామ్ కొట్టకుండా ఉండగలమా! □

# భక్తిని పెంచే సహవాసంలో సాగిపోదాం..



'మంచి పోరాటము పోరాడితిని, నా పరుగు కడ ముట్టించితిని, విశ్వాసము కాపాడు కొంటిని. ఇక మీదట నా కొరకు నీతికిరీటముంచబడియున్నది. ఆ దినమందు నీతిగల న్యాయాధిపతియైన ప్రభువు అది నాకును, నాకుమాత్రమే కాకుండా తన ప్రత్యక్షతను ఆపేక్షించు వారికందరికిని అనుగ్రహించును' (2తిమోతి 4:7). ఇది అపొస్తలుడైన పౌలు మరణించేముందు చెప్పిన మాట. కొందరు ప్రారంభంలో ఆధ్యాత్మిక జీవితం బలహీనంగా ఉన్నా, మరణించేముందు బలంగా..దేవుడికి అత్యంత సమీపంలో ఉండి చనిపోతారు. కొందరు ఆరంభంలో చాలా ఉన్నతమైన ఆధ్యాత్మిక విశ్వాసాన్ని కనబర్చి, చనిపోయే ముందు మిక్కిలి బలహీనంగా తమ యాత్రాజీవితాన్ని ముగించుకుంటారు. ఇంకొందరు ఆరంభంలో ఉన్నతంగా భక్తిని కనబర్చి, మధ్యలో బలహీనమైపోయి, మరణించే ముందు మళ్లీ తమ ఆధ్యాత్మిక స్థితిని పెంచుకుంటారు. ఏవిధంగానైనా సరే చనిపోయేముందు పౌలు వలె ఉన్నతమైన భక్తివైరాగ్యాలతో మనయాత్రను ముగించి బాగుంటుంది. 'కార్యారంభముకంటె కార్యాంతము మేలు' (ప్రసంగి 7:8). విశ్వాసులముగా ఈలోకం బలహీనతలు వస్తుంటాయి. కానీ ఎప్పటికప్పుడు వాటిని సరిచేసుకుంటూ, దేవుడిలో ముందుకు సాగిపోవాలి. అందుకే మనం సంఘంతో సహవాసం కలిగి ఉండాలి. సహవాసం వల్లే మనం ఆధ్యాత్మికశక్తిని పెంచు కోగలం. ఒంటరిగా ఉంటే సాతానువల్ల శోధించబడే అవకాశం ఉంటుంది. వాడు ఎప్పుడూ మనం ఒంటరిగా ఉంటామో కాచుకుని ఉంటాడు. కాబట్టి పరిశుద్ధులతో నిత్యం ప్రార్థన, ఆత్మీయ, వాక్యం వంటివాటితో సహవాసం ఉన్నప్పుడు బలపడుతూ ఉంటాం. దేవుడి తోను, విశ్వాసులతోను సహవాసం కలిగి ఉంటేనే మనవిశ్వాసం నిలకడగా ఉంటుంది

-పి.వాణిపుష్ప

అంతర్వాణి

# చలికాలంలో మొక్కలు ఆరోగ్యంగా..

చలికాలంలో గులాబీ, జినియా, దోస, బెగోనియా, మందారంతో పాటు టొమాటో, దో మొక్కల్లో బూడిద తెగులు ఎక్కువగా కనిపిస్తాయి.

✦ దీన్ని నివారించడానికి 1 సోడా, అర టీస్పూన్ డిష్ సోప్, లీటరు నీరు కలిపి వారానికి రెండు సార్లు స్ప్రే చేస్తే సరి. ✦ ఇంటితోటలో పెంచే ఆకుకూరలతోపాటు ముల్లంగి, క్యారెట్, పూల మొక్కలైన గులాబీ... వంటి వాటిపైనా ఆకుతొలుచు పురుగు ఆశిస్తుంది. ఇండోర్ ప్లాంట్ ప్రభావానికి దారి తీస్తుంది. వెల్లుల్లి కషాయం చల్లడం ద్వారా దీన్ని నివారించవచ్చు. ✦ బయటి చలి వాతావరణాన్ని తట్టుకోలేవంటూ కొన్ని మొక్కల్ని ఇంటిలోపల పెడతాం. ముఖ్యంగా టొమాటో, మెంతికూర, గులాబీ, మందార, మల్లె...వంటి వాటిని ఏసి వార్మ్‌మోడ్, హీటర్ ఉన్న గదుల్లో కానీ, తక్కువ వెంటిలేషన్ ఉన్నా, గాలి ప్రసరించినంత ఈ ఎర్రనల్లి సమస్య వస్తుంది. ఈ ఇబ్బందిని తగ్గించడానికి మొక్కల అడుగు భాగంలో ఉండే ట్రేలో గులకరాళ్ల వేయాలి. నీళ్లను గాల్లోకి స్ప్రే చేసి ఆ వాతావరణంలో తేమ ఆకుల వెనక భాగంలో ఉన్న గుడ్లను... ఆకు తీసేసి పారేయడం ద్వారా లేదా నీళ్లలో కాస్త లిక్విడ్ పోస్ట్ వేపమానె కలిపి స్ప్రే చేయడం ద్వారా పోగొట్టొచ్చు మొక్క ఆరోగ్యంగా ఎదుగుతుంది. □



# ముగ్గులకు ఆహ్వానం

ధనుర్మాసం అంటే ముగ్గుల మాసంకదా! ఈ నెలంతా ముగ్గులు వేస్తారు. ఈ సందర్భంగా 'చెలి' పేజీలో ముగ్గుల ప్రచురణ కోసం ఆహ్వానం పలుకుతున్నాం.



**సూచనలు :** ★ గతంలో ప్రచురించిన ముగ్గులను పంపవద్దు. కొత్తముగ్గులు మాత్రమే పంపించగలరు. ★ ఇటీవల తీసుకున్న పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోను జతచేయగలరు. పాతఫొటోలను పంపవద్దు. ★ మీ పూర్తి చిరునామా, ముగ్గుల సంఖ్యను రాయాలి. ★ ఏ4 పేజీలో ఒకసైడు మాత్రమే ముగ్గుల్ని వేయాలి. ★ ముగ్గులు క్లీయర్‌గా, రంగు లతో కనిపించాలి. ★ మీ ముగ్గులను మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు.

**మా చిరునామా** ఎడిటర్, 'చెలి' వార్త, నం.396, లోయర్‌ట్యాంక్ బండ్, డిబిర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80 **Gmail: cheli@vaartha.com**

**కృత్రిమ మేధతో రూపొందించిన ముగ్గులు పంపవద్దు**

# తెర

## 'వృషభ' నుంచి 'అప్పా..'సాంగ్ రిలీజ్



కంప్లీట్ యాక్టర్ మోహన్ లాల్ టైటిల్ పాత్రలో నటిస్తోన్న భారీ బడ్జెట్ చిత్రం'వృషభ. తాజాగా ఈ చిత్రం నుంచి'అప్పా..'అనే సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. తండ్రీ కొడుకుల మధ్య ఉండే పవిత్రమైన, గొప్ప అనుబంధాన్నితెలియజేసే ఈ పాట సినిమాకు ఆత్మ, వెన్నెముక లాంటిది. దీంతో సినిమా ప్రమోషన్స్‌కు ఎమోషనల్ స్టార్టింగ్ దొరికినట్టయ్యింది. సామ్ సి.ఎస్ సంగీతం అందిస్తోన్న ఈ చిత్రంలోని ఈ పాటను హిందీ, కన్నడ, తెలుగులో విజయ్ ప్రకాష్.. మలయాళంలో మధు బాలకృష్ణన్ పాడగా, సాహిత్యాన్ని మలయాళంలో వినాయక్ శశికుమార్, తెలుగులో కళ్యాణ్ చక్రవర్తి త్రిపురనేని, హిందీలో కార్తీక్ ఖుష్, కన్నడలో నాగార్జున శర్మ అందించారు. ప్రతి రైటర్ తన పాటలో తమ సంస్కృతిని మిక్స్ చేసి ఎమోషనల్ టచ్ ఉండేలా చూసుకున్నారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు నంద కిషోర్ మాట్లాడుతూ 'వృషభ మ్యూజికల్ జర్నీఅప్పా పాటను స్టార్ట్ చేశాం. ఈ సినిమా ద్వారా తండ్రీ కొడుకుల మధ్య ఉండే బలమైన, భావోద్వేగా బంధం గురించి మేం చెప్పాలని అనుకున్నాం. దాన్ని ఈ పాట ద్వారా చూపించాం. మోహన్ లాల్ హీరోగా నటిస్తోన్న ఈ చిత్రంలో సమర్జిత్ లంకేష్, రాగిణి ద్వివేది, నయన్ సారిక, అజయ్, నేహా సక్సేనా, గరుడ రామ్, వినయ్ వర్మ, అలీ, అయప్ప పి.శర్మ, కిషోర్ ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు

## 'దండోరా' టైటిల్ సాంగ్ రిలీజ్



దండోరా.. దండోరా... అనే సాగే 'దండోరా...' మూవీ టైటిల్ సాంగ్‌ను మేకర్స్ శనివారం విడుదల చేశారు. మార్క్ కె రాబిన్ సంగీత సారథ్యం వహిస్తోన్న ఈ సినిమాలోని, ఈ పాటను కాసర్ల శ్యామ్ రాశారు. ఆంథోని దాసన్, మార్క్ కె.రాబిన్ పాటను పాడారు. సమాజంలో అట్టడుగు వర్గాల ప్రజల బాధలను తెలియ జేసేలా సాగే ఈ పాట చాలా ఎమోషనల్‌గా, హార్ట్ టచింగ్‌గా ఉంది. తరాలు మారుతున్నాయి. చంద్రుడిపైకి మనిషి అడుగు పెట్టిన ఎన్నో ఏళ్లవుతుంది. అయినా కూడా ఈ అసమానతలు మాత్రం తగ్గటం లేదనేది ఈ పాటలోని భావం.వైవిధ్యమైన చిత్రం కలర్ ఫొటో, బ్లాక్‌బస్టర్ మూవీ 'బెదురులంక 2012' చిత్రాలను నిర్మించి అందరి దృష్టిని ఆకర్షించిన లౌక్య ఎంటర్‌టైన్ మెంట్స్ అధినేత రవీంద్ర బెనర్జీ ముప్పానేని రూపొందిస్తోన్న తాజా చిత్రం 'దండోర్రా. శివాజీ, నవదీప్,నందు, రవికృష్ణ, మనికా చిక్కాల, మోనికా రెడ్డి, బిందు మాధవి, రాధ్య, అదితి భావరాజు తదితరులు పాత్రధారులు. మురళీకాంత్ దర్శకత్వం వహిస్తోన్న ఈ చిత్రం డిసెంబర్ 25న సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.డిఫరెంట్ ప్రమోషనల్ ప్లానింగ్ స్ట్రాటజీతో 'దండోరా' మూవీపై స్టార్టింగ్ నుంచే బజ్ క్రియేట్ అయ్యింది. దీంతో సినిమా రిలీజ్ కంటే ముందే బిజినెస్ పూర్తి కావటం విశేషం. ఈ చిత్రాన్ని నైజాంలో మైత్రీ మూవీస్ సంస్థ రిలీజ్ చేస్తుంటే.. ఆంధ్ర, సీడెడ్, కర్ణాటక ఏరియాల్లో ప్రైమ్ షో రిలీజ్ చేస్తోంది. ఓవర్సీస్‌లో 200కు పైగా థియేటర్స్‌లో సినిమాను అథర్వణ భద్రకాళి పిక్చర్స్ గ్రాండ్ రిలీజ్ చేస్తోంది. ఓవర్సీస్‌లో అయితే డిసెంబర్ 23నే ప్రీమియర్స్ పడుతున్నాయి.

## 'మ్యాజిక్ మూవ్ మెంట్స్' టైటిల్ లాంచ్




తల్లాడ సాయి కృష్ణ హీరోగా నటిస్తూ దర్శకత్వం వహిస్తున్న సినిమా "మ్యాజిక్ మూవ్ మెంట్స్" (మీరు అనుకున్నది కాదు). ఈ చిత్రానికి ప్రముఖ దర్శకుడు కె.దశరథ్ సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రాన్ని శ్రీ అన్నపూర్ణ క్రియేషన్స్, శ్రీ లక్ష్మి శ్రీనివాస ఫిలిమ్స్ బ్యానర్స్ పై తల్లాడ శ్రీనివాస్ నిర్మిస్తున్నారు. వెంకట్ దుగ్గిరెడ్డి సహ నిర్మాత. ప్రస్తుతం చిత్రీకరణ తుది దశలో ఉన్న "మ్యాజిక్ మూవ్ మెంట్స్" (మీరు అనుకున్నది కాదు) సినిమా టైటిల్ లాంఛ్ ఈవెంట్ ను శుక్రవారం హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలోసహ నిర్మాత వెంకట్ దుగ్గిరెడ్డి మాట్లాడుతూ నేను యూఎస్ లో ఉంటాను. నాకు సినిమాలంటే ఆసక్తి. సాయికృష్ణ ఇండస్ట్రీలో పడే కష్టం నాకు తెలుసు. అందుకే అతనికి సపోర్ట్ గా ఉండేందుకు ముందుకొచ్చాను. నిర్మాత తల్లాడ వెంకన్న మాట్లాడుతూ నన్ను నటుడిగా ఇండస్ట్రీకి పరిచయం చేసింది సాయికృష్ణ. నేను హీరోగా ఒక్కడే అనే మూవీని చేసి రెండు తెలుగు రాష్ట్రాల్లో పెద్ద సంఖ్యలో థియేటర్స్ రిలీజ్ చేశాను. ఇప్పుడు "మ్యాజిక్ మూవ్ మెంట్స్" (మీరు అనుకున్నది కాదు) సినిమాను మంచి కమర్షియల్ అంశాలతో నిర్మిస్తున్నాం. హీరోయిన్ ఏకాదంతాయ సిరి మాట్లాడుతూ చిన్న సినిమాలోకి హీరోయిన్స్ ను తీసుకున్నారంటే ఏదో గ్లామర్ షో చేయిస్తారు అనుకుంటారు. కానీ సాయికృష్ణ దర్శకుడిగా ఒక సిన్సియారిటీ చూపించారు. హీరో, దర్శకుడు తల్లాడ సాయికృష్ణ మాట్లాడుతూ సాయిబాబా ఆశీస్సులు ఇస్తున్న ఫొటో ఒకటి మా ఇంట్లో ఫ్రిడ్జ్ మీద ఉంది. ఆ ఫొటో చూసిన ఇన్స్పిరేషన్ తో "మ్యాజిక్ మూవ్ మెంట్స్" సినిమా స్క్రిప్ట్ మొదలైంది. ఈ సినిమా ప్రారంభించేప్పటికి మా దగ్గర డబ్బులు లేవు. కానీ సినిమా చేయాలి,

## "వైఫ్"చిత్రం టైటిల్ లాంచ్



అధిరా టాకీస్ ప్రొడక్షన్ నెం:1గా "వైఫ్" టైటిల్ లాంచ్.. అధిరా టాకీస్ బ్యానర్ పై 100కు పైగా సినిమాలకు పని చేసిన సినిటారియ మీడియా వర్క్స్ సపోర్టుతో శ్రీనివాస్ (బుజ్జి) దర్శకత్వంలో నరేన్ తేజ్, సుహాన జంటగా నటిస్తూ మురళీకృష్ణ వర్మ సినిమాటో గ్రాఫర్‌గా ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం వైఫ్. సత్య కాశ్యప్ సంగీతాన్ని అందించిన ఈ చిత్రానికి నందమూరి హరి ఎడిటింగ్ చేశారు. ప్రముఖ దర్శకుల ఆధ్వర్యంలో వైఫ్ చిత్ర టైటిల్, ఫస్ట్ లుక్ లాంచ్ చేయడం జరిగింది. ఈ సందర్భంగాఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన ప్రముఖ దర్శ కుడు చంద్ర మహేష్ మాట్లాడుతూ... "అందరికి నమస్కారం. ఈరోజు వైఫ్ చిత్ర టైటిల్, ఫస్ట్ లుక్ లాంచ్ కార్యక్రమానికి నన్ను ఆహ్వానించిన చిత్ర బృందం వాడికి నా ధన్యవాదాలు. అన్నారు. ప్రముఖ డైరెక్టర్ సముద్ర మాట్లాడుతూ... "ఈ కార్యక్రమా నికి వచ్చిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. అన్నారు. ప్రముఖ నిర్మాత రామ సత్యనారాయణ మాట్లాడుతూ.. ఈ సినిమాకు బలం సినిటారియ మీడియా వర్క్స్ వెంకట గారు. అలాగే కే మ్యూజిక్ వారు ఈ సినిమా పాటలను కొనడం మరొక విశేషం. ఒక మంచి సినిమాలు ప్రేక్షకులకు చేరదీసే మాధ్యమం పబ్లిసిటీ. ఈ కార్యక్రమానికి విచ్చేసి సినిమాకు సపోర్ట్ చేస్తున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు.

## 'మోగ్లీ' జెన్యూన్ లవ్ స్టోరీ



హీరో రోషన్ కనకాల తన రెండవ చిత్రం మోగ్లీ 2025తో అలరించబోతున్నారు.

**మోగ్లీ కథ ఎలా ఉండబోతుంది?**

ఇది ప్యూర్ అండ్ ఇన్నోసెన్స్ వుండే లవ్ స్టోరీ. ఒక్క క్షణం కూడా బోర్ కొట్టకుండా డైరెక్టర్ సందీప్ ఈ సినిమాకి స్క్రీన్ ప్లే డిజైన్ చేశారు. స్క్రీన్ ప్లే చాలా రేసీగా ఉంటుంది. ఇందులో హానెస్ట్ లవ్ స్టోరీ ఉంటుంది.

**మోగ్లీ తన ప్రేమ కోసం దేనికైనా రెడీగా ఉంటాడు. తన ప్రేమ కథకు వచ్చిన అడ్డంకేంటి?**

క్రిస్టఫర్ నోలన్ నుంచి ఎలాంటి సవాళ్లు ఎదురయ్యాయి అనేదాన్ని బట్టి ఈ కథ ముందుకు వెళుతుంది. మోగ్లీ అందరికీ కనెక్ట్ అయ్యే క్యారెక్టర్. అందరూ కూడా ఆ క్యారెక్టర్ కి రిలేట్ అవుతారు.

**బబుల్ గమ్ తర్వాత ఈ కథ ఎంచుకున్నారు కదా.. ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారు?**

ఆడియన్స్ థియేటర్స్ కి వచ్చిన తర్వాత ఒక్క క్షణం కూడా బోర్ ఫీల్ కాకుండా ఉండే కథ కోసం ఎదురుచూస్తున్న సమయంలో సందీప్ ఈ కథతో వచ్చారు ఇది థియేటర్స్ లో ఎక్స్పీరియన్స్ చేయాల్సిన కథ.

**ఫారెస్ట్ బ్యాక్ గ్రౌండ్ లో షూటింగ్ చేయడం చాలెంజింగ్ అనిపించిందా?**


ప్రాక్టికల్ గా చూసుకుంటే కొన్ని ఇబ్బందులు ఉన్నాయి. అయితే నేను అన్ని ఎంజాయ్ చేస్తూ చేశాను. చేసే పనిని ప్రేమించి చేశాను. దీంతో అంతా సరదాగ గడిచింది. 60 ఆఫ్ షూటింగ్ ఫారెస్ట్ లోనే చేశాము. సినిమాలో అన్ని రియల్ లొకేషన్స్ ఉంటాయి. ఈ సినిమా తర్వాత ఫారెస్ట్ కి చాలా డీప్ గా కనెక్ట్ అయ్యాం

**కాలభైరవ మ్యూజిక్ గురించి?**

కాలభైరవ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. కీరవాణి గారు రాజమౌళి గారికి బ్యాగ్రౌండ్ స్కోరు ఇచ్చినంత రేంజ్ లో మ్యూజిక్ ఉంటుంది.


**హీరోయిన్ సాక్షి గురించి?** తను చాలా మంచి నటి. సినిమా కోసం సైన్ లాంగ్వేజ్ కూడా నేర్చుకుంది. ఈ సినిమాలో మా ఇద్దరి కెమిస్ట్రీ పండితేనే కథ అందరికీ కనెక్ట్ అవుతుంది. అలాంటి కెమిస్ట్రీ చాలా చక్కగా కుదిరింది.

## ఫెమ్ జ్యోతి అపూర్వ 'విచిత్ర'



సిస్ ఫిలిమ్స్ బ్యానర్ పై జ్యోతిఅపూర్వ ప్రధాన పాత్రలో రవి రావణ్ రుద్ర ,శ్రేయ తివారి హీరో హీరోయిన్‌గా 'బేబి' శ్రీ హర్షిణి, మీనావాసు ప్రత్యేక పాత్రలో సైఫుద్దీన్ మాలిక్ నిర్మాణ దర్శకత్వం లో విడుదలకు సిద్ధంగాఉన్న చిత్రం 'విచిత్ర' త్వరలో పేక్షకుల ముందుకు రానుండి తల్లి కూతుళ్ళ సెంటిమెంట్ హృదయాలను హత్తుకునే కథ కథనంతో చక్కటి ఫ్యామిలీ ఎంటర్టైనర్ తెరకెక్కిన 'విచిత్ర' ఇటీవలే సెన్సర్ పనులు పూర్తి చేసుకొని విడుదలకి సిద్ధమవుతుంది.ఈ సందర్భంగా ఈ చిత్రం దర్శక నిర్మాత సైఫుద్దీన్ మాలిక్ మాట్లాడుతూ ఒక ఆత్మీయమైన ఒక తల్లి కూతుళ్ళ సెంటిమెంట్ తో రూపొందిన చిత్రం 'విచిత్ర' ప్రతి కుటుంబం తల్లి ప్రేమ, త్యాగం, బంధం గురించి ఆలోచించేలా చేసే హృదయాన్ని తాకే చిత్రం 'విచిత్ర' ఈ చిత్రాన్ని 2026 కొత్త సంవత్సరం లో విడుదలకి సిద్ధం చేస్తున్నాం


## జాతీయ రెజ్లింగ్ ఛాంపియన్‌గా పంగల్




**న్యూఢిల్లీ:** జాతీయ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్-2025, భారత్ రెజ్లర్ అంటిమ్ పంగల్ ఛాంపియన్‌గా నిలిచింది. అహ్మదాబాద్‌లో జరిగిన జాతీయ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో అంటిమ్ మహిళల 55 కిలోల బంగారు పతక విజేత అయింది. తొలి రోజున పది మహిళల వెయిట్ కేటగిరీలకు సంబంధించిన పోటీలు జరిగాయి. అంటిమ్, మనీషా, మాన్సి, ప్రియా మాలిక్, నిషా దహియా, కిరణ్ వంటి అగ్రశ్రేణి రెజ్లర్లు పోటీలో పాల్గొన్నారు. అంటిమ్, మనీషా (57 కిలోలు), మరియు నిషా (68 కిలోలు) వారి వారి విభాగాలలో బంగారు పతకాలు సాధించారు. 76 కిలోల విభాగంలో ప్రియా మాలిక్ హర్యానాకు చెందిన జ్యోతి బెర్వాల్ చేతిలో ఓడిపోయి రజత పతకాన్ని గెలుచుకుంది. ప్రపంచ ఛాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత మాన్సి, జాతీయ స్థాయిలో 62 కిలోల విభాగంలో కూడా కాంస్య పతకంతో సంతృప్తి చెందాల్సి వచ్చింది. కాగా హర్యానా 190 పాయింట్లతో మహిళల జట్టు టైటిల్‌ను కైవసం చేసుకుంది.

## స్క్వాష్ ప్రపంచ కప్ సెమీఫైనల్స్‌కు భారత్

### దక్షిణాఫ్రికాపై 3-0తో గెలుపు




**న్యూఢిల్లీ:** క్వార్టర్ ఫైనల్స్‌లో దక్షిణాఫ్రికాపై 3-0 తేడాతో విజయం సాధించిన భారత్ 2025 ఎస్‌డిఎటి స్క్వాష్ ప్రపంచ కప్ సెమీఫైనల్‌కు చేరుకుంది. సెమీఫైనల్లో భారత్ ప్రస్తుత ఛాంపియన్ ఈజిప్టుతో తలపడనుంది. అనుభవజ్ఞురాలైన జోష్నా చిన్నప్ప టీగన్ రస్సెల్‌పై సునాయాస విజయంతో ఆతిథ్య జట్టుకు తొలి ఆధిక్యాన్ని అందించింది. కామన్వెల్త్ గేమ్స్ పతక విజేతకు 3-0 (7-4, 7-4, 7-2) తేడాతో తొలి టైను ముగించడంతో ఆమె విజయం దాదాపుగా ఖరారైంది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 29వ స్థానంలో ఉన్న భారత పురుషుల స్క్వాష్ ఆటగాడు అభయ్ సింగ్ కూడా రెండవ టైలో అద్భుతమైన ప్రదర్శన ఇచ్చాడు. రెండవ గేమ్‌లో డెవాల్డ్ చేతిలో 2-4తో వెనుకబడినప్పటి దాని నుండి కోలుకుని రెండవ గేమ్‌ను 7-6తో గెలుచుకున్నాడు. చివరికి అతను దక్షిణాఫ్రికా ఆటగాడిని 3-0 (7-1, 7-6, 7-1)తో ఓడించాడు. టోర్నమెంట్‌లో అతి పిన్న వయస్కుడైన అనహత్ సింగ్, హేలీ వార్డ్‌ను 3-0 (7-3, 7-3, 7-4) తేడాతో ఓడించి సెమీఫైనల్‌కు చేరుకునేలా చేశాడు. అంతకుముందు పూల్ స్టేజ్ మ్యాచ్‌లలో, భారత్ తన మొదటి టైలో స్విట్జర్లాండ్‌ను 4-0 తేడాతో ఓడించింది. రెండవ పూల్ స్టేజ్ మ్యాచ్‌లో బ్రెజిల్‌ను 3-0 తేడాతో ఓడించింది.

### విశ్వ సముద్ర ఓపెన్‌లో

## యువరాజ్‌కు టైటిల్




**న్యూఢిల్లీ:** విశ్వ సముద్ర ఓపెన్ 2025లో 6 షాట్ల తేడాతో యువరాజ్ సంధు ఆరో సీజన్ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. భారత్‌కు చెందిన 28 ఏళ్ల యువరాజ్ 2025 పిజిటిఐ ఆర్డర్ ఆఫ్ మెరిట్ ఛాంపియన్‌గా నిలిచాడు. అంతేకాకుండా వచ్చే ఏడాది డిపి వరల్డ్ టూర్‌లో తన స్థానాన్ని ఖరారు చేసుకున్నాడు. ఈ టోర్నీలో రన్నరప్ స్థానం నుండి తిరిగి వచ్చిన సంధు ప్రతిష్టాత్మక ఢిల్లీ గోల్ఫ్ క్లబ్ లో ఆరు అండర్ 66 చివరి రౌండ్‌తో ఎనిమిది షాట్‌లతో అద్భుతమైన విజయాన్ని నమోదు చేశాడు. ఒక షాట్ ఆధిక్యంతో రోజును ప్రారంభించిన సంధు మొదటి రెండు హోల్స్‌లో బర్డీలతో టైటిల్ వైపు తొలి అడుగులు వేశాడు. అక్కడ అతను బంకర్ నుండి పైకి క్రిందికి 12 అడుగుల కన్వర్షన్ చేశాడు. ఆ తర్వాత మరో నాలుగు బర్డీలను జోడించి తన కెరీర్‌లో 15వ టైటిల్‌ను సాధించాడు. భారత్‌కు చెందిన యువరాజ్ వరుసగా రెండోసారి బోగీ లేకుండా 66 పరుగులు చేసి, ఆ వారం మొత్తం 14అండర్ 274 పరుగులు చేశాడు. ఫలితంగా, సంధు రూ.30 లక్షల విలువైన విజేత చెక్కును అందుకుని పిజిటిఐ ర్యాంకింగ్‌లో తిరుగులేని ఆధిక్యాన్ని సాధించాడు. 2021లో విరాజ్ మదప్ప నెలకొల్పిన డిజిసిలో అత్యల్ప విజయ స్కోరు (14అండర్ 274) రికార్డును కూడా యువరాజ్ సమం చేశాడు. శ్రీలంకకు చెందిన ఎన్. తంగరాజా తన చివరి రౌండ్ 68 తర్వాత సిక్స్ అండర్ 282తో రన్నరప్‌గా నిలిచాడు. పిజిటిఐ ర్యాంకింగ్‌లో రెండు స్థానాలు ఎగబాకి రెండవ స్థానానికి చేరుకున్నాడు. అలాగే అక్షయ్ శర్మ (ఐదుఅండర్ 283), మను గందాస్ (మూడుఅండర్ 285), రషీద్ ఖాన్ (రెండుఅండర్ 286) వరుసగా మూడు, నాలుగు మరియు ఐదవ స్థానాల్లో నిలిచారు.



### డబ్ల్యుటిసి పాయింట్స్:

## భారత్‌కు భారీ షాక్

### న్యూజిలాండ్ దెబ్బకు 6వ స్థానం

**న్యూఢిల్లీ:** వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ తాజా పాయింట్స్ టేబుల్‌లో భారత జట్టుకు భారీ నష్టం జరిగింది. న్యూజిలాండ్ తమ రెండవ టెస్ట్ మ్యాచ్‌లో వెస్టిండీస్‌ను 9 వికెట్ల తేడాతో ఓడించి, పట్టికలో అనూహ్యంగా ముందుకు దూకింది. ఈ పరిణామాల కారణంగా భారత జట్టు మరింత వెనుకబడింది. ప్రస్తుతం పాయింట్స్ టేబుల్‌లో పాకిస్తాన్ కూడా భారత్ కంటే ముందు ఉండటం గమనార్హం. వెస్టిండీస్‌పై విజయం సాధించిన తరువాత న్యూజిలాండ్ ఆరో స్థానం నుంచి మూడవ స్థానానికి చేరుకుంది. 2023 వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ విజేత ఆస్ట్రేలియా 100 పాయింట్స్ శాతంతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ప్రస్తుతం ఆస్ట్రేలియా యాషెస్ 2025-26 సిరీస్‌లో ఇంగ్లండ్‌పై 2-0 ఆధిక్యంలో ఉంది. ఇక ఇటీవల భారత్‌ను వారి సొంత గడ్డపై టెస్ట్ సిరీస్‌లో 2-0 తేడాతో క్లీన్ స్వీప్ చేసిన సౌతాఫ్రికా 2వ స్థానంలో ఉంది. వెస్టిండీస్‌పై గెలుపుతో న్యూజిలాండ్ మూడవ స్థానాన్ని దక్కించుకుంది. ఈ మార్పుల కారణంగా శ్రీలంక కూడా ఒక స్థానం దిగజారి నాలుగో స్థానానికి పడిపోయింది. న్యూజిలాండ్ దూకుడు కారణంగా భారత్ ఆరో స్థానానికి పడిపోయింది. ప్రస్తుతం భారత్ కేవలం 48.15 పాయింట్స్ శాతంతో ఉంది. అగ్రస్థానంలో ఉన్న ఆస్ట్రేలియా 100 పాయింట్స్ శాతంతో ఉండటం వల్ల టీమిండియా వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు చేరుకునే ఆశలు తగ్గుతున్నాయి. అంతేకాకుండా పాయింట్స్ టేబుల్‌లో పాకిస్తాన్ కూడా భారత్ కంటే ముందు ఐదవ స్థానంలో ఉంది. ఒకవేళ యాషెస్ సిరీస్‌లో మిగిలిన 3 మ్యాచ్‌లలో ఇంగ్లండ్ గనుక పుంజుకుంటే, భారత జట్టు ఏకంగా ఏడవ స్థానానికి కూడా పడిపోయే ప్రమాదం ఉంది. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ప్రస్తుత సైకిల్‌లో భారత్ ఇప్పటివరకు 9 టెస్టులు ఆడి కేవలం నాలుగు విజయాలు మాత్రమే నమోదు చేసింది. భారత జట్టు ఇప్పుడు దాదాపు 8 నెలల పాటు ఎలాంటి టెస్ట్ సిరీస్ ఆడదు. టీమిండియా తదుపరి టెస్ట్ సిరీస్ ఆగస్టు 2026 లో శ్రీలంకతో జరగనుంది. 2027 వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ ఆశలను సజీవంగా ఉంచుకోవాలంటే, భారత్ మిగిలిన మ్యాచ్‌లలో అత్యధికంగా గెలవాల్సిన అవసరం ఉంది.

### ఒడిశా మాస్టర్స్‌లో ఫైనల్‌కు

## ఉన్నతి, ఇషారాణి, కిరణ్

**న్యూఢిల్లీ:** ఒడిశా మాస్టర్స్-2025లో భారత్ షట్లర్లు ఉన్నతి హుడా, ఇషారాణి బారువా ఆల్ ఇండియన్ మహిళల సింగిల్స్ ఫైనల్‌కు, పురుషుల సింగిల్స్ విభాగంలో కిరణ్ జార్జ్ ఫైనల్‌కు చేరుకున్నారు. శనివారం జరిగిన ఒడిశా మాస్టర్స్ సూపర్ 100 టోర్నమెంట్‌లో ఇషారాణి, ఉన్నతి గెలుపొందారు. ఇషారాణి 18-21, 21-7, 21-7తో తాన్య హేమంత్‌ను ఓడించగా, టీనేజర్ ఉన్నతి 18-21, 21-16, 21



-16తో తస్నిమ్ మీర్‌ను ఓడించింది. జర్మనీలో జరిగిన సయ్యద్ మోడీ ఇంటర్నేషనల్ మరియు హైలో ఓపెన్‌లలో వరుసగా రెండు సెమీఫైనల్స్‌లో నిష్క్రమించిన తర్వాత ఉన్నతి ఈ సంవత్సరంలో తన తొలి ఫైనల్‌కు చేరుకుంది. అలాగే పురుషుల సింగిల్స్‌లో అనుభవజ్ఞుడైన కిరణ్ జార్జ్ సెమీస్‌లో 21-19, 8-21, 21-18 తేడాతో రౌనక్ చుహాన్‌ను ఓడించి టైటిల్ కోసం పోరాడనున్నాడు. ఆదివారం జరిగే ఫైనల్లో అతను ఇండోనేషియాకు చెందిన 19 ఏళ్ల ముహమ్మద్ యూసుఫ్‌తో తలపడనున్నాడు. తన తోటి ఇండోనేషియా ఆటగాడు బిస్మో ఒక్టోరాపై వరుస గేమ్‌లలో విజయం సాధించిన తర్వాత యూసుఫ్ ఫైనల్‌కు చేరుకున్నాడు. మరోవైపు, భారత యువ మిక్స్‌డ్ డబుల్స్ జోడీ సాత్విక్ కనపురం-రేషికా ఉతయసూరియన్ సెమీఫైనల్లో ఇండోనేషియా జంట చేతిలో ఓడిపోయింది.

వాణిజ్యం

## వడ్డీరేట్లు తగ్గించిన ఎస్‌బిఐ




**న్యూఢిల్లీ, డిసెంబరు 13:** దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) తన కీలక రుణ రేట్లతో పాటు ఎంపిక చేసిన టర్మ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లను స్వల్పంగా తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. ఈ కొత్త రేట్లు ఈ నెల 15 నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ నిర్ణయంతో గృహ, వాహన, ఎంఎస్‌ఎంఈ రుణాల ఈఎంఐల భారం తగ్గనుంది. అన్ని కాలపరిమితులపై మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేటు (ఎంసీఎల్‌ఆర్)ను 5 బేసిస్ పాయింట్ల మేర ఎస్‌బీఐ తగ్గించింది. దీంతో ఏడాది కాలపరిమితి గల ఎంసీఎల్‌ఆర్ 8.70 శాతానికి చేరింది. అలాగే ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ లెండింగ్ రేటు (ఈబీఎల్‌ఆర్)ను 25 బేసిస్ పాయింట్లు తగ్గించి 7.90 శాతంగా నిర్ణయించింది. పాత రుణ గ్రహీతలకు వర్తించే బేస్ రేటును కూడా 10.00 శాతం నుంచి 9.90 శాతానికి తగ్గించింది. మరోవైపు రూ.3 కోట్ల లోపు రిటైల్ టర్మ్ డిపాజిట్లపై కూడా వడ్డీ రేట్లను సవరించింది. 2 నుంచి 3 ఏళ్లలోపు డిపాజిట్లపై వడ్డీని 6.45 శాతం నుంచి 6.40 శాతానికి తగ్గించింది. సీనియర్ సిటిజన్లకు ఇదే కాలపరిమితిపై వడ్డీ రేటు 6.95 శాతం నుంచి 6.90 శాతానికి తగ్గింది. ప్రజాదరణ పొందిన అమృత్ వృష్టి 444రోజుల డిపాజిట్ పథకంపై వడ్డీ రేటును 6.60 శాతం నుంచి 6.45 శాతానికి తగ్గించింది. ప్రభుత్వ రంగ బ్యాంకుల ఆర్థిక పనితీరు మెరుగుపడటంతో 2022-23 ఆర్థిక సంవత్సరం నుంచి వాటికి ప్రభుత్వం ఎలాంటి మూలధనం అందించలేదని ఇటీవలే కేంద్రం ప్రకటించింది.

### జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీకి

## రూ.330 కోట్లు జరిమానా





**కాలిఫోర్నియా, డిసెంబరు 13:** ప్రముఖ ఫార్మా దిగ్గజం జాన్సన్ అండ్ జాన్సన్‌కు అమెరికా కోర్టులో మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ సంస్థకు చెందిన బేబీ పౌడర్ వాడకం వల్ల తమకు ఒవేరియన్ క్యాన్సర్ వచ్చిందని ఇద్దరు మహిళలు దాఖలు చేసిన కేసులో వారికి అనుకూలంగా తీర్పు వెలువడింది. క్యాన్సర్ ముప్పు గురించి వినియోగదారులను హెచ్చరించడంలో కంపెనీ విఫలమైందని నిర్ధారించిన కాలిఫోర్నియా జ్యూరీ, బాధితులకు 40 మిలియన్ డాలర్లు (సుమారు రూ.330 కోట్లు) నష్టపరిహారంగా చెల్లించాలని ఆదేశించింది. ఈ తీర్పు ప్రకారం ఒక బాధితురాలికి 18 మిలియన్ డాలర్లు, మరో బాధితురాలికి 22 మిలియన్ డాలర్లు పరిహారంగా అందుతాయి. దశాబ్దాలుగా తాము జాన్సన్ అండ్ జాన్సన్ బేబీ పౌడర్‌ను వాడుతున్నామని, దానిలో ఉన్న ఆరోగ్య ప్రమాదాల గురించి తమకు తెలియదని బాధితులు తమ పిటిషన్‌లో ఆరోపించారు. వారి వాదనలతో ఏకీభవించిన జ్యూరీ ఈ మేరకు తీర్పు ఇచ్చింది. టాల్క్ ఆధారిత బేబీ పౌడర్ భద్రతకు సంబంధించి జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీ న్యాయపరమైన చిక్కులను ఎదుర్కోవడం ఇదే మొదటిసారి కాదు. గతంలో కూడా ప్రపంచవ్యాప్తంగా వేలాది కేసులు దాఖలు కాగా, పలు తీర్పులు కంపెనీకి వ్యతిరేకంగా వచ్చాయి. తాజా తీర్పుతో సంస్థకు మరోసారి చట్టపరంగా ఇబ్బందులు తప్పలేదు.

## ఐపిఒల హవా!

### లిస్టింగ్‌తో మరికొన్ని మార్కెట్ ఎంట్రీ!

**ముంబయి, డిసెంబరు 13:** స్టాక్ మార్కెట్లలో ఐపిఒల హవా కొనసాగు తోంది. కొత్త ఐపిఒల కొనుగోళ్లు,మరోవైపు కంపెనీల లిస్టింగ్‌లతో వచ్చేవారం అంటే 15-19 తేదీలమధ్య సందడి వాతావరణం కనిపించనున్నది. మెయిన్‌బోర్డునుంచి ఒకే ఒక్క సంస్థ పబ్లిక్ ఇష్యూకు సిద్ధం అవుతుండగా కొరోనా రెమిడీస్, వేక్‌ఫిట్;ఐసిఐసిఐప్రుడెన్షియల్ ఎఎంసి వంటి సంస్థలు లిస్టింగ్‌కు రానున్నాయి. దీనితో కొత్త ఇష్యూలకంటే లిస్టింగ్‌లపైనే ఎక్కువ మందికి ఆసక్తి నెలకొంది. కెఎస్‌హాశ్రీచ్ ఇంటర్నేషనల్ ఒక్కటే వచ్చేవారం మెయిన్‌బోర్డు కేటగిరీలో కొనుగోళ్లకువస్తోంది. ఆఫర్‌ఫర్‌సేల్ కలిపి మొత్తం రూ.700 కోట్లు సమీకరించాలనినిర్ణయించింది. ఇష్యూ ఈనెల 16రన ప్రారంభం అయి 18న ముగుస్తుంది. రూ.365 నంచి రూ. 384గా ధరలునిర్ణయించారు. బిఎస్ఇ ఎన్‌ఎస్ఇల్లో ఈషేర్లు లిస్ట్ అవుతాయి.




ఎస్ఎంఇ సెగ్మెంట్‌లో మొత్తంమూడు కంపెనీలు వచ్చేవారం ఐపిఒకు వస్తున్నాయి. నప్ట్యూట్ లాజిటెక్ ఈనెల 15న ప్రారంభం అవుతుంది. మార్క్ టెక్నోక్రాట్స్, గ్లోబల్ ఓషన్ లాజిస్టిక్స్ కొనుగోళ్లు ఈనెల 17న ప్రారంభం అవుతాయి. ఇక మెయిన్‌బోర్డు కేటగిరీలో కొరోనా రెమిడీస్ ఫర్నిచర్ సంస్థ వేక్‌ఫిట్ ఇన్నొవేషన్ 15న స్టాక్ ఎక్స్ఛేంజిల్లో లిస్ట్ అవుతాయి. కొరోనా ఏకంగా 144 రెట్లు బిడ్డు అందుకుంది. వేక్‌ఫిట్ 2.52 రెట్లు కొనుగోలు అయింది. అదేరోజు రిద్ది డిస్‌ప్లే, ప్రొడాక్స్ సొల్యూషన్స్, కెవిటాయ్స్ షేర్లు ఎస్ఎంఇ కేటగిరీనుంచి ఎంట్రీ ఇస్తాయి. మెయిన్‌బోర్డులో నెఫ్రోకేర్ హెల్త్, పార్క్ మెడివరల్డ్ 17న లిస్టింగ్‌కు వస్తాయి. యునిసెమ్ అగ్రిటెక్, షిప్‌వేవ్స్ ఆన్‌లైన్ ఎస్ఎంఇ కేటగిరీలో మార్కెట్ ఎంట్రీ సిత్తాయి. పాజ్సన్ ఆగ్రో, హెచ్‌ఆర్ఎస్ అలుగ్లేజ్ ఎస్ఎంఇ కేటగిరీలోనే 18న లిస్ట్ అవుతాయి.

ఇక ఐసిఐసిఐప్రుడెన్షియల్ ఐపిఒ 19న లిస్టింగ్‌కు వస్తోంది. ఒకోషేరుధరల శ్రేణి 2061నుంచి 2165 రూపాయలుగా కంపెనీ నిర్ణయించింది. 19న లిస్టంగ్‌కు వస్తోంది. ఈ కంపెనీతోపాటే స్టాన్‌బిక్ ఆగ్రో, అశ్విని కంటెయినర్; ఎగ్జిమ్‌రూట్ కంపెనీలు ఎస్ఎంఇ సెగ్మెంట్‌లో మార్కెట్‌కు రానున్నాయి.




### గుర్తింపులేని క్లెయిమ్‌లపై

## ఐటిశాఖ నజర్

### పన్ను చెల్లింపుదారులకు సిబిడిటి హెచ్చరికలు

**న్యూఢిల్లీ, డిసెంబరు 13:** విరాళాలపేరిట చేసిన నకిలీ క్లెయిమ్‌లుచేసిన వారిపై ఇపుడు ఆదాయపు పన్నుశాఖ నిఘా పెంచింది. గుర్తింపులేని రాజకీయ పార్టీలు, ఛారిటీలకు విరాళాలపేరిట నకిలీ క్లెయిమ్‌లు ఎక్కువ వస్తున్నట్లు ఐటిశాఖ గుర్తించింది. ఇలాంటి వారిని గుర్తించి ఎస్ఎంఎస్‌లు, ఈమెయిల్స్ పంపిస్తున్నట్లు ఆశాఖ శనివారం ప్రకటించింది. పన్నుభారం తగ్గించుకోడానికి పెద్దసంఖ్యలో బోగస్ విరాళాలుచూపిస్తూ క్లెయిమ్‌లు నమోదయ్యాయని కొందరురిఫండ్లు కూడా క్లెయిమ్‌చేసినట్లు కేంద్ర ప్రత్యక్ష పన్నులబోర్డు ప్రకటించింది. ఈ పన్నుచెల్లింపుదారుల రిజిస్టరు మొబైల్ నంబర్లకు ఈనెల 12వ తేదీనుంచి సందేశాలు పంపిస్తున్నట్లు ఆర్థికశాఖప్రకటించింది. బోగస్ క్లెయిమ్‌లు దాఖలుచేసిన పన్ను చెల్లింపరదారులు తప్పులు సరిదిద్దుకునే అవకాశం కల్పిస్తున్నటట్లు చెప్పిన మంత్రిత్వశాఖ ఆ క్లెయిమ్‌లు విత్‌డ్రాచేసుకుని ఐటిఆర్‌లు అప్‌డేట్‌చేసుకోవాలనిసూచించింది. రిజిస్టరు అయిన గుర్తింపులేని రాజకీయ పార్టీలో అంటే ఆర్‌యుపిపిలు చాలావరకూ పన్నులు ఫైల్‌చేయడంలేదని, రిజిస్టర్డు చిరునామాల్లో ఎలాంటి కార్యకలాపాలు లేవని, ఎలాంటి రాజకీయ కార్యకలాపాల్లోను పాల్గొనడంలేదని సిబిడిటి గుర్తించింది. ఈ పార్టీలు నిధులు అక్రమంగా తరలింపు హవాలా లావాదేవీలు, సీమాంతర చెల్లింపులు బోగస్‌రసీదులు జారీ వంటి వాటిలో నిమగ్నం అయినట్లు గుర్తించింది. ఇలాంటి పార్టీలు, ట్రస్టులపై సోదాలునిర్వహిస్తే వ్యక్తుల బోగస్ విరాళాలు, కంపెనీల బోగస్ సిఎస్‌ఆర్‌ల గుట్టు మొత్తం బయటపడింది.

## బిఎస్ఇ-ఇండియాపోస్ట్ ఒప్పందం

### మ్యూచువల్ ఫండ్స్‌పై ప్రజలకు అవగాహన

**న్యూఢిల్లీ, డిసెంబరు 13:** బాంబేస్టాక్ ఎక్ఛేంజి, ఇండియాపోస్ట్‌లు మ్యూచువల్ ఫండ్స్ సేవలందించేందుకు అవగాహణ ఒప్పందంచేసుకున్నాయి. దేశవ్యాప్తంగా ఇండియాపోస్ట్ సేవలను అనుసరించి మూచువల్‌ఫండ్ సేవలు అందుకోవచ్చని ఈ ఒప్పందం సారాంశం. ఆర్థిక సేవల ఉత్పత్తులు అందుబాటులో లేని మిలియన్లకొద్దీపౌరులకు ఈ సేవలు చేరువచేస్తాయని చెపుతున్నారు. ఎంపికచేసిన పోస్టల్ ఉద్యోగులకు శిక్షణ ఇచ్చి ఎంఎఫ్ పంపిణీదారులుగా వారిని రూపొందిస్తారు. పోస్టల్ సిబ్బంది కస్టమర్లకు తగు సూచనలు, సలహాలిస్తూ పెట్టుబడుల నిర్ణయాలపై వారికి చేదోడుగా ఉంటారు. వారి లావాదేవీల నిర్వహణలో సాయం చేస్తారు. బిఎస్ఇ స్టార్ ఎంఎఫ్ పేరిట దేశంలోనే అతిపెద్ద మూచువల్‌ఫండ్ ప్లాట్‌పామ్‌పై ఈ లావాదేవీలునిర్వహిస్తారు. రెండుసంస్థలు చేసుకున్న ఒప్పందం మూడేళ్ల పాటు అమలులో ఉంటుంది. 2025 డిసెంబరు 12నుంచి 2028




డిసెంబరు 11వ తేదీవరకూ ఈ ఒప్పందం లమలులో ఉంటుందని ఉన్నతాధికారులు తెలిపారు. అధీ కృత సిబ్బంది ఎంప్లాయీ యూనిక్ ఐడెంటిఫికేషన్ నంబర్స్ ఈయుఐ ఎన్‌లు కూడా అందచేస్తారు. ఈ ఒప్పందం అనుసరించి బిఎస్ఇ పోస్టల్ ఉద్యోగులకు ఎన్ఃఐఎస్ఎం మూచువల్‌ఫండ్ పంపిణీదారుడిగా సర్టిఫికేట్ కూడా జారకీచేస్తుంది. మొదటి విడతగా రెండు,మూడోశ్రేని పట్టణాలకు అందుతాయి. మారు మూల గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఈసేవలు అందిస్తాయి. శిక్షణపొందిన పోస్టల్ ఉద్యోగులే ఇందుకు మార్గదర్శకులుగా ఉంటారు.




### కొత్త సంవత్సరంలో

### బిఎస్ఇ, ఎన్ఎస్ఇలకు

## సెలవులు ఇవే!

**న్యూఢిల్లీ, డిసెంబరు 13:** కొత్తకేలండర్ సంవత్సరానికి సంబంధించి స్టాక్ మార్కెట్ల సెలవుల జాబితా బిఎస్ఇ, ఎన్ఎస్ఇలు విడుదలచేసాయి. వారాంతాల్లోకాకుండా 2026 సంవత్సరం మొత్తంమీద పండుగలు,ఇతర ప్రధాన రోజులకారణంగా 15రోజులు సెలవులు ఉన్నాయి. ఈక్విటీట్రేడింగ్స్, డెరివేటివ్స్, సెక్యూరిటీస్ కార్యకలాపాలు నిలిచిపోతాయి. ఆయా తేదీలప్రకారం పెట్టుబడి, ట్రేడింగ్ వ్యూహాలనున సిద్ధంచేసుకోవాలని స్టాక్ ఎక్ఛేంజిలు సూచించాయి. జనవరి 26 రిపబ్లిక్‌డే సందర్భంగా బిఎస్ఇ ఎన్ఎస్ఇలకు సెలవు. మార్చి 3న హోలి మార్చి 25న శ్రీరామ నవమి, మార్చి 31న మహావీర్‌జయంతి సందర్భంగా మార్కెట్లు శెలవులో ఉంటాయి. ఇక ఏప్రిల్3న గుడ్‌ఫ్రైడే, 14న డా బిఆర్ అంబేద్కర్ జయంతి, మే 1న మహారాష్ట్రడే, మే 28న బక్రీద్, జూన్ 26న మొహర్రం సందర్భంగా ఆయారోజుల్లో స్టాక్ మార్కెట్లకు సెలవు.మళ్లీ సెప్టెంబరు 14న వినాయక చవితి, అక్టోబరు 2న మహాత్మాగాంధీజయంతి, అక్టోబరు 20న దసరా సందర్భంగా స్టాక్ మార్కెట్లు రెండింటికీ సెలవులుంటాయి. డిసెంబరు 25న క్రిస్మస్‌సందర్భంగా కార్యకలాపాలు కూడా నిలిచిపోతాయి. అయితే మహాశివరాత్రి ఫిబ్రవరి 15న,ఈత్ ఉల్‌ఫితర్ మార్చి 21వ తేదీ స్వాతంత్ర్య దినోత్సవం ఆగస్టు 15, నవంబరు 8 దీపావళి లక్ష్మీపూజ శని, ఆదివారాల్లో వస్తున్నాయి. ఆరోజుల్లో స్టాక్ మార్కెట్లకు ఎలాగూ సెలవు దినాలే. దీపావళి లక్ష్మీపూజ ఆదివారం కావడంతో అదేరోజు మూతర్‌ట్రేడింగ్ నిర్వహిస్తారు. ట్రేడింగ్ సమయాన్నికొద్దిరోజులముందు మాత్రమే ప్రకటిస్తారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.